


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 03-03-2026 మంగళవారం | సంపుటి : 14 | సంచిక :84 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on



ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్ చేసిన ఉమ్మడి క్షిపణి దాడి పశ్చిమాసియా వ్యాప్తంగా ఉద్రిక్తతలకు దారి తీసింది. తమ పై జరిగిన దాడికి ప్రతిగా ఈ ప్రాంతంలో గల అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని తెహ్రాన్ దాడులు జరపడమే కాదు, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా ఉన్న హోర్ముజ్ జలసంధిపై పట్టుబిగించింది. యుద్ధం ప్రారంభమైన రెండవ రోజే, జలసంధి ద్వారా చమురు ఓడలను అనుమతించమని ప్రకటించి, ఆరు ఓడలపై దాడులు జరిపింది. తమ మతపరమైన సుప్రీం నాయకుడు ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ దాడులలో హతం చేశారని, వారితో చర్చలలో పాల్గొనే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. అంతేనా, పశ్చిమాసియాలోని యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్, దుబాయ్, బహ్రెయిన్, ఒమాన్, కువైట్ సహా గల్ఫ్ ప్రాంతాన్ని అగ్నికి ఆహుతి ఇస్తోంది. ప్రేమలో, యుద్ధంలో ఏదైనా సమంజసమేనన్న రీతిలో ఇరుపక్షాలూ పరస్పర దాడులకు పాల్పడుతూ ప్రపంచం వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు.



## తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలన్న తెలంగాణ భవన్ అధికారులు

వందన బరువా : +91 9871999044
సీహెచ్. చక్రవర్తి : +91 9958322143
జావేద్ హుస్సేన్ : 9910014749
రక్షిత్ నాయక్ : +91 9643723157

2

## ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం

చమురు టాంకర్‌పై దాడి

ఒక భారత జాతీయుడి మృతి 3

## దేశంలో హై అలర్ట్

- పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులతో అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచన
- మతపర అల్లర్లు జరిగే అవకాశం
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ లేఖ
- గూఢచారి విభాగాల మధ్య సమన్వయంపై దిశానిర్దేశం
- హైదరాబాద్, కర్నాటక, ఢిల్లీ, యూపీలో నిరసనలపై ఆరా
- హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు
- ఇరాన్ లోని టెహ్రాన్, కుమ్‌లో 2వేల మంది తెలంగాణ విద్యార్థులు, ఉద్యోగులు
- అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి
- జగిత్యాల జిల్లావాసుల భద్రతపై మంత్రి అడ్లూరి ఆందోళన



**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి) :** ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ దాడులు, ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. యుద్ధవాతావరణం నేపథ్యంలో భాతదశంలో మతపర అల్లర్లు జరిగే అవకాశం ఉందని

మిగతా 2లో

## గల్ఫ్ ప్రాంతాన్ని ముంచెత్తుతూ

# విస్తరిస్తున్న యుద్ధం

### నెతన్యాహూ కార్యాలయంపై దాడి చేశాం : ఇరాన్

### అది తప్పుడు ప్రచారం : ఇజ్రాయెల్

3



**బ్రహెయిన్, సౌదీ అరేబియా అధిపతులతో మాట్లాడిన మోడీ**

**ఆ ప్రాంతంలోని భారతీయుల భద్రత గురించి ఆందోళన**



**న్యూఢిల్లీ, మార్చి 2 (వుదయం) :** బహ్రెయిన్, సౌదీ అరేబియా తదితర దేశాలపై ఇరాన్ దాడుల అనంతరం భారతీయుల భద్రత గురించి చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహ్రెయిన్ రాజు, సౌదీ ప్రిన్స్‌తో మాట్లాడారు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం సోమవారం తీవ్రంగా విస్తరించింది. తెహ్రాన్ మద్దతు కలిగిన మిలీషియాలను ఆకర్షించి , మధ్య ప్రాచ్య వ్యాప్తంగా దాడుల భౌగోళిక పరిధిని విస్తరించింది. ఇజ్రాయెల్, పలు ఆరబ్ దేశాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించగా, రాకెట్లతోనూ, డ్రోన్లతోనూ లెబనాన్ నుంచి హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై దాడులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా బీరూట్ దక్షిణ ప్రాంతం, లెబనాన్ దక్షిణంలో భారీ వైమానిక దాడులను ఇరాన్ చేపట్టింది. ఈ దాడులలో కనీసం 31మంది మరణించినట్టు లెబనీస్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ 100,000 కంటే ఎక్కువ మంది రిజర్విస్టులను సమీకరించి, దీర్ఘకాలిక పోరాటం గురించి హెచ్చరించింది. ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని చంపిన అమెరికా–ఇజ్రాయెల్ దాడుల తరువాత ఈ పెరుగుదల సంభవించింది. ఈ దాడులలో వందలాది మంది మరణించారని ఇరాన్ అధికారులు చెబుతున్నారు, ఇరానియన్ రెడ్ క్రెసెంట్ 131 నగరాల్లో కనీసం 555 మరణాలు సంభవించినట్టు పేర్కొంది. ఈ క్రమంలో తెహ్రాన్ తన వైఖరిని కఠినతరం చేసుకుంది.

మిగతా 2లో

## పన్ను ఎగవేతదారులపై విజిలెన్స్ కొరడా



2

- అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై నజర్
- ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి
- గత నెలలో ఐదు శాఖలపై ముమ్మర తనిఖీలు
- హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలు సీజ్

## పత్తాలేని జాబ్ క్యాలెండర్

### ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

రాహుల్ గాంధీని జాగృతి కవిత నిలదీత

యూత్ డిక్లరేషన్ ఓ బోగస్ 2

మీరు చెప్పినట్టు రెండు లక్షల ఉద్యోగాలివ్వండి

ఉద్యోగాలు అడిగితే పోలీసులతో అణిచివేస్తున్నారు



సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశమైన కవిత

# దేశం కోసం ప్రధాని అవుతా

**బీజేపీ ఆగడాల నుంచి దేశాన్ని రక్షించుకుందాం**

**మతతత్వ బీజేపీని అడ్డుకోవడం చాలా అవసరం**

**దేశంలో శాంతి, సమానత్వం, సామరస్యం ప్రమాదంలో ఉంది**

**మేము అహింసా సిద్ధాంతాన్ని పాటిస్తే.. బీజేపీ హింస మార్గాన్ని ఎంచుకున్నది**

**సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**





మన పార్టీ గుర్తు చేయి గుర్తు అంటే అభయ ముద్ర, ప్రపంచంలోని అన్ని మతాల చిహ్నం కూడా అభయ ముద్ర. అదే మన సిద్ధాంతం. ప్రధానంగా పార్టీలో మహిళలను గౌరవించాలి. వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. డీసీసీ అధ్యక్షులు పార్టీ బలోపేతం కోసం ప్రజల కోసం పని చేయాలి. మీ భవిష్యత్ నేను చూసుకుంటా. మీరు బాగా పని చేస్తే ఏ స్థాయి వరకు అయినా నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది

– రాహుల్ గాంధీ



**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి) :** బీజేపీ పాలనలో గాడి, అదుపు తప్పుతోన్న దేశంలో శాంతి, సమానత్వం, సామరస్యం స్థాపన కోసం, ఈ దేశం కోసం ప్రధానమంత్రి అవుతానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. పదకొండేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనకబాటుకు గురయిందనీ... ప్రధానంగా శాంతి భద్రతల స్థాపన విషయంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ద్వేషం ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తోం దన్న రాహుల్ గాంధీ.. మనం అప్రమతంగా ఉండి బీజేపీ ఆగడాలను అడ్డుకొని దేశాన్ని రక్షించాలన్నారు.

మిగతా 2లో

## రాహుల్‌ను ప్రధానిని చేద్దాం

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యం

ప్రజా జీవితంలో పైరవీలు చేయలేదు

ప్రజా సమస్యలపై గళం విప్పిన నాపై కేసులు పెట్టారు : సిఎం రేవంత్ రెడ్డి

రాహుల్ సూచనతోనే బీసీలకు ప్రాధాన్యత : టీపీసీసీ చీఫ్ 2

### పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే

## ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటనలా?

### సూర్యాపేట మైనింగ్ వేలంలో భారీ అక్రమాలు

విచారణ జరిపి, టెండర్లు రద్దు చేయాలి

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



**హైద రాబాద్, మార్చి 2 (ఎఎంఎస్) :** సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం , లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని కేటీఆర్ అందులో విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్–2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన, కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు.

మిగతా 2లో

### తెలంగాణలో

## బుల్డోజర్ రాజ్

- కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పేదల ఇండ్లు కూల్చుతున్నారు
- ఎక్స్ వేదికగా కేరళ సీఎం పినరయి విజయన్



**హైదరాబాద్, మార్చి 2 (ఎఎంఎస్) :** తెలంగాణలో బుల్డోజర్ రాజ్ నడుస్తోందని కేరళ సీఎం పినరయి విజయన్ విమర్శించారు. కేంద్రం లో బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పేద ప్రజల ఇండ్లపై బుల్డోజర్లు నడిపిసదతున్నారని ఆరోపించారు. ఖ మ్మం జిల్లాలో ఇటీవల జరిగిన ఇళ్ల కూల్చివేతలపై సోమవారం ఆయన ఎక్స్ వేదికగా తప్పుబట్టారు. ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు బుల్డోజర్ రాజ్"ను తలపిస్తోందనీ వందలాది పేద కుటుంబాలను ముందస్తు నోటీసులు లేకుండానే రోడ్డున పడేశారని ఆయన ఆరోపించారు. గత నెల 25న తెల్లవారుజామున, ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే సుమారు 700 ఇళ్లను నేలమట్టం చేశారని విమర్శించారు.

మిగతా 2లో

## ఆ ముగ్గురి డీఎన్ఏ ఒక్కటే

ట్రంప్, మోడీ, నెతన్యాహులకు ముస్లింలపై ద్వేషం

భారత్, ఇజ్రాయిల్ లో మతం ఆధారంగా పాలన

అమెరికాలో ట్రంప్ జాత్యాహంకారాన్ని పెంచిపోషించారు

ఇరాన్ అధ్యక్షుడి మృతిపై స్పందించని మోడీ..

సౌదీపై దాడిని ఖండించడమేంటీ..?

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్ కుమార్

2



## హైదరాబాద్ ఏసీ బస్సుల్లో టికెట్ ధరలు తగ్గింపు

2

రూ.5 నుంచి రూ.10 వరకు రాయితీ

# తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్

**పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

**ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలన్న తెలంగాణ భవన్ అధికారులు**




**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24×7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. మేరకు తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని వారి యోగక్షేమాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని సూచించారు. దీనికి సంబంధించి సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లను అధికారులు వెల్లడించారు.

# పన్ను ఎగవేతదారులపై విజిలెన్స్ కొరడా

**అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై నజర్**

**ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి**

**గత నెలలో ఐదు శాఖలతో ముమ్మర తనిఖీలు**

**హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలు సీజ్**






**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులు, అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టిసారించింది. ఈ మేరకు గత నెలలో రవాణా, జీఎస్టీ, గనులు, అటవీ, పోలీస్ శాఖలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో భారీగా అక్రమాలను గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలను తనిఖీ చేసిన సంబంధిత అధికారులు వివిధ నిబంధనల ఉల్లంఘనల కింద 200 వాహనాలను సీజ్ చేశారు. స్పెషల్ రెయిడ్స్‌లో భాగంగా 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పాల్గొన్న 6 ఎక్స్‌కవేటర్లు, 15 ట్రాక్టర్లు సహా మొత్తం 24 వాహనాలను జప్తు చేసి, 19 మందిని అరెస్ట్ చేశారు. పీడీఎస్ బియ్యం దారి మళ్లింపుపై జరిపిన తనిఖీల్లో సుమారు 5.8 లక్షల విలువైన 131 క్వింటాళ్ల బియ్యం, 27 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్కడి లోపాలను సరిదిద్దాల్సిందిగా సంబంధిత శాఖలకు నివేదించారు.

ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. గత నెలలో నిర్వహించిన ఆపరేషన్లతో ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి పడిందన్నారు. అందులో ఇప్పటి వరకు రూ.1.96 కోట్లను వసూలు చేశామని తెలిపారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేసినా.. అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలియజేయాలని సూచించారు.

# విస్తరిస్తున్న యుద్ధం

**మొదటి పేజీ తరువాయి..**

వాషింగ్టన్ చర్చలకు సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇచ్చినప్పటికీ, సీనియర్ అధికారి అలీ లారిజాని మాత్రం ఇరాన్ అమెరికాతో చర్చలు జరపదు అని స్పష్టం చేశారు. ఈ వివాదం ఇప్పుడు ప్రపంచ ఇంధన మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. ఇరానియన్ డ్రోన్లు సౌదీ అరేబియాలోని రాస్ తనూరా శుద్ధి కర్మాగారాన్ని ఢీకొట్టాయి, దీనితో రోజుకు అర మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురును శుద్ధి చేసే సౌకర్యం వద్ద కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధి చుట్టూ దాడులు, బెదిరింపులు చమురు సరఫరా మార్గాలపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. అణు భద్రతా ఆందోళనలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రాఫెల్ గ్రాస్సీ మాట్లాడుతూ, ఇరాన్ అణు కేంద్రాలు ఇప్పటివరకు దెబ్బతిన్నట్లు ఎటువంటి సూచనలు లేవని, అయితే ఈ ప్రాంతంలో పనిచేసే రియాక్టర్లు తీవ్రమైన రేడియోలాజికల్ ఘటన జరిగే ప్రమాదాన్ని పెంచుతాయని హెచ్చరించారు. ప్రాంతీయ గగనతలాల మూసివేత, రాయబార కార్యాలయాల హెచ్చరికలు, తరలింపులు పెరుగుతున్న అంతర్జాతీయ పరిణామాలను నొక్కి చెబుతున్నాయి.

## పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటనలా?

**మొదటి పేజీ తరువాయి..**

కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అన్న కేటీఆర్... అయినప్పటికీ ప్రభుత్వం ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు.




## పోషకాహారంతో టీబీ నిర్మూలన

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

*వ్యాధిగ్రస్తులకు రూ.25 లక్షల విలువైన 500 పోషకాహార కిట్లు పంపిణీ*

**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి):**

టిబి వ్యాధిగ్రస్తులకు మెడిసిన్స్‌తో పాటు పోషకాహారం అందిస్తే వ్యాధిని త్వరితగతిన నిర్మూలించవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అభిప్రాయపడ్డారు. సోమవారం ట్యూబర్‌కులోసిస్ (టిబి) రోగులకు పోషకాహార అందించే దిశగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద "ప్రాజెక్ట్ ఓజస్"కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నాంపల్లిలోని కేర్ హాస్పిటల్స్ లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్యూబర్‌కులోసిస్ ఒక సంక్రమణ వ్యాధి అన్నారు. ఇది బ్యాక్టీరియాతో వస్తుందన్న ఆమె సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. టిబిని అపహాస్యంగా చూడకూడదనీ ఇది సమాజంలోని అన్ని వర్గాల వారిని ప్రభావితం చేసే వ్యాధి అని పేర్కొన్నారు. టిబి వ్యాధి ఇన్ఫెక్షన్‌తో వచ్చినప్పటికీ, పోషకాహార లోపం శరీర రోగనిరోధక శక్తిని తగ్గించి టిబి వ్యాధి ప్రబలడానికి కారణమవుతుందని వివరించారు. ముఖ్యంగా ప్రోటీన్లు, సూక్ష్మ పోషకాల లోపంతో రోగనిరోధక శక్తి తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలు సమతుల్య, ప్రోటీన్, పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని వినియోగించాలని సూచించారు. టిబి కేవలం ఊపిరితిత్తులకే కాకుండా శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయగలదని తెలిపారు. అందుకే ప్రారంభదశలోనే స్క్రీనింగ్ ద్వారా గుర్తించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. చికిత్స పూర్తిగా తీసుకోకపోతే వ్యాధి తీవ్రమై ఔషధ నిరోధక రూపాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. హైదరాబాద్ జిల్లాలో ప్రస్తుతం 19 టిబి చికిత్స కేంద్రాలు పని చేస్తున్నాయనీ 10వేలకు పైగా టిబి రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 7.5 లక్షల మందికి పైగా స్క్రీనింగ్ నిర్వహించగా, రాబోయే నెలల్లో మరిన్ని 2.5 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక టిబి రోగి చికిత్స లేకపోతే గాలిమార్గం ద్వారా పలువురికి వ్యాధిని వ్యాప్తి చేయగలడన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా టిబి స్క్రీనింగ్‌కు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య శాఖ అధికారులు స్క్రీనింగ్‌ను మరింత విస్తరించి, ప్రతి కేసును ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తిస్థాయి చికిత్స అందించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టిబి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి, జిల్లా టిబి నియంత్రణ అధికారి డా. చల్లా దేవి, కేర్ హాస్పిటల్స్ సీఈఓ పవన్ కుమార్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ నిఖిల్ మాథూర్, జగతి ఫౌండేషన్ సీఈఓ దుర్గా కల్యాణి, డా. ఫైజాన్ అజీజ్, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ సిబ్బంది, వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

# దేశంలో హై అలర్ట్

**మొదటి పేజీ తరువాయి..**

అందువల్ల అలర్ట్ గా ఉండాలని ఈ మేరకు కేంద్ర హోం శాఖ రాష్ట్రాల పోలీసు శాఖలకు లేఖ రాసింది. ముఖ్యంగా మతపరమైన సభలు, ప్రార్థనా స్థలాలలో ఇరాన్ అనుకూల రాడికల్ బోధకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం అటువంటి వాటిపై నిఘా ఉంచాలని ఆదేశించింది. దేశీయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, గూఢచారి విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. మరోవైపు.. ఖమేనీ మృతికి నిరసనగా భారత్ లోని ముఖ్యమైన నగరాల్లో ఆదివారం భారీ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

హైదరాబాద్, కర్నాటక, ఢిల్లీ, యూపీతో పాటు పలు ముఖ్యమైన నగరాల్లో ఖమేనీ మృతిపై ప్రజలు నిరసన తెలిపారు. వీటిని ఆసరాగా చేసుకుని కొంత మంది హింసాత్మక ఘటనలకు దారి తీసేలా రెచ్చగొట్టే అవకాశం ఉందని, దీనిని అదుపు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా జాగ్రత్త వహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఆదివారం రాత్రి ప్రధాని మోడీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమీక్షించింది.

**ఇరాన్ లో 2వేల మంది తెలంగాణ విద్యార్థులు...**

ఇజ్రాయెల్, అమెరికా తమపై జరుపుతున్న దాడులకు ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. గల్ఫ్ కంట్రీస్ పై ఇరాన్ బాంబుల వర్షం కురిపిస్తోంది. ఈ ఇరు వర్గాల మధ్య జరుగుతున్న దాడులు భీకర స్థితికి చేరుకోవడంతో యుద్ధ ప్రభావిత దేశాల్లో ఉంటున్న భారతీయుల భద్రతపై తమ వారిలో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఉపాధి నిమిత్తం తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో ఉంటున్న తెలంగాణ వాసుల పట్ల వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఇరాన్‌లోని పలు నగరాల్లో ఒక్క తెలంగాణకు చెందిన 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో ఒక్క హైదరాబాద్ నగరం నుంచే 900 మంది ఆ దేశంలో ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా.. ఇరాన్ కూడా ప్రతి దాడులు చేస్తోంది. మరోవైపు.. ఇంటర్నేషనల్ విమానాలు భారీగా రద్దు కావడంతో ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు.. తిరిగి స్వదేశాలకు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పిల్లల కోసం ఇక్కడ వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ఇప్పుడు తెలంగాణ, మరీ ముఖ్యంగా హైదరాబాద్ వాసులను తీవ్రంగా భయపెడుతోంది. హైదరాబాద్‌కు చెందిన 900 మంది విద్యార్థులు ఇరాన్‌లోని టెహ్రాన్, కుం వంటి నగరాల్లో చదువుకుంటున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ రెండు రోజుల క్రితం జరిపిన ఆకస్మిక దాడితో అక్కడ ఉన్న తెలుగు వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ, టోలీచౌకి ప్రాంతాల్లోని విద్యార్థులను తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులు, ఇంజనీర్లతో పాటు బిజినెస్‌మెన్‌లు తరచూ హైదరాబాద్ నుంచి ఇరాన్‌కు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇక ఇరాన్‌లో ఉన్న హైదరాబాదీలకు సంబంధించిన సమాచారం తెలియకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇరాన్‌లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని అక్కడి ప్రభుత్వం ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేయడంతో.. తమ వారి ఫోన్లు కూడా కలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలుగువారు అప్రమత్తంగా ఉండండి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దాడుల నేపథ్యంలో అక్కడి అధికారులు సూచించే భద్రతా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఆ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ అయితేనే తప్ప బయటకు రావద్దని హితవు పలికారు. ఇరాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో తాము సమన్వయం చేసుకుంటామని వివరించారు. పరిస్థితిని తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నాయని చెప్పారు. జగిత్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఎక్కువగా జీవనోపాధి కోసం దుబాయ్, ఖతార్, ఇరాన్ వంటి గల్ఫ్ దేశాలకు వెళ్లారన్న ఆయన ఆ దేశాల్లో చిక్కుకున్న జగిత్యాల ప్రజల సమస్యలను రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# దేశం కోసం ప్రధాని అవుతా

**మొదటి పేజీ తరువాయి..**

"సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాహుల్ గాంధీ, కేసి వేణు గోపాల్, సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అహింస, శాంతి, సత్యాన్వేషణ అన్నారు. ఈ సిద్ధాంతాల ఆచరణ కోసం ప్రతి కార్యకర్త నిరంతరం పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సమానత్వ సిద్ధాంతానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్న రాహుల్ గాంధీ.. కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా, పేద ధనిక అనే తార తమ్యాలు లేకుండా అందరిని గౌరవిస్తూ పార్టీని నడిపించాలని పార్టీ జిల్లాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. అహంకారాన్ని విడి పార్టీ, ప్రజల కోసం పని చేయాలని సూచించారు. ప్రజలు పార్టీకి బలం కావాలనీ అదే సమయంలో పార్టీ ప్రజలకు బలం కావాలన్నారు. ప్రజలతో కలిసిపోయి వారితో మమేకం అయ్యి వారి కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేసే విధంగా మన కార్యాచరణ ఉండాలన్నారు. మన పార్టీ గుర్తు చేయి గుర్తు అంటే అభయ ముద్ర, ప్రపంచంలోని అన్ని మతాల చిహ్నం కూడా అభయ ముద్రనే అన్నారు. అదే మన సిద్ధాంతమన్నారు. ప్రధానంగా పార్టీలో మహిళలను గౌరవించాలన్న రాహుల్ గాంధీ.. వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా బాధ్యులకు సూచించారు. డీసీసీ అధ్యక్షులు పార్టీ బలోపేతం కోసం ప్రజల కోసం పని చేయాలన్నారు. మీ భవిష్యత్ నేను చూసుకుంటా. మీరు బాగా పని చేస్తే ఏ స్థాయి వరకు అయినా నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని భరోసా ఇచ్చారు. మీ కార్యాచరణ మీ పని విధానము.. ప్రజల కోసం ఉండాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వసం ఏర్పడి వాళ్ళు పార్టీ వైపు ఆకర్షితులు కావాలన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి ఆకర్షణ కోసం కాదనీ అది ఒక బాధ్యతగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ అంటే శాంతి, అహింస, సత్య వాక్కు వీటితోనే మనం ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ప్రజల సమ్మతితోనే మనం అధికారంలోకి రావాలన్నారు.

**రాహుల్ ను ప్రధాని చేద్దాం..**

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశం కోసమైనా రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదని అన్నారు. గతంలో ప్రజా సమస్యలపై గళం విప్పిన నాపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ అంశాలపై నేతలతో రాహుల్ గాంధీ చర్చించారు.

## రాహుల్ సూచనతోనే బీసీలకు ప్రాధాన్యత

*టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్*

రాహుల్ గాంధీ చూపిన బాటలో తెలంగాణ లో బిసి లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. వందేళ్లలో చేయని కులగణన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి చరిత్ర ఎన్నడు లేని విదంగా సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారన్నారు. ఆ బిల్లు అమలు కాకుండా బీజేపీ, బిఆర్ఎస్ లు కుట్రలు చేస్తే పార్టీ పరంగా బిసి లకు.పంచాయతీ, మునిసిపల్, కార్పొరేటర్లు లలో అధిక ప్రాధాన్యత ఇచ్చి వారిని గెలిపించి నిరూపించామని చెప్పారు. చట్టపరంగా 28 శాతం బిసి లకు రిజర్వేషన్లు ఉంటే అనేక జనరల్ స్థానాలలో బిసి లను నిలబెట్టి గెలిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. అత్యంత కీలకమైన డీసీసీ ల నియామకంలో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చామన్న మహేశ్ కుమార్ గౌడ్... త్వరలోనే అన్ని జిల్లా కమిటీలు పూర్తి చేసి పార్టీ ని అత్యంత బలోపేతం చేస్తామని ప్రకటించారు.డీసీసీ అధ్యక్షులకు 10 రోజుల పాటు పార్టీ సిద్ధాంతాలపై సంపూర్ణంగా శిక్షణ ఇవ్వడం అందులో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనడం చరిత్రాత్మకమైందని చెప్పారు.

# పత్తాలేని జాబ్ క్యాలెండర్

**రాహుల్ గాంధీకి జాగృతి కవిత నిలదీత**

**యూత్ డిక్లరేషన్ బోగస్**

**మీరు చెప్పినట్టు రెండు లక్షల ఉద్యోగాలివ్వండి**

**ఉద్యోగాలు అడిగితే పోలీసులతో అణిచివేస్తున్నారు**



**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ లో అధికారంలోకి వస్తే ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ...తెలంగాణ యువతను పచ్చి దగా చేశారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం హైదరాబాద్ కు వస్తున్న రాహుల్ గాంధీని.. కవిత ఎక్స్ వేదికగా నిలదీశారు. మిమ్మల్ని నమ్మి ఓటు వేసిన నిరుద్యోగుల గోడు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కు ఓటు వేసినందుకు వారంతా శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ పార్టీ గద్దెనెక్కడానికి నిచ్చెనమెట్లుగా నిలిచిన యువత ఆశలను, ఆకాంక్షలను చిదిమేశారంటూ రాహుల్ గాంధీ పై మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్ ను బోగస్ చేశారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అంటనే మోసం, వంచన అన్న దాన్ని మరోసారి నిరూపించారన్నారు. ఉద్యోగాలిస్తామన్న మీ మాటను నిలబెట్టుకోమంటే పోలీసులతో అణిచివేస్తారా? రాహుల్ జీ ఇది పోరాటాల పురిటిగడ్డ గుర్తు పెట్టుకోండని కవిత హెచ్చరించారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోతే...నిరుద్యోగులంతా కాంగ్రెస్ కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని అన్నారు.

**ముందస్తు అరెస్టులు దుర్మార్గం..**

రాహుల్ గాంధీని అడ్డుకుంటారన్న నెపంతో తెలంగాణలో పోలీసులు ముందస్తు అరెస్ట్ లు చేయటాన్ని కల్వకుంట్ల కవిత ఖండించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సింది పోయి...అర్ధరాత్రి నిరుద్యోగులను, జాగృతి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయటం దుర్మార్గమని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అక్రమంగా అరెస్ట్ చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# ఆ ముగ్గురి డీఎన్ఏ ఒక్కటే

- ట్రంప్, మోడీ, నెతన్యాహులకు ముస్లింలపై ద్వేషం
- భారత్, ఇజ్రాయిల్‌లో మతం ఆధారంగా పాలన
- అమెరికాలో ట్రంప్ జాత్యాహంకారాన్ని పెంచి పోషించారు
- ఇరాన్ అధ్యక్షుడి మృతిపై స్పందించని మోడీ.. సౌదీపై దాడిని ఖండించడమేంటీ..?
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్ కుమార్

**హైదరాబాద్, మార్చి 2 (వుదయం ప్రతినిధి) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్, ఇజ్రాయిల్ ప్రధానమంత్రులు నరేంద్రమోడీ, నెతన్యాహు ముగ్గురి డీఎన్ఏ ఒక్కటేనని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ విమర్శించారు. ముస్లింలపై ద్వేషం నరనరాన పేరుకుపోయిందని ఆరోపించారు. భారత్ తో పాటు ఇజ్రాయెల్ లోనూ మతం ఆధారంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాలో ట్రంప్ జాత్యాహంకారాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశం సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఇందులో ఆ పార్టీ సీనియర్ కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడారు. అమెరికా ఫస్ట్ అని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నట్టుగా ఇండియా ఫస్ట్ అని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడానికి మోడీ సాగిల పడుతున్నారని విమర్శించారు. ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన మోడీ.. ఆ దేశ అధ్యక్షుడు నెతన్యాహు మంచి పనులు చేస్తున్నారంటూ ప్రశంసించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇరాన్ ఇస్లాం మత నాయకుడు ఖమేనీ సహా మరో 40 మంది చనిపోతే స్పందించని మోడీ.. యూఏఈపై ఇరాన్ దాడి చేస్తే ఖండించారని గుర్తు చేశారు. వెనిజులా అధ్యక్షుడు మధురోను అపహరిస్తే అనేక దేశాలు ఖండించినా మోడీ మాత్రం స్పందించలేదని చెప్పారు. సోషలిస్టు క్యూబాను అమెరికా దిగ్బంధనం చేసిందన్నారు. విశ్వ గురు అని చెప్పున్న మోడీ గొంతెత్తడం లేదని అన్నారు.

**భారత్‌పై టారిఫ్‌ను తగ్గించని అమెరికా**

అమెరికాతో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని అరుణ్ కుమార్ చెప్పారు. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్ ను 18 శాతానికి తగ్గించడమే విజయంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గతంలో మూడు శాతం టారిఫ్ ఉండేదని గుర్తు చేశారు. భారత్ లో అమెరికా వస్తువుల దిగుమతిపై 30 శాతం టారిఫ్ లు ఉంటే దాన్ని సున్నా శాతానికి తగ్గించిందని వివరించారు. దీనివల్ల భారత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, సోయాబీన్ దిగుమతి చేసుకుంటే ఆ రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఇప్పటికే దిగుమతులు పెరగడం, సబ్సిడీలు తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం వచ్చాక ఆత్మహత్యలు తగ్గాయని వివరించారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్వరూపాన్ని పూర్తిగా మార్చి వేసిందన్నారు. దీంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హక్కుగా ఉండబోదని అన్నారు. కేంద్రం నిర్ణయాల వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టివేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అణుఒప్పందం చట్టంలోనూ కేంద్రం మార్పులు చేసిందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అణురియాక్టర్‌లు తయారు చేసే వారిని కాకుండా నిర్వాహకులను శిక్షించాలంటూ నిబంధనలను మార్చిందని చెప్పారు. భోపాల్ దుర్ఘటన జరిగినా యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.

**ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్ర..**

అస్సాం సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు రాబోతున్నాయని, అస్సాంలో ముస్లిం వ్యతిరేకతను పెంచడం ద్వారా మత వైషమ్యాలను పెంచి గెలిచేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అరుణ్ కుమార్ విమర్శించారు. బంగ్లాదేశ్ నుంచి ముస్లింలు వచ్చారని ప్రచారం చేస్తున్నదని చెప్పారు. అక్కడి భూములను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నదని అన్నారు. కార్పొరేట్లు, సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. కేరళ సీఎం పినరయి విజయన్ పై కూడా తప్పుడు కేసులను నమోదు చేసిందన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బీహార్, పశ్చిమ బెంగాల్ లో లక్షల సంఖ్యలో ఓటర్లను తొలగించారని గుర్తుచేశారు. ఈసీ పక్షపాత.వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను ఈసీ అమలు చేస్తుందని చెప్పారు. మతం, కులం ఆధారంగా దాడి పెరిగిపోతున్నాయని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, ఆరు గ్యారంటీలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర బడ్జెట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్, దావోస్ పర్యటనలు చేసినా పెట్టుబడులు రాలేదని అన్నారు. ప్రచారార్భాటం తప్ప ఏమీ లేదన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం నాటకం ఆడుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, టి సాగర్, మల్లు లక్ష్మి , పి ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వరరావు, ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

# తెలంగాణలో బుల్డోజర్ రాజ్

**మొదటి పేజీ తరువాయి..**




పోలీసుల పహారాలో జరిగిన ఈ చర్య వల్ల దాదాపు 3వేల మంది పేదలు నిరాశ్రయులయ్యారని, వారందరి వద్ద అవసరమైన గుర్తింపు పత్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

**భూదాన్ ఉద్యమ స్ఫూర్తికే విఘాతం..**

వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో భాగంగా భూమి లేని పేదలకు కేటాయించిన 'వినోబా నగర్'లోని ఇళ్లను కూల్చివేయడం పట్ల కేరళ సీఎం విజయన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "1951లో ప్రారంభమైన భూదాన్ ఉద్యమ ఆశయాలను కూడా గౌరవించలేని స్థితిలో తెలంగాణ కాంగ్రెస్ ఉండటం ఆశ్చర్యకరం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**కేరళ మోడల్ వర్సెస్ కాంగ్రెస్ పాలన..**

తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల తీరును కేరళలోని ఎల్.డీ.ఎఫ్ ప్రభుత్వంతో ఆయన పోల్చారు:

**కేరళ విధానం:**

కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఇళ్లను నిర్మించి పునరావాసం కల్పిస్తోంది. పట్టాలు లేని వారికి కూడా భూమిపై హక్కులు కల్పిస్తోంది.

**కాంగ్రెస్ విధానం:**

పట్టాలు ఉన్న వారిని కూడా 'నకిలీ పట్టాదారులు'గా ముద్ర వేసి ఇళ్లు కూల్చేస్తోంది. కర్ణాటకలోని యలహంక బాధితులు ఇప్పటికీ వీధుల్లోనే బతుకుతున్నారు.

**బీజేపీ నకలుగా కాంగ్రెస్...**

కొన్ని ఉత్తరాది బీజేపీ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్వేషపూరిత 'కూల్చివేతల సంస్కృతి'ని కాంగ్రెస్ ప్రభుత్వాలు నకలు చేస్తున్నాయని విజయన్ ఆరోపించారు. కేరళలోని కాంగ్రెస్ నేతలు ఈ అమానవీయ చర్యలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వయనాడ్ దురంతం సమయంలో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదని ఆయన గుర్తుచేశారు.



# జాతీయం-అంతర్జాతీయం



# చర్చల ద్వారా పరిష్కారం సాధించాలి

## పశ్చిమాసియా పరిస్థితిపై ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 2 (వుదయం) :**



కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కలిసి ఉమ్మడి ప్రకటన చేస్తున్న సందర్భంలో పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల గురించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించారు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టిన నేపథ్యంలో నిరంతరం పరిణామం చెందుతున్న పరిస్థితి పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులలో ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే.

కార్నీతో చర్చల అనంతరం మాట్లాడుతూ, పశ్చిమాసియాలో పరిస్థితి మాకు అత్యంత ఆందోళన కలిగించే విషయం అని ప్రధాని అన్నారు.


తన పౌరుల సురక్షితంగా ఉండేందుకు ఈ ప్రాంతంలోని దేశాలతో కలిసి పని చేయడాన్ని కొనసాగిస్తామని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో ఉన్న భారతీయ భద్రత కోసం అక్కడి దేశాలతో కలిసి పని చేయడాన్ని కొనసాగిస్తామంటూ ప్రధాని స్పష్టం చేశారు. తీవ్రవాదం, అతివాదం అన్నవి కేవలం భారత్, కెనడాలకే కాక మొత్తం మానవాళికి తీవ్రమైన సవాలని ప్రధాని మోడీ, కెనెడా నాయకుడు పట్టి చూపారు. అన్ని సంఘర్షణలను చర్చలు, దౌత్యపరంగానూ పరిష్కరించుకోవాలన్న తీర్మానాన్ని భారత్ సమర్థిస్తుందని పశ్చిమాసియాలో పరిస్థితిని ప్రస్తావిస్తూ మోడీ అన్నారు.

రెండు ప్రధాన ప్రజాస్వామ్య దేశాల నాయకుల ఉమ్మడి వ్యాఖ్యలు, తెహ్రాన్ నడిబొడ్డు సహా ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా, ఇజ్రాయెల్‌తో కలిసి చేపట్టిన సైనిక చర్య అనంతరం వెలువడ్డాయి. ఈ దాడులలో తెహ్రాన్ ప్రభుత్వానికి చెందిన అగ్ర నాయకులు మరణించి, ఇరాన్‌లో దశాబ్దాల తరబడి ఉన్న అల్ ఖమేనీ పాలనకు ముగింపు పలికాయి.

## మధ్య ప్రాచ్యంలో కాల్పుల విరమణ జరగాలి

### రష్యా అధ్యక్షుడు పుతిన్

**వుదయం డెస్క్, మార్చి 2 :**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ సోమవారంనాడు ఎమిరాతీ, ఖతారీ నాయకులతో టెలిఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా మధ్య ప్రాచ్యంలో కాల్పుల విరమణ జరగాలని రష్యా అధ్యక్షుడు వ్లాదమిర్ పుతిన్ పిలుపిచ్చారు.

యుఎఇ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఫోన్ కాల్ సందర్భంగా, ఇద్దరు నాయకులు తక్షణ కాల్పుల విరమణ, రాజకీయ, దౌత్య ప్రక్రియకు తిరిగి రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారని క్రెమ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొందని ఎఎఫ్‌పి వార్తా సంస్థ ఉటంకించింది.

ఇరాన్ ప్రతీకార దాడుల్లో గల్ఫ్ అంతటా క్షిపణుల వర్షం కురిపించిన తర్వాత ఇది జరిగింది, అధికారులు గగన తలాన్ని మూసివేయవలసి వచ్చింది. దుబాయ్, అబుదాబి వంటి పెద్ద కేంద్రాలలో విమానాల రాకపోకలను నిలిపివేసింది.

అబుదాబిఅధిపతితో జరిగిన సంభాషణలో, ఇరానియన్ ప్రతీకార దాడుల గురించి యుఎఇ ఆందోళనలను తెహ్రాన్‌కు తెలియజేయడానికి, ఈ ప్రాంతంలో పరిస్థితిని స్థిరీకరించడానికి సహాయం అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పుతిన్ హామీ ఇచ్చారు. ఖతారీ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో జరిగిన ఫోన్ కాల్ సందర్భంగా, ఇద్దరు నాయకులు వివాదం విస్తరించే ప్రమాదాలు, మూడవ దేశాలను దానిలోకి లాగే ప్రమాదం గురించి ఆందోళనలను పంచుకున్నారని క్రెమ్లిన్ పేర్కొంది.

గతంలో, రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇరాన్ లేదా అరబ్ దేశాలలో పౌర లక్ష్యాలపై జరిగే దాడులను ఖండించింది.

ఇంతలో, ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సౌరే ఖోజాస్తే బగర్జాదే, దాడులలో గాయాల పాలైన తర్వాత మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో ఆమెది బలిదానమని ఇరాన్ రాష్ట్ర మీడియా, ప్రెస్ టీవీ సోమవారం ప్రకటించింది. శనివారం అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఇరాన్‌లోని విస్తరణవాద, ఇస్లామిస్ట్ పాలన 47 సంవత్సరాలుగా అమెరికాపై ఏకపక్ష యుద్ధం చేస్తోందని, అమెరికా యుద్ధాన్ని ప్రారంభించకపోయినా, దానిని పూర్తి చేస్తుందని అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ సోమవారం అన్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ సమన్వయంతో అమెరికా దాడులు చేసి, సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ అధికారులను చంపి, ఆ దేశ బాలిస్టిక్ క్షిపణి సౌకర్యాలకు భారీ నష్టం కలిగించిన ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీని ప్రారంభించిన తర్వాత హెగ్సేత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# నెతన్యాహూ కార్యాలయంపై ఇరాన్ దాడి?

**తప్పుడు ప్రచారం : ఇజ్రాయెల్**

**వుదయం డెస్క్, మార్చి 2 :**



పశ్చిమాసియా ప్రాంతంలో పెరుగుతున్న యుద్ధం నడుమ ఇజ్రాయెలీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయంపై దాడి చేసినట్టు సోమవారం ఇరానియన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) పేర్కొంది.

ఇజ్రాయెలీ ప్రధానమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకోవడమే కాక, ఇజ్రాయెలీ వైమానిక దళ కమాండర్ ఉన్న ప్రాంతంపై కూడా దాడులు చేసినట్టు ఐఆర్‌జిసి ప్రజా సంబంధాల విభాగం ప్రకటించింది.

యూదు పాలన, నేరస్తుడైన ప్రధానమంత్రి కార్యాలయం, ప్రభుత్వ వైమానిక దళ కమాండర్ కేంద్రకార్యాలయంపై దాడి చేసినట్టు గార్డ్స్ తెలిపినట్టు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఈ దాడులకు కీబార్ క్షిపణులను ఉపయోగించినట్టు ఆ ప్రకటన తెలిపింది.

కాగా, నెతన్యాహూ పరిస్థితి అస్పష్టం అని కూడా ఆ వార్త తెలిపింది.

కాగా, నెతన్యాహూ కార్యాలయంపై క్షిపణి దాడి జరిగిందనే వార్తను ఇజ్రాయిల్ ఖండించింది. ఇది తప్పుడు ప్రచారమని ఇజ్రాయెలీ వార్తా సంస్థలు తెలిపాయి. ఈ ఘర్షణ ప్రారంభం అయినప్పటి నుంచి తమపై ఎక్కుపెట్టిన డజన్ల కొద్దీ డ్రోన్లను ఇజ్రాయెలీ వైమానిక దళం, నావికాదళం అడ్డుకున్నాయని పేర్కొన్నాయి.

**మరింత ఉధృతమైన యుద్ధం**

శనివారం నుంచి ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్ వ్యాప్తంగా దాడులు జరిపాయి. ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణంతో ప్రారంభమైన యుద్ధం ఆ ప్రాంతాన్ని ముంచెత్తింది. దుబాయ్, బహ్రెయిన్ సహా పలు చోట్ల పేలుళ్లు ప్రతిధ్వనిస్తూ, వందలాది విమానాల రద్దు కారణంగా, వ్యూహాత్మక జలసంధి దాదాపు స్తంభించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం విస్తరించడంతో ఈ ప్రాంతంపై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది.

ఖమేనీ మరణానికి కారణమైన అమెరికా, ఇజ్రాయెలీ దాడులకు ప్రతిగా ఒక సౌదీ చమురు శుద్ధి కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో మంటలు చెలరేగాయి, కువైట్‌లో అమెరికా రాయబార కార్యాలయ సముదాయం నల్లటి పొగ వెలువడింది.

సైప్రస్‌లో యుకె సైనిక స్థావరాన్ని ఇరాన్ డ్రోన్ లక్ష్యంగా చేసుకుంది. అయితే, అక్కడ మరణించిన వార్తలు రాలేదు.

# ఇరాన్ అణు కేంద్రాలపై దాడి?

## ఆధారాలు లేవంటున్న అణు నిఘా సంస్థ

**వుదయం డెస్క్, మార్చి 2:**



ఇరాన్‌లోని అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడులు చేశాయని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ)లోని ఇరాన్ రాయబారి రెజా నజాఫీ ఆరోపించారు. ఇరాన్‌ను నాశనం చేయడానికి చేస్తున్న కుట్రలను ఖండిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడులు జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఐరాస అణు నిఘా సంస్థ అధిపతి రాఫెల్ గ్రాస్సీ పేర్కొన్నారు. తెహ్రాన్‌లో ఇప్పటి వరకు రేడియేషన్ స్థాయిలు సాధారణం కంటే ఎక్కువ ఉన్నట్లు గుర్తించలేదని, అయినప్పటికీ ఆ ప్రాంతంలో దాడులు కొనసాగుతోన్నందున రేడియేషన్ లీకేజీని తోసిపుచ్చలేమన్నారు.

అదే జరిగితే అణు కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించే అవకాశం ఉందని ఐఏఈఏ చీఫ్ రాఫెల్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. అణుకేంద్రాలపై దాడుల గురించి తెలుసుకోవడానికి ఇరాన్ అణు నియంత్రణ అధికారులను సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. వారి నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు.

**ఇరాన్ ఆరోపణలు:**

అమెరికా ఇజ్రాయెలీ దాడులు నిర్దిష్టంగా నతాంజ్ శుద్ధి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని, చట్టవ్యతిరేకమైన, నేరపూరితమైన, దారుణమైన దాడులకు పాల్పడినట్టు ఇరాన్ రాయబారి రెజా ఆరోపించారు. ఆదివారం ఇరాన్‌లో సురక్షితమైన అణు కేంద్రాలపై వారు దాడి చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలనుకుంటోందన్న సాకుతో వారు తమ చర్యలను సమర్థించుకుంటున్నారని, అయితే అది శుద్ధ అబద్ధమని ఆయన అన్నట్టు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

కాగా, నతాంజ్‌పై దాడులు చేసిన విషయాన్ని ఇజ్రాయెల్, అమెరికా అంగీకరించలేదు.

తాము ఇరాన్ అణు నియంత్రణాధికారులతో మాట్లాడేందుకు యత్నిస్తున్నామని, కానీ ఇప్పటి వరకూ స్పందించలేదని ఐఎఇఎ అధిపతి అన్నారు.

రాయిటర్స్ నివేదిక ప్రకారం, ఇరాన్ సరిహద్దులో ఉన్న దేశాలలో సాధారణ నేపథ్య స్థాయిల కంటే రేడియేషన్ స్థాయిలు ఇప్పటివరకు పెరగలేదని ఐఎఇఎ అధిపతి గ్రాస్సీ కూడా వాదించారు.

నేటి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది, ప్రధాన నగరాల కంటే పెద్దవి లేదా పెద్ద ప్రాంతాలను ఖాళీ చేయవలసిన అవసరంతో సహా తీవ్రమైన పరిణామాలతో కూడిన రేడియోలాజికల్ లీకుల సంభావ్యతను తాము తోసిపుచ్చలేమని గ్రాస్సీ అన్నారు. మనం దౌత్యం మరియు చర్చలకు తిరిగి రావాలని ఆయన సూచించారు. అనంతరం, విలేకరుల సమావేశంలో ప్రసంగించిన గ్రాస్సీ, ఇరాన్ అణు కేంద్రాలపై దాడి జరిగినట్లు ఎటువంటి సూచనలు లేవని పునరుద్ఘాటించారు. అయితే, షఔఏదో జరిగి ఉండవచ్చు, కానీ జూన్‌లో ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన సైనిక దాడులకు సమానమైనది ఏదీ మేం చూడలేదు" అని ఆయన స్పష్టం చేశారు.

# హెజ్బుల్లాపై నిషేధం: లెబనాన్



**వుదయం డెస్క్:**

లెబనాన్‌లోని బీరూట్‌లో దక్షిణ ప్రాంతంలో హెజ్బుల్లా నియంత్రణలో ఉన్న స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బుల్లా కు చెందిన కీలక నేత మృతి చెందినట్లు సౌదీ వార్తా సంస్థ అల్‌హదత్ పేర్కొంది.

కాగా, ఇరాన్ సుప్రీం నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకునేందుకు కాల్పులు ప్రారంభించిన హెజ్బుల్లా సైనిక కార్యకలాపాలను లెబనాన్ ప్రభుత్వం నిషేధించింది.

దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా స్థావరాలపై సోమవారం ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడిఎఫ్) వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హెజ్బుల్లా బ్లాక్ అధిపతి మహ్మద్ రాద్ మృతి చెందారు. ఉగ్ర సంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అయితే వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 31 మంది మృతిచెందగా, 149 మంది గాయపడినట్లు లెబనాన్ వెల్లడించింది. హెజ్బుల్లా నేతలు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని.. వారి చర్యలకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఐడీఎఫ్ నార్తర్న్ కమాండ్ చీఫ్ రఫీ హెచ్చరించారు. మొదట హెజ్బుల్లా తమపై రాకెట్ దాడులకు పాల్పడడం వల్లే ప్రతిదాడులు చేస్తున్నామన్నారు. మరోసారి వారు ఇటువంటి చర్యలకు దిగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా.. లెబనాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, కీలక నేతల కార్యాలయాలపై దాడులు చేపట్టామన్నారు. మరిన్ని దాడులు చేయడానికి ముందు దక్షిణ లెబనాన్‌లోని 50 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా అక్కడి ప్రజలకు సూచించినట్లు తెలిపారు.

# సంభావ్య వారసులు కూడా హతం : ట్రంప్

**వుదయం డెస్క్, మార్చి 2:**



అమెరికా, ఇజ్రాయెల్ దాడులలో శనివారం ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీని మరణించిన తర్వాత, ఆయన వారసులుగా గుర్తించిన వ్యక్తులు కూడా మరణించారని, ఇస్లామిక్ రిపబ్లిక్‌ను నడిపించే వారెవరనే దానిపై స్పష్టత లేకుండా పోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు.

అమెరికాకు చెందిన ఒక న్యూస్‌ఛానెల్ ఆదివారం రాత్రి చేసిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఈ దాడి ఎంత విజయవంతమైందంటే, అది చాలామంది అభ్యర్థులను నిర్వీర్యం చేసింది అని ట్రంప్ చెప్పారు. మనం అనుకుంటున్నవాళ్లు ఎవరూ ఉండబోరు, ఎందుకంటే వారంతా మరణించారు. ఆయన తర్వాత రెండవ లేదా మూడవ స్థానంలో ఉన్నవారు మరణించారు అని ఆయన తెలిపారు.

ఇరాన్ నూతన నాయకత్వం ఎలా ఉండబోతోందో అమెరికాకు స్పష్టత ఉందని ట్రంప్ తొలుత చెప్పారు. కానీ, సంభాషణ ముందుకు వెళ్లిన తర్వాత, ఆయన తన మాటలను మార్చేసి, దాడిలో ఆ వ్యక్తులు చాలామంది మరణించారన్నారు.

ఖమేనీకి అగ్ర సలహాదారు అయిన అలీ సంఖానీ, ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ అధిపతి జనరల్ మహమ్మద్ పాక్‌పౌర్ ఈ దాడిలో మరణించిన వారిలో ఉన్నారని ఇరాన్ న్యాయవ్యవస్థ ధృవీకరించింది. దాడులు జరిగిన సమయంలో సెంట్రల్ తెహ్రాన్‌లోని ఖమేనీ ఇంటి ఆవరణలో వారు కూడా ఉన్నారు.

ఖమేనీ కుమార్తె, మనవరాలు సహా కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు మరణించారు.

ఆపరేషన్‌కు ఎపిక్ ఫ్యూరీ అని నామకరణం చేసిన పెంటగాన్, ముగ్గురు అమెరికన్ సైనికులు మరణించారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించింది.

ప్రముఖులైన అభ్యర్థులంతా పోవడంతో, కొత్త నాయకుడిగా ఉద్భవించనున్నవారెవరో అస్పష్టంగా ఉంది.

ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయవ్యవస్థ అధిపతి, గార్డియన్ కౌన్సిల్‌కు చెందిన ఒక సీనియర్ మతాధికారితో సహా ఏర్పడే తాత్కాలిక కౌన్సిల్ ఈ సంధికాలంలో సుప్రీం నాయకుడి అధికారాలను కలిగి ఉంటుంది. మతాధికారి అయతొల్లా అలీరెజా అరాఫీ తాత్కాలిక నాయకుడు అని భావిస్తున్నారు. అయితే, అరాఫీ బహిరంగంగా కనిపించకపోవడం, ఎటువంటి సందేశం ఇవ్వకపోవడంతో ఆయన కూడా మరణించారనే వార్తలు ఆన్‌లైన్‌లో వినిపిస్తున్నాయి.

దాడి జరిగినప్పటి నుంచి అధికారం పరంగా, ప్రజల దృష్టిలో సుప్రీం జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజానీ సీనియర్ నాయకులలో ఒకరిగా కనిపిస్తున్నారు.

ఇస్లామిక్ రిపబ్లిక్‌ను లేదా సుప్రీం నాయకుడి వ్యవస్థను ఆమోదించని రాజకీయ వర్గాలను ఇరాన్ రాజ్యాంగం అధికారం చేపట్టడం నుంచి నిరోధిస్తుంది. దీనితో ప్రత్యామ్నాయం అందించేందుకు అధికారికంగా ఎవరూ కనిపించడం లేదు. గతంలో పదవీచ్యుతుడైన షా కుమారుడు రెజా పహ్లావీ నిరసనకారుల దృష్టిని ఆకర్షించినప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం నుంచి బహిరంగంగా ఎటువంటి మద్దతును పొందలేదు. ఆయన అమెరికన్, ఇతర వార్తా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, తనను తాను సంభావ్య పాలకుడిగా చెప్పుకుంటున్నాడు.

# భారత్‌కెనడా మధ్య యురేనియం డీల్



**వుదయం డెస్క్, మార్చి 2:**


భారత్‌కెనడా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సోమవారం 2.6 బిలియన్ డాలర్ల విలువైన యురేనియం సరఫరా ఒప్పందం మీద రెండుదేశాలు సంతకాలు చేశాయి. అలాగే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అంగీకారం కుదిరింది. హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్రమోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

దేశంలో పౌర అణుఇంధన కార్యక్రమానికి నిరంతరాయ సరఫరాను కొనసాగించడమే ఈ డీల్ ఉద్దేశం. చిన్న రియాక్టర్లు, అధునాతన రియాక్టర్లపై కలిసి పనిచేయనున్నామని మోదీ తెలిపారు అలాగే 2026 చివరినాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కొలిక్కి రావాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు కార్నీ వెల్లడించారు.

**స్వామి వివేకానంద సూక్తిని గుర్తుచేసుకున్న కెనడా ప్రధాని**

1893లో స్వామి వివేకానంద కెనడాలో పర్యటించిన విషయాన్ని మార్క్ కార్నీ గుర్తుచేసుకున్నారు. "లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి" అన్న వివేకానంద సూక్తిని ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు కార్నీ భారత్‌లో పర్యటిస్తున్నారు.

# హోర్ముజ్ జలసంధిలో ఆగని దాడులు



**వుదయం డెస్క్, మార్చి 2 :**

హోర్ముజ్ జలసంధిలో 6వ నౌకను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. హోర్ముజ్ జలసంధి నుంచి ఏ ఓడా వెళ్లకూడదంటూ ఇరాన్ ప్రకటించింది. ఇది ప్రపంచ చమురు, వాయు సరఫరాలకు రవాణా కేంద్రం ఈ జలసంధి. హోర్ముజ్ జలసంధినిలో ఆరవ నౌకను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందని ఇరాన్ ప్రభుత్వ యాజమాన్యంలోని మీడియా పేర్కొంది. దీనిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. శనివారం అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా దీనిని మూసివేశామని ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాగా శనివారం జరిగిన ఈ దాడులలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, సీనియర్ సైనిక అధికారులు మరణించిన విషయం తెలిసిందే.

ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదవ వంతుకు రవాణా కేంద్రమైన హోర్ముజ్ జలసంధి గుండా ఏ నౌకకు ప్రయాణించే హక్కు లేదని ఆదివారం ఇరాన్ ప్రకటించింది.ఆదివారం నాడు ప్రధాన ప్రపంచ షిప్పింగ్ లైన్లు జలమార్గం ద్వారా రవాణాను నిలిపివేయగా, అమెరికా ఆంక్షల కింద ఒమన్ సమీపంలో పలావ్ జెండాతో ప్రయాణించే చమురు ట్యాంకర్ మధ్యాహ్నం సమయంలో క్షిపణి దాడులను ఎదుర్కొంది.


సోమవారం, యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటివో), మరో రెండు నౌకలను ఢీకొట్టినట్లు నివేదించింది ఒకటి ఒమన్‌లోని మస్కట్ సమీపంలో ఒక ట్యాంకర్ మరియు రెండవది యుఎఇలోని మినా సక్ర్ సమీపంలో ఒక ట్యాంకర్. హోర్ముజ్ జలసంధి, విస్తృత ఒమన్ గల్ఫ్ నుండి నౌకలు దూరంగా ఉండాలని అమెరికా రవాణా మంత్రిత్వ శాఖ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ శనివారం విడిగా ఒక నోట్‌లో తెలిపింది.

ఈ ప్రాంతాలలో పనిచేస్తున్న ఏవైనా అమెరికా జెండా ఉన్న, దాని యాజమాన్యంలోని లేదా సిబ్బందితో కూడిన వాణిజ్య నౌకలు ముప్పుగా భావించే ప్రమాదాన్ని తగ్గించడానికి అమెరికా సైనిక నౌకల నుండి 30 నాటికల్ మైళ్ల దూరంలో ప్రయాణించమని పేర్కొంది. జలసంధి మూసివేయడం ప్రపంచ చమురు షాక్ గురించి ఆందోళనలు పెరుగుతున్నాయి. చమురు ధరలు ఇప్పటికే పెరిగాయి. యుఎస్ చమురు బ్యారెల్‌కు 7.4 శాతం పెరిగి 71.97 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, అంతర్జాతీయ ప్రమాణ బ్రెంట్ బ్యారెల్‌కు 7.7 శాతం పెరిగి 78.46 డాలర్ల వద్ద ఉంది. ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఆదివారం, తెహ్రాన్ గల్ఫ్ అంతటా గల అమెరికా లక్ష్యాలపై దాడి చేసింది. ఎనిమిది దేశాలలో యుఎస్ సైనిక స్థావరాలు, పౌర లక్ష్యాలపై దాడులు జరిగాయి. ఇజ్రాయెల్‌తో పాటు, ఇరాన్ బహ్రెయిన్, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాక్, జోర్డాన్‌లలో దాడి చేసింది. ఇరాన్ ఒమన్ మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి, ప్రపంచ మార్కెట్లకు గల్ఫ్ కు గల ఏకైక లింక్.

## చమురు టాంకర్‌పై దాడి భారత జాతీయుడి మృతి

ఒమన్ తీరంలో ఒక చమురు టాంకర్‌పై జరిగిన దాడిలో ఒక భారత జాతీయుడు మరణించినట్టు ఒమనీ అధికారులు సోమవారం వెల్లడించారు. టాంకర్‌పై దాడి జరిగిన వెంటనే పేలుడు సంభవించి, అగ్ని జ్వాలలు ఎగిసాయని వారు తెలిపారు. ఒమన్ సముద్ర భద్రతా కేంద్రం ప్రకారం, గల్ఫ్ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ, ఎంకెడి వ్యోమ్ అన్న చమురు టాంకర్‌ను మస్కట్ పాలిత తీర ప్రాంతానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ మార్షల్ ఐలాండ్స్ జెండాతో వెడుతున్న చమురు టాంకర్‌ను మస్కట్ గవర్నరేట్ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో మానవరహిత పడవ దాడి చేసింది. ట్యాంకర్ దాదాపు 59,463 మెట్రిక్ టన్నుల సరుకును మోసుకెళ్తోంది అని ఒమానీ సముద్ర భద్రతా కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ విభాగంలో పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ దాడితో ప్రధాన ఇంజిన్ గదిలో మంటలు, పేలుడు సంభవించాయి, దీని ఫలితంగా ఒక సిబ్బంది మరణించారు, అందులో ఒక భారతీయుడు కూడా ఉన్నారు అని అది పేర్కొంది. గల్ఫ్ ప్రాంతంలో ఇటీవలి సైనిక దాడుల నేపథ్యంలో ఇరాన్ తన ప్రతీకార చర్యలను కొనసాగిస్తున్న తరుణంలో ఈ సంఘటన జరిగింది. ఇతర సిబ్బంది పరిస్థితి లేదా నౌకకు ఎంత నష్టం వాటిల్లిందనే దానిపై మరిన్ని వివరాలు వెంటనే అందుబాటులో లేవు.






“కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అహింస, శాంతి, సత్యాన్వేషణ. ఈ సిద్ధాంతాల ఆచరణ కోసం ప్రతి కార్యకర్త నిరంతరం పని చేయాలి. కాంగ్రెస్ పార్టీలో సమానత్వ సిద్ధాంతానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా, పేద ధనిక అనే తారతమ్యాలు లేకుండా అందరిని గౌరవిస్తూ పార్టీని నడిపించాలి. అహంకారాన్ని వీడి పార్టీ, ప్రజల కోసం పని చేయాలి. ప్రజలు పార్టీకి బలం కావాలి. అదే సమయంలో పార్టీ ప్రజలకు బలం కావాలి. ప్రజలతో కలిసిపోయి వారితో మమేకం అయ్యి వారి కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేసే విధంగా మన కార్యాచరణ ఉండాలి.

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత”

## వే'మన'పద్యం

**ఆపదలగువేళ నరసి బంధుల చూడు**
**భయమువేళ చూడు బంటుతనము**
**పేదవేళ జూడు పెండ్లాము గుణమును**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# పశ్చిమాసియా మంటలు

ఇరాన్ ప్రతీకార దాడులు స్వజనం మీదనే ఎక్కువగా జరుగుతున్నాయి. తమవారై ఉండి పగవాడి ప్రాపకం కోసం ప్రాకులాడిన అరబ్ దేశాలపై అక్కడిఅమెరికన్ స్థావ రాలపై ఇరాన్ క్షిపణి దాడులకు తెగబడింది.సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రెయిన్, కతార్,ఇరాక్ దుబాయ్, దోహా మీద క్షిపణులను సంధించింది.బహ్రెయిన్ లోని అమెరికా అయిదవ నౌకాదళ స్థావరం పైనా గురి పెట్టింది. ఇజ్రాయెల్ పై ఈసారి ఇరాన్ జరిపిన దాడుల్లో తొమ్మిది మంది చనిపోయినట్టు సమాచారం. అరబ్ దేశాల్లో ఈ దాడులకు ఇంకా పలువురు మరణించారు, గాయపడ్డారు. కీలక భవనాలు ధ్వంసమయ్యాయి. ఎయిర్ పోర్టులు, పెద్ద పెద్ద హోటళ్ళు నాశన మయ్యాయి. ఇరాన్ ఇప్పుడు దాడులు జరిపిన దేశాల్లో ముఖ్యంగా కతార్, బహ్రెయిన్, యు ఎ ఇ, కువైత్ లలో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. ఈ దాడులు ఆమెరికా .స్థావరాలపై ఉద్దేశించినవే గాని తమ సోదర దేశాలను లక్ష్యం చేసుకొని జరిపినవి కాదని ఇరాన్ ప్రకటించింది. కాని ఈ దాడులు వాటి సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీశాయన్న మాట నిజం. అమెరికా మాదిరిగా నాయకులను వధించలేదు. అదే తేడా. అయితే ప్రపంచ ఏకైక మొనగాడుగా విర్రవీగుతున్న డోనాల్డ్ ట్రంప్ దెబ్బకు ఇరాన్ ఇంత తీవ్రంగా దెబ్బ తింటుందని గాని, అమెరికా ఒకవైపు ఇరాన్ తో రాజీ చర్చలు జరుపుతూనే ఈ దాడికి తొంద రపడుతుందని గాని అనుకోలేదు. అన్ని మర్యాదలను కాల రాసి ఇరాన్ అధినేత అలి ఖమేని ని సకుటుంబంగా హతమార్చడం అమెరికా దౌత్య అవినీతే గాని నీతి అనిపించుకోదు. అమెరికాకు అంత శక్తి ఉందని, ట్రంప్ ఎందుకైనా తెగిస్తాడనే విషయాన్ని ఖమేని ముందుగా గ్రహించలేదని అనుకోలేము. దేశ రక్షణ కోసం తన చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడాలన్న ఖమేనీ రాజీ లేని వైఖరే ఇరాన్ ను ఆ ప్రాంతంలో సాటిలేని శక్తిగా చేసింది. అమెరికా దూరం నుంచి పెట్టిన మంటకు పశ్చిమాసియా భగ్గుమన్నది. కేవలం అణు ఒప్పందంపై కలిసిరకపోవడమేనా ఖమేని చేసిన నేరం. కానే కాదు ట్రంప్ అధికారంలోకి రాగానే అమెరికాను మళ్ళీ ఘనమైన దేశంగా చేస్తానని మాగా (MAGA)అనే ప్రతిజ్ఞ చేశాడు.అందులో భాగంగానే నిన్న వెనువెజులా ఇప్పుడు ఇరాన్ మీద ఈ నిర్వాకాలు. ఇరాన్ లోని ఆయిల్ నిక్షేపాల మీద కన్నుతోనే ఈ అమానుషానికి పాల్పడ్డాడు. ఇది ఇక్కడితో ఆగదు. గ్రీన్ ల్యాండ్, కెనడా వంటి తన ప్రకటిత లక్ష్యాలను ఆక్రమించుకోడానికి ఇక వెనకాడబోడని భావించాలి. ఇరాన్ లో మత రాజ్యం ముగిసిపోయి, ఒకప్పటి అమెరికా కీలుబొమ్మ షా వారసుల రాజ్యం వస్తుందో లేదో చూడాలి. ట్రంప్ కి కావలసింది అదే. అమెరికా సుప్రీం కోర్టు కోర్టు కొట్టివేసిన మాఫియా టారిఫ్ లను తిరిగి విధించే వరకు ట్రంప్ నిద్రపోడు. సైనికంగా, ఆర్థికంగా అమెరికాను బలపరిచే చర్యలన్నింటికీ పాల్పడి తన ప్రజల మెప్పు పొందాలని చూస్తాడు. అయితే ప్రపంచంలో స్వేచ్ఛను కాపాడే ఏకైక ప్రజాస్వామ్య దేశం అమెరికాయే నని చెప్పుకొని గర్వించే ఆ దేశ ప్రజలు ఆయన సమరోన్మాదాన్ని మెచ్చుకుంటారా? ఇంతకు ముందు దేశదేశాల మీద ఇష్టావిలాస టారిఫ్ లు విధించిన ట్రంప్ చర్యను సుప్రీం కోర్టు కొట్టివేసింది. అ టువ ంటి అంతర్జాతీయ టారిఫ్ లు విధించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాలతో వేసిన ఈ టారిఫ్ లు చెల్లవని స్పష్టం చేసింది. ఇప్పుడు ఆయన ఇరాన్ పై చేసిన దాడులు సైతం అటువంటివేనని, సుప్రీం కోర్టు అంగీకరించదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ పై జరిపిన పాశవిక దాడుల నేపథ్యంలో ట్రంప్, ఖమేనీలను ఒకే గాటను కట్టి మాట్లాడడం చూస్తున్నాము. ఖమేనీ స్వదేశంలో తీవ్ర అణచివేతకు పాల్పడ్డ మాట వాస్తవమే. ఏ దేశాధినేత కూడా అవసరం అనిపించినప్పుడు తన ప్రజలపట్ల ఎంతో కొంత క్రౌర్యం చూపకుండా ఉన్న సందర్భాలు ఉండవు. కాని ప్రపంచాన్నే గడ గడలాడిస్తున్న ట్రంప్ ముందు వారంతా చిన్నవారే.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# కర్మ సిద్ధాంతం: మనిషి రాతకు మనసే కలం!


మనిషి జీవితంలో ప్రతి చర్యకూ ఒక ప్రతిఫలం ఉంటుందనే నమ్మకం శతాబ్దాలుగా భారతీయ తత్వశాస్త్రంలో వేళ్ళూని ఉంది. ఈ నమ్మకాన్నే మనం కర్మ సిద్ధాంతం అని పిలుచుకుంటాం. హిందూ, బౌద్ధ, జైన మతాల ప్రాథమిక స్తంభంగా నిలిచిన ఈ సిద్ధాంతం కేవలం ఒక ఆధ్యాత్మిక విశ్వాసం మాత్రమే కాదు. నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం మరియు నైతిక తత్వశాస్త్రం కూడా కర్మను వివిధ కోణాల నుండి సమర్థిస్తున్నాయి. అటు వేదాంతులు, ఇటు నేటి న్యూరో సైంటిస్టులు కూడా ఒక విషయంపై ఏకీభవిస్తున్నారు మన చేతలు మనల్ని నిర్మిస్తాయి. సంస్కృతంలో కర్మ అనే పదానికి చర్య లేదా కార్యం అని అర్థం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన అంటే, కర్మ చేయడం నీ హక్కు, కానీ ఫలితం నీ చేతుల్లో లేదు. ఈ సూత్రం కర్మ సిద్ధాంతపు గుండె చప్పుడును వినిపిస్తుంది. కర్మ అనేది కేవలం శారీరకమైన పని మాత్రమే కాదు అది ఆలోచన, మాట మరియు ఉద్దేశం (Intention) ల కలయిక.

భారతీయ దర్శనాలు కర్మను మూడు ప్రధాన రూపాలుగా విభజించాయి.గత జన్మల నుండి మనం పోగు చేసుకున్న మొత్తం కర్మల నిధి. ఇది ఒక బ్యాంక్ బ్యాలెన్స్ లాంటిది. సంచిత కర్మలో ఒక భాగం ప్రస్తుత జన్మలో అనుభవించడానికి సిద్ధంగా ఉంటుంది. మన పుట్టుక, తల్లిదండ్రులు, శారీరక స్థితి దీనిపైనే ఆధారపడి ఉంటాయని అంటారు .ప్రస్తుత జన్మలో మనం చేసే పనుల వల్ల భవిష్యత్తు కోసం జమ చేసుకునే కొత్త కర్మలు. ఈ త్రిమూర్తి కర్మ వ్యవస్థ ఒక జీవి జన్మ నుంచి జన్మకు, చర్య నుంచి పరిణామానికి ఏ విధంగా ప్రయాణిస్తుందో సూక్ష్మంగా వివరిస్తుంది. ఇది మనిషిని తన జీవితానికి తానే బాధ్యుడిని చేస్తుంది. వేదాంతం నుండి బౌద్ధం వరకువివిధ భారతీయ తత్వశాస్త్రాలు కర్మను విభిన్న కోణాల్లో విశ్లేషించాయి. ఆది శంకరాచార్యుల ప్రకారం కర్మ అనేది మాయ లో భాగం. జ్ఞానం ద్వారా బ్రహ్మ సాక్షాత్కారం పొందినప్పుడు కర్మ బంధాలన్నీ కాలిపోతాయి. రామానుజాచార్యులు కర్మను భక్తికి ఒక సాధనంగా చూశారు. నిష్కామ కర్మ ద్వారా హృదయం శుద్ధి చెంది భగవంతుడికి చేరువ అవుతామని ఆయన బోధించారు జైనులు కర్మను ఒక పౌద్గలిక (పదార్థం) రూపంలో చూస్తారు. మనం చేసే పనుల వల్ల సూక్ష్మమైన కర్మ అణువులు ఆత్మను అంటుకుని, దాని సహజ ప్రకాశాన్ని కప్పివేస్తాయని వారు నమ్ముతారు. బుద్ధుడు కర్మను చేతన (Intentional action) గా నిర్వచించాడు. మనసు అన్నింటికీ అధిపతి మనసే ముందుగా వెళ్తుంది, మనసే అన్నింటికీ కారణం అని ఆయన బోధించారు. మంచి ఉద్దేశంతో చేసే పని మంచి ఫలితాన్ని, చెడు ఉద్దేశంతో చేసే పని దుఃఖాన్ని ఇస్తుందని బౌద్ధం నొక్కి చెబుతుంది. ఆధునిక శాస్త్రం కర్మ సిద్ధాంతాన్ని మతపరమైన కోణంలో చూడకపోయినా, దాని సూత్రాలకు సమాంతరంగా అనేక ఆవిష్కరణలు చేసింది. న్యూటన్ మూడవ నియమం ప్రకారం ప్రతి చర్యకూ సమానమైన, విరుద్ధమైన ప్రతిచర్య ఉంటుంది. ఇది కర్మ సిద్ధాంతపు భౌతిక రూపమే. మనం విశ్వంలోకి ఏ శక్తిని పంపిస్తామో, అది తిరిగి మనకే చేరుతుంది. నేటి న్యూరో సైంటిస్టులు న్యూరోప్లాస్టిసిటీ గురించి మాట్లాడుతున్నారు. మనం పదే పదే చేసే పనులు, ఆలోచనలు మన మెదడులో ప్రత్యేకమైన న్యూరల్ పాత్వేస్ ను ఏర్పరుస్తాయి. అంటే మన అలవాట్లే మన మెదడును భౌతికంగా తీర్చిదిద్దుతాయి. ఇది మన పురాతన గ్రంథాలు చెప్పిన సంస్కార నిర్మాణం అనే భావనకు శాస్త్రీయ నిరూపణ. క్వాంటం ఎంటాంగిల్‌మెంట్ సిద్ధాంతం ప్రకారం, విశ్వంలోని రెండు కణాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటే, అవి ఎంత దూరంలో ఉన్నా ఒకదాని ప్రభావం మరొక దానిపై ఉంటుంది. ఇది కర్మ యొక్క అదృశ్య అనుసంధాన స్వభావాన్ని (Inter-connectedness) గుర్తుచేస్తుంది. మనం చేసే ప్రతి చిన్న పని ఈ విశ్వమంతా ప్రతిధ్వనిస్తుందని ఇది సూచిస్తోంది. ఇటీవలి



పరిశోధనలు ఆశ్చర్యకరమైన విషయాలను వెల్లడించాయి. మన పూర్వీకుల జీవనశైలి, వారు అనుభవించిన ఒత్తిడి లేదా సుఖాలు వారి DNA ఎక్స్‌ప్రెషన్‌ను మార్చి, ఆ లక్షణాలు తదుపరి తరాలకు అందుతాయని తేలింది. దీనినే పితృ కర్మ వారసత్వం అని మన పెద్దలు అనడం గమనార్హం. ప్రముఖ సైకాలజిస్ట్ కార్ల్ జంగ్ తన సింక్రోనిసిటీ (Synchronicity) సిద్ధాంతంలో కార్యకారణ సంబంధం లేకుండా జరిగే అర్థవంతమైన సంఘటనల గురించి వివరించారు. మనం ఏదైనా గట్టిగా అనుకున్నప్పుడు లేదా ఒక పని చేసినప్పుడు దానికి సంబంధించిన వ్యక్తులు లేదా పరిస్థితులు అకస్మాత్తుగా ఎదురుకావడం కర్మ యొక్క ప్రభావమేనని భావించవచ్చు. అలాగే, మార్టిన్ సెలిగ్మాన్ యొక్క పాజిటివ్ సైకాలజీ పరిశోధనలు ఒక ముఖ్యమైన సత్యాన్ని వెల్లడించాయి ఇతరులకు సహాయం చేసేవారు, సానుకూల దృక్పథం కలిగినవారు మానసికంగా ఆరోగ్యంగా, ఎక్కువ కాలం జీవిస్తారు. దీనినే మనం సుకర్మ ఫలం అంటాము. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (CBT) కూడా ఒక రకమైన కర్మ సిద్ధాంతమే. అది మన ఆలోచనా సరళిని మార్చుకోవడం ద్వారా మన ప్రవర్తనను, తద్వారా మన జీవిత అనుభవాలను మార్చుకోవచ్చని చెబుతుంది. పాశ్చాత్య తత్వవేత్తలు కూడా కర్మ సిద్ధాంతానికి దగ్గరగా ఉండే భావనలను వెల్లడించారు. ఇమ్మాన్యుయేల్ కాంట్ తన కాటెగొరికల్ ఇంపెరేటివ్ సిద్ధాంతంలో నీవు చేసే పని ప్రపంచమంతటికీ ఒక చట్టం కావాలని కోరుకుంటేనే ఆ పనిని చేయి అని చెప్పారు. ఇది కర్మ సిద్ధాంతంలోని సార్వత్రిక నైతికతను పోలి ఉంది. ఆర్థర్ షోపెన్‌హాయర్ వంటి తత్వవేత్తలు భారతీయ ఉపనిషత్తుల ద్వారా ప్రభావితులై, కర్మ సిద్ధాంతాన్ని ఈ ప్రపంచ నైతిక క్రమానికి (Moral Order) పునాదిగా అభివర్ణించారు. వారి దృష్టిలో కర్మ అంటే కేవలం ఒక శిక్ష కాదు, అది ఆత్మను పరిణితి చెందించే ఒక ప్రక్రియ.నేటి పోటీ ప్రపంచంలో కర్మ సిద్ధాంతం ఎంతో అవసరం. కార్పొరేట్ రంగంలో గివ్ అండ్ టేక్ (Give and Take) సిద్ధాంతం ఇప్పుడు విస్తృతంగా చర్చించబడుతోంది. ప్రసిద్ధ రచయిత ఆడమ్ గ్రాంట్ తన పరిశోధనలో నిరూపించినట్లుగా స్వార్థం లేకుండా ఇతరులకు సహాయం చేసే గివర్స్ (Givers) దీర్ఘకాలంలో అత్యున్నత విజయాలను సాధిస్తారు. పర్యావరణ సంరక్షణలో కూడా కర్మ సిద్ధాంతమే పనిచేస్తోంది. మనం ప్రకృతిని విచక్షణా రహితంగా ధ్వంసం చేస్తే, అది గ్లోబల్ వార్మింగ్ రూపంలో మనపైనే దాడి చేస్తోంది. మనం ప్రకృతికి ఏమి ఇస్తామో, అదే మనకు తిరిగి వస్తుంది. వ్యక్తిగత స్థాయిలో కర్మ సిద్ధాంతం మనిషికి మూడు అద్భుతమైన గుణాలను ఇస్తుంది నా కష్టసుఖాలకు నేనే బాధ్యుడిని అనే భావన కలిగించి, ఇతరులను నిందించే గుణాన్ని తగ్గిస్తుంది. ఒకరు నాకు హాని చేస్తే, అది వారి కర్మగా భావించి క్షమించే గుణాన్ని పెంచుతుంది. ఇది మానసిక ప్రశాంతతకు దారితీస్తుంది. భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పుడు చేసే పని బాగుండాలని గుర్తించి, ప్రతి క్షణాన్ని నైతికంగా జీవించేలా ప్రేరేపిస్తుంది. కర్మ సిద్ధాంతాన్ని కొందరు నిరాశావాద విధివాదం (Fatalism) అని విమర్శిస్తారు. అంతా నా కర్మ, నేను ఏమీ చేయలేను అని చేతులు ముడుచుకుని కూర్చోవడం కర్మ సిద్ధాంతం కాదు. నిజమైన కర్మ సిద్ధాంతం పురుష ప్రయత్నానికి (Self-effort) అత్యంత ప్రాముఖ్యతనిస్తుంది. గతాన్ని మనం మార్చలేకపోవచ్చు, కానీ వర్తమానంలో చేసే పనుల ద్వారా భవిష్యత్తును మనం నిర్మించుకోవచ్చు. అలాగే, సామాజిక అణచివేతను సమర్థించడానికి కర్మను వాడుకోవడం ఒక పెద్ద పొరపాటు. వారు పేదలుగా పుట్టారు కాబట్టి అది వారి కర్మ అని అనడం క్రూరత్వం. కర్మ సిద్ధాంతం మనల్ని కరుణామయులుగా మార్చాలి కానీ, నిర్దయులుగా కాదు. ఎదుటివారి కష్టాన్ని చూసి స్పందించడం మన కర్మ బాధ్యత. కర్మ సిద్ధాంతం అనేది కాలం చెల్లిన నమ్మకం కాదు,అది నిత్య నూతనమైన సత్యం. వేదాల నుండి క్వాంటం ఫిజిక్స్ వరకు, ప్రాచీన మునుల నుండి నేటి న్యూరో సైంటిస్టుల వరకు అందరూ చెప్పే సారాంశం ఒక్కటే,మన ఆలోచనలే మనల్ని నడిపిస్తాయి, మన చర్యలే మనల్ని నిర్మిస్తాయి.

మనం ప్రపంచంలోకి వదిలే ప్రతి ఆలోచన ఒక తరంగంలా ప్రయాణించి తిరిగి మన వద్దకే చేరుతుంది. ఈ సత్యాన్ని గ్రహించిన వ్యక్తి ఫలితాల కోసం ఆరాటపడకుండా, తన కర్తవ్యాన్ని నిష్కామంగా నిర్వహిస్తాడు. రాబోయే తరాల యువతకు ఈ కర్మ సిద్ధాంతం ఒక గొప్ప మార్గదర్శి. నైతికత, బాధ్యత, సేవ మరియు సత్యం ఈ విలువలే మానవ జీవితానికి నిజమైన దిక్సూచి. ఈ ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో జోడించి అర్థం చేసుకున్నప్పుడే, మనం ఒక ఉన్నతమైన సమాజాన్ని నిర్మించగలము. గుర్తుంచుకోండి, మనం ఇతరుల జీవితాల్లో వెలిగించే ప్రతి దీపం, మన మార్గాన్ని కూడా ప్రకాశవంతం చేస్తుంది. అదే కర్మ!



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# ఔషధ మొక్కలతో ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధులు

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించు



కుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనియెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

### భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ జలం, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, అవసర హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 03 మార్చి “ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం” లేదా “వరల్డ్ వైల్డ్‌లైఫ్ డే” నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

*2026 ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఇతివృత్తం*

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయనే భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుసుకొనుటతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా అందించి సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపి ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస పేర్కొనడం విశేషం. “ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా” అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ వన్యప్రాణుల దినం-2026 ఇతివృత్తంగా “ఔషధ, ఆరోమాటిక్ మొక్కలు : ఆరోగ్య, వారసత్వ, జీవనోపాధి సంరక్షణ” అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది. ప్రపంచ వన్యప్రాణుల దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తూనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు, పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ ప్రధాన విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, “మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు” అని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపాన్ని కాపాడుకుంటూ భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

*(03 మార్చి “ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం” సందర్భంగా)*



మధుసూదన్ రెడ్డి
9949700037

# కుక్కకాట్లు.. ప్రజల ఇక్కట్లు

వీధుల్లో కుక్కల మందలు జనాలను వెంటాడి కరుస్తున్నాయి. అప్పుడప్పుడు ఆస్పత్రుల్లో పసికందులను చంపి తింటున్నాయి. ఇండియాలో కుక్కలను లెక్కించడానికి శాస్త్రీయ పద్ధతి లేదు. సంఖ్యను తక్కువచేసి సమస్యను చిన్నపరచాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తాయి. సర్కారు లెక్కల ప్రకారం 2025 కు ఇండియాలో 6 కోట్ల, ఆంధ్ర ప్రదేశ్ లో 8.6 లక్షల, గుంటూరులో 31 వేల, తెలంగాణలో 7.9 లక్షల, హైదరాబాదులో 4 లక్షల వీధి కుక్కలున్నాయి. ఉత్తర ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ లు వీధి కుక్కల సంఖ్యలో మొదటి స్థానాల్లో ఉన్నాయి.



**వీధి కుక్కలతో సమస్యలు:** రోగనియంత్రణ జాతీయ కేంద్రం (నేషనల్ సెంటర్ ఫార్ డిసీజ్ కంట్రోల్) నివేదిక ప్రకారం 2025 లో దేశం మొత్తం మీద 47,48,478 మంది, ఆంధ్ర ప్రదేశ్ లో 3,28,504 మంది, కుక్క కాట్లకు గురయ్యారు. నగరపాలక లెక్కల ప్రకారం విజయవాడలో 40 వేల మందిని, గుంటూరులో 18,040 మందిని, 2024 లో తెలంగాణలో 3.3 లక్షల మందిని, హైదరాబాదులో 21,131 మందిని కుక్కలు కరిచాయి. కుక్క కాట్లలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఎపి లో నెల్లూరు, గుంటూరు జిల్లాలు, తెలంగాణలో హైదరాబాదు, మెదక్, జగిత్యాల జిల్లాలు ముందున్నాయి. కుక్క కాట్లు 2025, 2026 ల్లో బాగా పెరిగాయి. పలు కారణాల వల్ల లెక్కకెక్కని కాట్లే ఎక్కువ. కుక్కలు జంతువులను, మనుషులను కాటేసినపుడు వెలువడే వైరస్ తో రాబీస్, మూత్రం లోని బ్యాక్టీరియాతో లెప్టోస్పిరోసిస్, లాలాజలంలోని బ్యాక్టీరియాతో బ్రూసెలోసిస్, చర్మం, బొచ్చుతో ఉబ్బసం, చర్మవ్యాధులు వస్తాయి. దేశంలో సగటున ఏడాదికి 5,700 రాబీస్ మరణాలు నమోదయ్యాయి. ఎపి లో కడప, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో కుక్కకాటు చావులెక్కువ. కుక్కల వల్ల ట్రాఫిక్ అంతరాయంతో ప్రమాదాలు జరుగుతాయి. పర్యావరణం కాలుష్యమౌతుంది. అపరాత్రి కుక్కలు విచిత్రంగా దీర్ఘంగా మొరుగుతాయి. ప్రజలకు నిద్రాభంగం కలుగుతుంది.

పెంపుడు కుక్కలతో లాభాలు: కుక్కలతో ఒంటరితనం పోతుంది. రక్షణ లభిస్తుంది. వాటిని బహిఃప్రదేశానికి తిప్పడంతో లభించే వ్యాయామంతో, కుక్కల క్రీడలతో కలిగే ఆనందంతో ఆరోగ్యం మెరుగుపడుతుంది. కుక్కలు వేటలో సాయపడతాయి. పశువుల మందలో తోడేళ్ళు పడకుండా కాపాడుతాయి. ఘ్రాణశక్తితో పేలుడు సామగ్రిని, దొంగల ఆచూకీని గుర్తిస్తాయి. విదేశాల్లో అంధులు మనుషులకు బదులు కుక్క లను కాపలాకు, దారి చూపడానికి పెట్టుకుంటారు. దీంతో ఒక కుక్క 8 ఏళ్ల జీవితకాలంలో \$21,568 లు, ఏడాదికి \$2,696 లు మిగిలినట్లు, 2008 అధ్యయనంలో, తేలింది. ధృవ ప్రాంతాల కుక్కలు బండ్లను లాగుతాయి.

**కుక్కల సంరక్షణ చట్టాలు:** జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం-1960 ప్రకారం జంతువులకు తగిన ఆహారం, నీరు, నీడ, రక్షణ ఇవ్వాలి. వాటిని కొట్టరాదు, శిక్షించరాదు, వాటితో అధిక బరువులు మోయించరాదు, పందాలు ఆడరాదు. పశు సంక్షేమ సంస్థ (ఎడబ్ల్యుబి) దేశవ్యాప్తంగా పశుపక్ష్యాదుల సంరక్షణ, సంక్షేమాలను పర్యవేక్షిస్తుంది. పెంపుడు జంతువులకు, పక్షులకు ఆకలి, అసౌకర్యం, భయం, బాధల నుండి విముక్తి, సహజ ప్రవర్తనకు అవకాశం కల్పించనివారికి ఈ చట్టం ప్రకారం తొలి తప్పుకు రూ.50ల జరిమానా/3 నెలల జైలు, మలి తప్పులకు రూ.100ల జరిమానా/3 ఏళ్ల జైలు శిక్ష ఎడబ్ల్యుబి విధిస్తుంది. అయితే సాంస్కృతిక, శాస్త్రీయ, ఔషధ పరిశోధనలను జంతువులపై చేయవచ్చు. మనిషి ఆహారానికి చంపవచ్చు. సంతానోత్పత్తి నిరోధక, నపుంసకత్వ శస్త్రచికిత్సలు చేయవచ్చు, ముద్రలు, ముక్కుతాళ్ళు వేయవచ్చు. అసాం లాంటి రాష్ట్రాల్లో కుక్కలను తింటారు. జాతీయ జంతువు, జాతీయ పక్షి, అంతరించిపోతున్న జాతుల జంతువులను, పక్షులను చంపరాదు. సుప్రీం కోర్టు 07.11.2025 న వీధి కుక్కల విషయంలో ఒక ఆదేశమిచ్చింది. దాని ప్రకారం పాఠశాలలు, ఆస్పత్రులు, బస్, రైల్వే స్టేషన్ల వంటి సున్నిత ప్రాంతాల నుండి కుక్కలను తొలగించాలి. ప్రత్యేక ప్రాంతాలకు చేర్చి సంతానోత్పత్తినిరోధ, సూక్ష్మజీవులను నిరోధించే, చంపే టీకాలను వేయాలి. ప్రతి వార్డులో ప్రత్యేక ఆహార స్థలాలను ఏర్పరచాలి. ఈ పనులను 15.01.2026 లోపు పూర్తిచేయాలి. వీటిని చేయకున్నా చేసినట్లు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ధ్రువపత్రాల నిచ్చాయి. మోసాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు కంటితుడుపు తప్పుడు లెక్కలని మందలించింది. వీధి కుక్కల కోసం మనం రోడ్లపైనే తిండి పడేస్తాము. ఆహార పదార్థాలను వ్యర్థాలుగా పారేస్తారు. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ఇండియాలో ఏడాదికి రూ.92 వేల కోట్ల విలువచేసే 7.8 కోట్ల టన్నుల ఆహారం, మనిషికి 55 కిలోల చొప్పున, పారేస్తున్నారు. వీటిని తినడానికి కుక్కలు గుమికూడతాయి. శునకప్రేమికులు, కారుణ్య సంస్థలు కుక్కలపై చర్యలను వ్యతిరేకిస్తారు. ఈ కారుణ్యకారులు కొందరు తల్లిదండ్రులను, బంధువులను అశ్రద్ధచేస్తారు. ప్రకృతి సమతౌల్యానికి మత్స్యన్యాయం, పెద్ద చేపలు చిన్న చేపలను తినడం సహజం. పశుపక్ష్యాదుల కంటే మనుషులు ప్రధానం. ఉక్రెయిన్ లో, గాజా, పాలస్తీనాలలో, మన దేశంలో ఇతర మతస్తులపై కులమతజాతివర్ణలింగవివక్షతలతో జరుగుతున్న హింసను, హత్యలను ముందుగా ఆపాలి.

**విదేశాల్లో కుక్కలు:** స్కాండినేవియన్ దేశాల్లో వీధి కుక్కలు ఉండవు. అన్నీ పెంపుడు కుక్కలే. స్వీడెన్ లో కుక్కలకు ప్రత్యేక వాకింగ్ పార్కులు ఉంటాయి. వాటిలో ఒకసారి ఒక కుక్కనే తిప్పాలి. రెండు కుక్కలు ఒకేసారి ప్రవేశిస్తే ఒకదాపై ఒకటి మొరిగి, కాట్లాడతాయని భయం. నెదర్లాండ్స్, జపాన్, థాయిలాండ్ లలో పట్టుకో-నపుంసకంచేయి-టీకాలువేయి-వదిలేయి (సి.ఎన్.వి.ఆర్.) కార్యక్రమాన్ని చేపడతారు. తప్పనిసరి నమోదుతో వీధి కుక్కలను నివారిస్తారు. టర్కీలో కారుణ్యమరణ చట్టంతో కుక్కలను చంపవచ్చు.

**అసలు కుక్కలు ఎందుకు కరుస్తాయి?:**

వాతావరణంలో శీతోష్ణస్థితుల మార్పు వల్ల కుక్కలు ఉద్రేకాలకు లోనవుతాయి. భయం, భ్రమలు, దెబ్బలు తగిలినపుడు బాధలు, స్వీయరక్షణ కారణాలతో స్వాభావిక గందరగోళానికి గురయి కుక్కలు వెంటబడతాయి, కాటేస్తాయి. తమ ఆహారాన్ని, ఇష్టమైన వస్తువులను, విరామ/నిద్రా స్థలాలను ఆగంతకులు ఆక్రమిస్తారని, తమ పిల్లలను తీసుకెళతారని అనుమానించి కుక్కలు పశువులను, మనుషులను కరుస్తాయి. పెంపుడు కుక్కలు మానసిక వత్తిడితో యాజమానులనే కాటేస్తాయి.

**వీధి కుక్కల సమస్యకు పరిష్కారం:** సామాజీకీకరణ, శిక్షణ ద్వారా పెంపుడు కుక్కల్లో ఉద్రిక్తతలను తగ్గించవచ్చు. వీధి కుక్కలకు జంతు జనన నియంత్రణ కేంద్రాలను, మానవ సంచారానికి దూరంగా ప్రత్యేక ఆహార వడ్డింపు స్థలాలను ఏర్పరచాలి. కుక్కలను చూసి పరుగెత్తరాదు. నిలకడగా నుంచోవాలి. నెమ్మదిగా వెనక్కు జరగాలి. కర్రను, గొడుగును అడ్డుగా వాడాలి. జంతు జనన నియంత్రణ (కుక్కల) నియమాలు-2023 జన సమూహాల కుక్కలను ఆహార, నివాస హక్కులు గల సామూహిక జంతువులుగా పరిగణిస్తాయి. వాటి గుంపగుత్త నిర్మూలనను, స్థానభ్రంశాన్ని నిషేధించాయి. ఐతే నివాసుల సంక్షేమ సంస్థలు ప్రత్యేక తీర్మానాలు చేసుకోవచ్చని, ప్రజలు ఫిర్యాదుచేసిన 4 గంటల్లో కుక్కలను తొలగించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. వీధి కుక్కల సమస్య పరిష్కారంలో పౌర బాధ్యత: అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలి. పౌరులు పౌరబాధ్యతతో ప్రవర్తించాలి. కారుణ్యసూత్రాలను పాటిస్తూనే మనుషులకు ప్రాధాన్యతనివ్వాలి. మానవత్వంతో మెలగాలి. పట్టనితనాన్ని వదలి సమస్యలను తీవ్రంగా పట్టించుకోవాలి. శాస్త్రీయ పరిష్కార ప్రయత్నాలు చేయాలి.

*సర్కారు లెక్కల ప్రకారం 2025 కు ఇండియాలో 6 కోట్ల, ఆంధ్ర ప్రదేశ్ లో 8.6 లక్షల, గుంటూరులో 31 వేల, తెలంగాణలో 7.9 లక్షల, హైదరాబాదులో 4 లక్షల వీధి కుక్కలున్నాయి. ఉత్తర ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ లు వీధి కుక్కల సంఖ్యలో మొదటి స్థానాల్లో ఉన్నాయి.*

సంగిరెడ్డి హనుమంత రెడ్డి
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
9490 20 4545



# గ్రేటర్ హైదరాబాద్



## రసాయన శాస్త్రంలో నక్కా శ్రీనివాస్‌కు డాక్టరేట్

**పటాన్చెరు, మార్చి2 (ఉదయం) :**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ నక్కా డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'ఎల్సీఎంఎస్ పద్ధతి కోసం వ్యూహాత్మక విధానాలు, గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను ఉపయోగించి ఫార్మాస్యూటికల్స్ లో ఎన్ డి ఎస్ ఆర్ ఐల అభివృద్ధి' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

ఆధునిక ఔషధ తయారీలో కీలకమైన భద్రతా సమస్య అయిన నైట్రోసమైన్ ఔషధ పదార్థ సంబంధిత మలినాలను (ఎన్ డి ఎస్ ఆర్ ఐలు) గుర్తించడం, నియంత్రించడంపై డాక్టర్ శ్రీనివాస్ పరిశోధన దృష్టి సారించినట్టు తెలియజేశారు. సిప్రోఫ్లోక్సాసిన్, మోక్సిఫ్లోక్సాసిన్ వంటి యాంటీబయాటిక్స్, అసెక్లోఫెనాక్, మెఫెనామిక్ యాసిడ్ వంటి యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధాలు, ఆల్ఫా 1 బ్లాకర్ టామ్సులోసిన్ వంటి కీలకమైన ఔషధ తరగతులలో ఎన్ డి ఎస్ ఆర్ ఐ లను లెక్కించడానికి వీలుగా అత్యంత సున్నితమైన యుపిఎల్ సి ఎమ్ సి/యంఎస్ పద్ధతులను ఈ అధ్యయనంలో అభివృద్ధి చేసినట్టు వివరించారు. ఇవి సురక్షితమైన మందులని, నియంత్రణకు ఉపకరిస్తాయన్నారు.

డాక్టర్ శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే ప్రభావవంతమైన పరిశోధనలకు గీతం నిబద్ధతను ఈ విజయం ప్రతిబింబిస్తోందని తెలిపారు.





## రుద్రారంలో భూ మోసాలు

**అక్రమ లావాదేవీలతో కలకలం**

**సంగారెడ్డి, మార్చి2 (ఉదయం) :**

సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు మండలం పరిధిలోని రుద్రారం గ్రామం ప్రస్తుతం తీవ్రమైన భూ వివాదాలు, అక్రమ లావాదేవీలతో కలకలం రేపుతోంది. గత రెండు దశాబ్దాలుగా జరిగిన భూ లావాదేవీలను ఆధారంగా చేసుకుని, ఇప్పుడు అమాయక ప్లాట్ కొనుగోలు దారులను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2000-2001 సంవత్సరాలలో జిపిఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రుద్రారం గ్రామంలో తన కార్యకలాపాలను ప్రారంభించింది. అనంతరం 2018 సంవత్సరంలో సర్వే నంబర్ 72లో సుమారు 20 ఎకరాల భూమిలో "సంపత్ గౌడ్ లేఅవుట్" అనే వెంచర్ రూపొందించబడింది. ఈ వెంచర్‌లో అనేక మంది సామాన్య ప్రజలు తమ కష్టార్జిత డబ్బులతో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇదే క్రమంలో, 2005 సంవత్సరం నుండి జిపిఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఈసీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రెండు సంస్థలు జిపిఆర్ ఆధ్వర్యంలో కలిసి పనిచేశాయి. సర్వే నంబర్ 63కు సంబంధించిన భూమిని కేశం శ్రీనివాసరావు పేరుతో, జీఎం జిపిఓ హోల్డర్స్ తదితరులకు ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేయడం జరిగింది.

అయితే, సమస్య ఇక్కడితో ఆగలేదు. అదే భూమికి సంబంధించి ఇప్పుడు అక్రమంగా పట్టా పాస్ పుస్తకాలు తయారుచేసి, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానిక సర్వే అధికారులు, ఎమ్మార్వో స్థాయి సిబ్బంది మెసేజీల ద్వారా ప్లాట్ యజమానులను గందరగోళానికి గురిచేస్తూ, మోసానికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ అక్రమాలపై గతంలోనే బాధితులు ఆర్డీఓలు, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల బాధితుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి మోసాలు మరింత ప్రోత్సాహం పొందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి అక్రమ పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని, ఈ మోసాలకు పాల్పడిన వ్యక్తులు మరియు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో, ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులందరూ కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు.

ఇది కేవలం భూ వివాదం మాత్రమే కాదు.. సామాన్య ప్రజల నమ్మకాన్ని, జీవిత పొదుపును దోచుకునే వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనమని బాధితులు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయకపోతే, ఈ వివాదం మరింత పెద్ద ఉద్యమంగా మారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు

## రూ.2.50 లక్షల ఎల్వోసి మంజూరు

**షాద్ నగర్, మార్చి2 (ఉదయం) :**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో కేశం పెట్ మండలం నిర్దవెల్లి గ్రామానికి చెందిన దొబ్బల రాములు అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కు తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 2.50 లక్షలు రూపాయలు, ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేయించారు.. ఈ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి సమక్షంలో బాధితునికి ఎల్వోసి అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎల్ఓసి మంజూరు చేయించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు..

## 4 హోలీ, 19 ఉగాది, 27 శ్రీరామ నవమి

**పటాన్చెరు, మార్చి2 (ఉదయం) :**

తెలుగు ప్రజల నూతన సంవత్సరానికి మొదటి పండుగ ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీన ఉగాది, మార్చి 4వ తేదీన హోలీ, మార్చి 27న శ్రీరామ నవమి పర్వదిన పండుగలు నిర్వహించుకోవాలని పటాన్చెరు డివిజన్ పరిధిలోని పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. సోమవారం ఉదయం పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో పండుగల తేదీలు.. ఏర్పాట్లపై పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద పండితుల సూచనలకు అనుగుణంగా.. పైన పేర్కొన్న తేదీలలో పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ఐదు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ



**పటాన్చెరు, మార్చి2 (ఉదయం) :**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసన సభ్యుల గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని వాసవి ఫంక్షన్ హాలులో సోమవారం ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దం క్రితం వరకు మహిళలు వంటిల్లుకే పరిమితమయ్యే వారిని.. నేడు అన్ని రంగాల్లో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పారని అన్నారు. అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నప్పటికిని.. వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని అన్నారు. సమాజంలో ఆడపిల్లల చదువుకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి సహాయ సహకారాలతో మహిళా సంక్షేమం ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ హారిక విజయ్ కుమార్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాకు ప్రాణ హానీ ఉంది..

- **మహిళా కౌన్సిలర్ భర్త సాదిక్**
- **షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు**

**షాద్ నగర్, మార్చి2 (ఉదయం) :**



షాద్ నగర్ పట్టణంలోని 15వ వార్డు మహిళా కౌన్సిలర్ మరియంబేగం భర్త సాదిక్ తనకు ప్రాణా హాని ఉన్నట్టు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. 15వ వార్డులో నిర్మిస్తున్న దేవాలయం వద్ద ఏర్పడిన వివాదానికి సంబంధించి బిఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల స్థానిక నాయకుల మధ్య విభేదాలు చెలరేగడంతో పోలీసులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం. దేవాలయ నిర్మాణం వ్యవహారంలో గతం నుండి కొంత జాప్యం జరుగుతూ వస్తుండడంతో ప్రస్తుతం ఈ గొడవకు కారణంగా చెబుతున్నారు. గతంలో ఈ ఆలయాన్ని నిర్మించ తలపెట్టిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ మానస చిన్న కొంత ఖర్చుతో ఆలయ పనులు మొదలుపెట్టారు. ఏమైందో తెలియదు కానీ ఆయన పనులు చేయకూడదని మరో వర్గం నిర్ధారించి అతని దూరం పెట్టింది. ఎందుకు దూరం పెట్టారు సామాజిక కారణాలు ఏమున్నాయి అన్న విషయం పక్కన పెడితే, నిన్న ఆలయానికి సంబంధించి వాటర్ ట్యాంక్ కోసం పైపు కనెక్షన్ రిపేర్ చేయించి పెట్టించారు. కౌన్సిలర్ కు చెప్పడంతో ఈ పనులు దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా సాదిక్ వద్దకు పనులు ముట్టుకోకూడదని ఇక్కడ ఎవరు రాకూడదని మరో వర్గం నాయకులు స్థానికులు అక్కడ సాదిక్ తో గొడవకు దిగారని తెలుస్తుంది. ఇతర వార్డుల నుండి మరి కొందరు అక్కడికి చేరుకోవడం మాట పెరగడం సాదిక్ పై దాడికి ప్రయత్నం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇనపద్యంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరగడం ఇక్కడ పనులు వారు నిర్వహించిన విధంగానే జరగాలని కౌన్సిలర్ మరవరు ఇక్కడికి రావద్దన్న విషయం చెప్పడం తదితర హెచ్చరికల సందర్భంగా సాదిక్ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. తనకు వార్డులో ప్రాణహాని ఉందని తనకు ప్రాణ రక్షణ కావాలని తనపై దాడికి ప్రయత్నించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాధిక్ పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వ ఫిర్యాదు చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు కసరత్తు



**సంగారెడ్డి, ఉదయం.**

నిమ్జ్ లో మౌలిక వసతులు కల్పించే ఎస్ఆర్అర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి ఇప్పటి వరకు సేకరించిన భూములను అప్పగించాలని కలెక్టర్ సూచించారు. లే అవుట్ అభివృద్ధి చేసేందుకు వీలుగా పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. లే అవుట్ ప్రకారం రోడ్లు, ఇతర త్ర మౌలిక వసతులు కల్పించేందుకు సేకరించిన భూముల్లో హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గతంలోనే భూములు తీసుకుని రైతులకు నష్ట పరిహారం చెల్లించామని కానీ మొన్నటివరకు ఆ భూముల్లో పనులు చేపట్టకపోవడంతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టనుండటం తో ఇకపై పంటలు వేయకుండా చూడాలని, ఐదివరకే పంటలు వేసి ఉంటే కోతలు పూర్తయ్యే వరకు వేచి చూడాలన్నారు. సర్వే ఎలాంటి ఆటంకాలు లేకుండా శాంతియుత వాతావరణం లో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సర్వే సందర్భంగా వేసిన హద్దు రాళ్ళను రైతులేవరూ తొలగించవద్దని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లు మాధురి, పాండు లతో పాటు టీజిఐఐసి జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి , తాహిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులను వినియోగించుకోండి




**రంగారెడ్డి, మార్చి02 (ఉదయం):**

మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టితో చేపట్టిన వందరోజుల ప్రత్యేక ఆరోగ్య సేవల కార్యక్రమాలు మరియు జిల్లాలో అమలు జరుగబోతున్న హెచ్ పి వి టీకా కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయ సముదాయంలో కొంగరకలాన్ వద్ద మహిళా ఉద్యోగులు మరియు ఇతరులకు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు స్క్రినింగ్ పరీక్షలు మరియు అవసరమైన వైద్య సేవలు అందించబడతాయనీ, అదనంగా జిల్లాలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం మొదటి దశలో మాతృ ఆరోగ్యము శిశు ఆరోగ్యము మరియు వృద్ధులు ఆరోగ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టబడుతున్నాయి గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ పిల్లల ఆరోగ్య పరీక్షలు మరియు వృద్ధుల అవసరమైన వైద్య సేవలు సమగ్రంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించబడినది. అలాగే బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెచ్ పి వి టీకా కార్యక్రమము సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రా రెడ్డి గారు,జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలిత దేవి పాల్గొన్నారు.

## క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

**సంగారెడ్డి, మార్చి2 (ఉదయం ప్రతినిధి) :**




జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సి.ఎం. కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తమ సత్తా చాటి, మొదటి, రెండవ, మూడవ స్థానాలను సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చిన ఈ క్రీడాకారుల విజయాలను గుర్తించిన జిల్లా కలెక్టర్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా విభాగాల్లో విశేషంగా రాణించి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన మొత్తం 75 మంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లాకు చెందిన యువ క్రీడాకారులు తమ కృషి, నిబద్ధత, కఠోర శ్రమతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటడం ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు. అథ్లెటిక్స్ విభాగంలో 24 మంది బాలబాలికలు రాష్ట్ర స్థాయిలో మెరిసిన ప్రదర్శన కనబరిచారు. అలాగే రెజ్లింగ్‌లో 4 మంది, స్విమ్మింగ్‌లో 5 మంది, కిక్‌బాక్సింగ్‌లో 6 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి విజయాలను సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారు. వుశు విభాగంలో 13 మంది అత్యుత్తమ ప్రతిభ చూపగా, జిమ్నాస్టిక్స్‌లో ఒకరు, యోగా విభాగంలో ఒకరు, బాక్సింగ్‌లో ఇద్దరు రాష్ట్ర స్థాయి పతకాలను సొంతం చేసుకున్నారు. ఇక ఇతర క్రీడా విభాగాల విషయానికి వస్తే, బాల్ బ్యాడ్మింటన్‌లో 3 మంది, పవర్ లిఫ్టింగ్‌లో ఒకరు, కరాటేలో 5 మంది, బ్యాడ్మింటన్‌లో 4 మంది, తైక్వాండోలో 6 మంది, క్యారమ్‌లో ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కీర్తి ప్రాప్తి సాధించారు. అన్ని విభాగాల్లోనూ జిల్లా క్రీడాకారులు ఎవరికీ తీసిపోకుండా పోటీ పడి స్థానాలు సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "క్రీడా రంగంలో జిల్లాకు ఇది గర్వకారణం. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన ఈ యువ క్రీడాకారులు భవిష్యత్తులో దేశ స్థాయిలోనూ రాణించేలా మరింత కృషి చేయాలి. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి" అని అన్నారు. క్రీడాకారుల విజయాల్లో వారి కృషితో పాటు తల్లిదండ్రులు, కోచ్‌ల శ్రమ కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి టి. అఖిలేష్ రెడ్డి తో పాటు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


**షాద్ నగర్, మార్చి2 (ఉదయం) :**



మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది ఎల్లవేళలా మీకు అండగా నిలబడతాను అని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో 7 వార్డు సాయి బాలాజీ టౌన్ షిప్ లో కాలని వాసులు ఏర్పాటు చేసిన సన్మాన సమావేశానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వవేశర్,వైస్ ఛైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలని రోడ్డు, డ్రైనేజి, తాగునీరు వంటి అంశాలపై కాలనీ వాసులు ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ను కోరారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి ఎన్ని నిదులవినే నేను తీసుకువస్తాను. అధికారులు కౌన్సిలర్లు షాద్ నగర్ ప్రజల కోసం పని చేయాలి, అధికారులు బాధ్యత యితంగా పని చేయాలి అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా స్థానికులకు అండగా నిలుస్తామని వారి సమస్యలను తీర్చుతామని భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీ వాసులు మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన అగ్గనూర్ బస్వవేశర్, వైస్ చైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లను శాలువాలతో కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొప్పునూరి ప్రవణ్, పెంటయ్య, మురళీ మోహన్ (అప్పి)దిలీప్,,అనిల్,చందు,ముబారక్ అలీ ఖాన్, సాధిక్, కాలనీ వాసులు మండవ మురళీధర్ రావు, రవి కుమార్,రాజిరెడ్డి,బాలు నాయక్, రాజు, ఖదీర్, యదయ్య పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**కుత్బుల్లాపూర్, మార్చి 2 (ఉదయం ప్రతినిధి ):**



బాచుపల్లి కోమటికుంట చెరువు ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ కు ఆకుల సతీష్ టీం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి ప్రాంతంలో కోమటికుంట సరస్సు ఒక గుర్తింపు పొందిన జలాశయం కాగా, దాని పూర్తి నిల్వ స్థాయి (ఎఫ్ టి ఎల్ ) బఫర్ జోన్ ప్రాంతాలను చట్టపరంగా రక్షించాలని, వాసవి కన్స్ట్రక్షన్స్ 8, 9 బ్లాక్ ల నిర్మాణాన్ని ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ పరిధిలో చేపట్టినట్లు గత అధికారిక సంయుక్త పరిశీలనల్లో వెల్లడైందని ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత శాఖలు రెండు సార్లు తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాయని, బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో 2 క్రిమినల్ కేసులు నమోదు చేయబడ్డాయని తెలిపారు. ప్రజాహిత దృష్ట్యా ఈ అంశంపై హైకోర్టు లో దాఖల్ చేయగా హైకోర్టు 09092025 తేదీన ఇచ్చిన ఉత్తర్వులో సంబంధిత హైడ్రా రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు రికార్డుల పరిశీలన, పునఃసర్వే, సరిహద్దుల గుర్తింపు, అక్రమ నిర్మాణాలపై చర్యలు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే ఇప్పటివరకు తుది డీమార్కేషన్ లేదా సర్వే, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అధికారులు సహకరిస్తున్నారని, హెచ్ఎండిఏ కమిషనర్ సెప్టెంబర్ నెలలో వాసవి కన్స్ట్రక్షన్ కు అనుకూలంగా తప్పుడు ఉత్తర్వుల ఆధారంగా 8,9 రివైజ్డ్ ఎన్వోసీ లేకుండా నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, శ్రీనివాస్, ఈశ్వర్ రెడ్డి, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S. No.420 OF 2026**

**Between:**

Sri Ambati Vidya Rani & Others ...Plaintiffs

AND

The Tahsildar, Bandlaguda Mandal & Another ...Defendants

To,
1. All Concerned, ...Defendant No.2

Whereas the above named Plaintiffs have filed above suit to grant the legal heir certificate in favour of the plaintiffs of their deceased wife, Daughters and son Late AMBATI DAYANAND.

Whereas, the Hon'ble Court has ordered notice through paper publication. Therefore please take notice that the above suit is posted for you appearance to 13.03.2026, and you are directed to appear before the said court on 13.03.2026 at 10.30 A.M., either personally or through an Advocate, failing which the suit will be decided according to law.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**K.PREM KISHORE**
**Advocate.**
**Office at H No. 3-5-1090/A/8, Laxmicolony, Narayanguda, Hyderabad-500029.**

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE: CITY COURT, AT: HYDERABAD**
**O. S. No. 256 OF 2026**

**Between:**

1) Smt. ADAVELLY SHASHIKALA W/o. Late Adavelly Surender Reddy, aged about 65 years, Occ: Household,
2) Mr. ADAVELLY VIJAY KRISHNA REDDY, S/o. Late Adavelly Surender Reddy, aged about 45 years, Occ: Private Employee, both are presently residing at H. No. 2-3-707/A/4, Thirumala Nagar, Amberpet, Hyderabad - 5000 13 and permanent R/o. Flat No. 205, Anand nagar colony, New Bowenpally, VTC, Tirumalagiri, Hyderabad.
3) Smt. ADAVELLY SHILPA REDDY, D/o. Late Adavelly Surender Reddy, W/o. Sri R. Dheeraj Reddy, aged about 46 years, Occ: Household, Temporarily staying at 4584, Roderigo, Fremont, CALIFORNIA, U.S.A. and permanent R/o. H. No. C/702, Jai Vayu Towers, Lower Tank Bund Road, Elchiguda, VTC, Secunderabad-500080,
...Plaintiffs

AND

1,Mr. A. Rajesh Deepak, S/o. Late A. Satish, aged about 42 years, Occ: Business, H. No. 2-2-1105/A/8, situated at Indira Nagar, Tilkak Nagar, Amberpet, Hyderabad-500013.
2.All Concerned
...Defendants

**Notice to:**
All Concerned
...Defendants 2

Whereas the above named plaintiffs filed the suit for declaration as they are the legal heirs of Late Adavelly Surender Reddy S/o. Late Narayana Reddy, If any person/ persons got any objection for issuance of legal heir certificate, they should attend personally or through their pleader on 06-04-2026 at: 10: 30 A.M. before the Hon'ble XIX Junior Civil Judge: City Civil Court, Hyderabad.

**(By Order of Hon'ble Court)**

Sd/-
**P. JITHENDER REDDY**
**Advocate**
**#16-11-781/6/1/4, Moosarambagh HYDERABAD-36**
**Mobile: 9246534604.**

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

**పలు సమస్యలపై వినతుల స్వీకరన...**
**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**
**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 62**



**జగిత్యాల ,మార్చి 02 (వుదయం ప్రతినిధి):**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్ ఆర్డీఓ లతో కలిసి స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా తేదీ 2 3 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి రాజ గౌడ్ జగిత్యాల కోరుట్ల ఆర్డీవోలు మధు సూదన్ జీవాకర్ రెడ్డి జెడ్పిసిఓ గౌతమ్ రెడ్డి డిఆర్డిఓ రఘువరన్ వివిధ శాఖల జిల్లా అధికారులు తహసీల్దార్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# మంచిర్యాలలో ప్రజావాణి కార్యక్రమం

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**మంచిర్యాల /మార్చి 2, 2026: (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన గజెల్లి నర్సయ్య తన భూమిలోకి కొందరు అక్రమంగా చొరబడి బోర్ వేశారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కాసిపాక విజయ్ కుమార్, బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన దాగం చరణ్ తాము తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని పోరాడామని, తమ పేర్లను ఉద్యమకారుల జాబితాలో నమోదు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్ రార్ తమ తాత ముత్తాతలకు చెందిన షెత్ సింధీ భూములను అన్యాక్రాంతం కాకుండా తమకు వర్తించే విధంగా న్యాయ సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చునార్కర్ తారాబాయి, చునార్కర్ శ్యాం రావు తాము సంవత్సరాలుగా కాస్తు, కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూమికి నూతన పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన బొద్దుల స్వప్న దివ్యాంగురాలు అయిన తనకు ప్రభుత్వ పథకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన పోలికోట సుజిత నిరుపేద ట్రాన్స్ జెండర్ అయిన తనకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. డీ మార్కెషన్, జాతీయ రహదారుల విస్తరణలో అవార్డు పెంచాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ భూముల కబ్జాలు, బఫర్ జోన్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి చర్యలు తీసుకోవాలని, అంత్యోదయ కార్డు మంజూరు కొరకు ఇతర అంశాలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంథని నియోజకవర్గ శాసనసభ్యులుగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని, మంథని ప్రాంత అభివృద్ధిపై విశేష కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించిన కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి- 02 (వుదయం ప్రతినిధి)**

గోదావరి పుష్కరాలకు సంబంధించి జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్ల పై ప్రతిపాదనలు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝూ* తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, పార్కింగ్,ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో గోలివాడ, మంథని, గోదావరిఖని, సుందిళ్ల వంటి ప్రాంతాలలో గోదావరి నది ప్రవాహం ఉంటుందని అక్కడ చెయ్యాల్సిన ఏర్పాట్లు పై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాం రెడ్డి, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.

# అవినీతిరహిత పరిపాలనే మా ధ్యేయం

**కేంద్ర మంత్రి బండి సంజయ్**
**కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి సమీక్ష**
**టౌన్ ప్లానింగ్ అధికారులకు దిశా నిర్దేశం**
**కరీంనగర్ కార్పొరేషన్‌లో మార్పునకు శ్రీకారం**





**కరీంనగర్, మార్చి 02 (వుదయం ప్రతినిధి) :**

అవినీతిరహిత పరిపాలనే మా ధ్యేయం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి సోమవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డిసిపి, ఎసిపిలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో "ఇప్పటి దాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు.. బాధితులను ఇబ్బంది పెట్టొద్దుని, అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇవ్వాలన్నారు. బ్రోకర్ల ద్వారా ఏజెన్సీలను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని, అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. మిమ్ముల్ని బెదిరించడానికో, భయపెట్టడానికో సమావేశపరచలేదు, పూర్తి పారదర్శకతో పనిచేయాలని, నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేస్తూ ఇంటి పర్మిషన్ల కోసం మీ వద్దకు వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చే విషయంలో మీకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నామని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా పట్టించుకోవద్దని, బీజేపీ కార్పొరేటర్ల నుండి ఒత్తిళ్లు రాకుండా చూసుకునే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.మున్సిపల్ సిబ్బంది మాత్రం నిజాయితీగా ఉంటూ నిబంధనల ప్రకారం పనిచేయాల్సిందేనన్నారు. నిబంధనలకు భిన్నంగా అధికార పార్టీతో అంటకాగుతూ అవినీతికి పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం నష్టపోయేది మీరేనని హితవు పలికారు. మున్సిపల్ ఆఫీసుకు వచ్చే ప్రజల కోసం "హెల్ప్ డెస్క్" తరహా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక పేరుతో డెస్క్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ మున్సిపల్ పాలక వర్గం మారింది.. నెలరోజుల్లో కచ్చితంగా మార్పు కనిపించాలి... కొత్త పాలకవర్గం మార్క్ చూపాల్సిందేనని కొంత మంది అధికారులు సొంతంగా బ్రోకర్లను, ఏజెన్సీలను ఏర్పాటు చేసుకుని వాళ్ల ద్వారా పనులు చేయిస్తూ పైసలు దండుకుంటున్నారని ఇకపై అట్లా ఉండటానికి వీల్లేదన్నారు. ఎవరైనా ఇంకా అవినీతిని కొనసాగిస్తామనుకుంటే మాత్రం కరీంనగర్‌లో ఉండటానికి వీల్లేదని, బదిలీపై వెళ్లొచ్చు వాళ్లకు తాను సహకరించి బదిలీ చేస్తామన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న తనకు ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులపై నిఘా ఉంటుందని, మీరేం చేస్తున్నారో పక్కా సమాచారం వస్తుందని, గతంలో మీరు ఏం చేశారో అనవసరం లేదు.. ఇకపై మాత్రం అవినీతికి దూరంగా ఉంటూ పనుల కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా అనుమతి ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వాళ్లలో 46 మంది కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లే, ముఖ్యంగా బీజేపీ కార్పొరేటర్లు అలాంటి వాటి జోలికి పోరని, ఇతర పార్టీల కార్పొరేటర్లు ఎవరైనా వాటికి అలవాటు పడితే రూల్స్ ప్రకారం వ్యవహరించాలన్నారు. ఇకపై అలాంటి వాటికి తావు లేకుండా ఉండటం కోసం మూడు రోజుల్లోగా కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులతో "అవగాహన సదస్సు"ను ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ స్పూర్తితో రాష్ట్రమంతటా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు నాంది పలకాలి. ఆ విధంగా మీరు పనిచేసి చూపాలని దిశ నిర్దేశం చేశారు. కరీంనగర్ కు ఐకానిక్ గా ఉండే ప్రాజెక్టులు ఏమైనా ఉంటే సూచించాలని, వాటి అమలు కోసం, నిధుల కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. పెద్ద ఎత్తున సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అతి త్వరలోనే "అటల్ క్యాంటీన్" లను ఏర్పాటు చేసి ఆసుపత్రులు, మార్కెట్ కూడళ్లలో పేదలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని కడుపు నిండా పెట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# హోలీ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 02 (వుదయం జిల్లా ప్రతినిధి):**

హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగిస్తూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు,పండుగ సందర్భంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. బైకులపై, కార్లలో గుంపులుగా తిరుగుతూ పెద్ద శబ్దాలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, ఇష్టం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం చేయరాదని సూచించారు.యువత వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, ర్యాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతా సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.హోలీ అనంతరం చెరువులు, లోతట్టు ప్రదేశాలు, ప్రాజెక్టులలో స్నానాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ రంగుల హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తూ భూపాలపల్లి జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరపున హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాఠశాలలో హోలీ సంబరాలు

**జన్నారం, ఫిబ్రవరి 2(వుదయం విలేకరి) :**

జన్నారం మండలంలోని పలు పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు.కలమడుగు వివేకానంద పాఠశాలలో చిన్నారులు హోలీ పండగ ఎందుకు జరుపుకుంటారు అనే అంశం పైన నాటిక రూపంలో అందరిని అలరించారు. హోలీలో రంగులను ప్రకృతి నుంచి వచ్చే రంగులోనే వాడుతూ రసాయనాలతో తయారుచేసిన రంగులను దూరం చేయాలని పిల్లలకు పాఠశాల కరెస్పాండెంట్ సతీష్ గౌడ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్‌గౌడ్ ,ఇన్చార్జి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధర్మపురి డిగ్రీ కళాశాల కల సాకారం

**2026-27 నుంచి తరగతుల ఆరంభం**
**స్థల పరిశీలన చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ధర్మపురి,మార్చి02 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురిని చదువుల నిలయంగా మార్చుతా అని ఎన్నికల వేళ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా మని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ధర్మపురికి మంజూరైన డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధర్మపురికి డిగ్రీ తీసుకువచ్చామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అనుమతి లభించిందన్నారు. స్థానిక నేతల కృషితో ఈ కల నిజమైందని తెలిపారు.నాలుగు కోర్సులు, 240 సీట్లు,202627 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. మొదటి దశలో బీఏ,బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్),బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులతో మొత్తం 240 సీట్లు కేటాయిం చనున్నట్లు తెలిపారు. తాత్కాలికంగా జూని యర్ కళాశాల ఆవరణలో తరగతులు నిర్వహించి,ఏడాదిలోపే పక్కా భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందాలని మంత్రి సూచించారు. గతంలో డిగ్రీ కళాశాల లేకపోవ డంతో అనేక మంది ఆడపిల్లలు చదువును మధ్యలోనే నిలిపివేశారని ,ఇకపై అలాంటి పరిస్థితి ఉండదన్నారు. బీఆర్ఎస్ పై విమర్శలు 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి ప్రజల అవసరాలను పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. మేము ఇచ్చిన మాటనిలబెట్టుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో బీఈడీ,బీఫార్మసీ,లా కాలేజీలుస్థానిక యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేలా కోర్సులు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.భవిష్యత్తులో బీఈడీ, బీఫార్మసీ, లా కాలేజీలు కూడా ఏర్పాటు చేసి ధర్మపురిని ఉన్నత విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. పుష్కరాలకు రూ.944 కోట్ల అంచనా 2027లో జరిగే గోదావరి పుష్కరాల కోసం అధికారులు సుమారు రూ.944 కోట్ల అంచనాలు సిద్ధం చేశారని మంత్రి వెల్లడించారు.పుష్కరాల సందర్భంగా భారీ నిధులు తీసుకువచ్చి ధర్మపురిని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంఘనబట్ల. దినేష్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి రాజేష్,వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

# సేవా శిఖరం రజిని రుద్రమ

**మహిళా సాధికారతకు కేరాఫ్ అడ్రస్**
**వెయ్యికి పైగా జాతీయ పురస్కారాలు**
**కరోనా కాలంలో కడలి అంతటి సాయం**
**రాజకీయాల్లో 'నారీ న్యాయ్' గళంగా క్రాంతిజ్యోతి అధినేత్రి**



**హనుమకొండ, మార్చి 02 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఆమె అడుగు పెడితే అది సేవా పథం.. ఆమె గళం విప్పితే అది అబలల పక్షం. క్రాంతిజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సామాజిక సేవను ఒక యజ్ఞంలా భావించి, వేలాది మంది జీవితాల్లో మార్పు తెస్తున్న డాక్టర్ రజిని రుద్రమ ప్రస్థానం అద్వితీయం. ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించి, నేడు జాతీయ స్థాయిలో వెయ్యికి పైగా అవార్డులు అందుకున్న అరుదైన మహిళా మూర్తిగా ఆమె రికార్డు సృష్టిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆమె ఒక సాధరణ ప్రయివేటు ఉపాధ్యాయురాలు.. కానీ ఆమె ఆశయం అసాధారణం. సమాజంలో మార్పు రావాలని కోరుకోవడమే కాదు, ఆ మార్పుకు తానే ఒక వేదిక కావాలని సంకల్పించారు. క్రాంతిజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వేలాది మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ, సేవే పరమావధిగా దూసుకుపోతూ నేటి తరం మహిళలకు స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారు.

**కరోనా కాలంలో కడలి అంతటి సాయం.. ఉస్మానియాలో అన్నదాతగా..**

కరోనా మహమ్మారి అల్లకల్లోలం సృష్టిస్తున్న తరుణంలో, ప్రాణాలకు తెగించి బాధితుల పక్షాన నిలిచారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో వరుసగా 45 రోజుల పాటు నిరంతర అన్నదాన కార్యక్రమం నిర్వహించి వేలాది మంది ఆకలి తీర్చారు. లాక్‌డౌన్ సమయంలో నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్ల పంపిణీతో 'క్రాంతిజ్యోతి' సేవా నిరతిని చాటుకున్నారు.

**ముదిరాజ్ 'లేడీ ఐకాన్'.. గౌరవ డాక్టరేట్ పట్టా..**

ఆమె చేస్తున్న నిరంతర కృషిని గుర్తించి మద్రాస్ వేదిక్ యూనివర్సిటీ 'గౌరవ డాక్టరేట్' ప్రదానం చేయగా, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్ చేతుల మీదుగా 'ముదిరాజ్ లేడీ ఐకాన్' పురస్కారాన్ని అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసినందుకు గానూ వివిధ జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల నుండి సుమారు 1000 వరకు అవార్డులు దక్కించుకోవడం ఆమె సేవా పటిమకు నిదర్శనం.

**ఆర్థిక స్వావలంబన దిశగా...**

మహిళలు ఆర్థికంగా ఎదగాలని సంకల్పించి 2000 మందికి పైగా ఉచిత కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ చేపట్టారు. పేపర్ ప్లేట్స్, జ్యూట్ బ్యాగ్స్ వంటి చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటులో ఆమె అందించిన సహకారానికి గానూ రాజమండ్రిలో ఎంపీ మార్గాని భరత్ చేతుల మీదుగా 'బెస్ట్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ 2020' అవార్డును అందుకున్నారు. కేవలం సేవకే పరిమితం కాకుండా, రాజకీయాల ద్వారా వ్యవస్థలో మార్పు తేవాలని కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల కోసం, ప్రజా సమస్యల కోసం ఢిల్లీ వేదికగా గళమెత్తిన ఆమెకు, నేషనల్ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ అల్కా లాంబా స్వయంగా 'నారీ న్యాయ్' స్పెషల్ బ్యాడ్జ్‌ను ధరింపజేసి గౌరవించడం విశేషం.

**మీడియా రంగంలోనూ 'క్రాంతిజ్యోతి'గా తమదైన ముద్ర..**

తెలుగు జాతీయ దినపత్రిక 'క్రాంతిజ్యోతి' న్యూస్ ఛానల్ ద్వారా మీడియా రంగంలోకి అడుగుపెట్టి, ఒక స్వచ్ఛంద సంస్థ నుండి మీడియా రంగంలో తమదైన ముద్ర వేసుకున్నారు. జర్నలిజం రంగంలో ఆమె చేస్తున్న పోరాటానికి గానూ 'డాక్టరేట్ ఇన్ జర్నలిజం' కూడా లభించటం గమనార్హం. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో, సావిత్రి బాయి పూలే, గద్దర్ వంటి మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ రజిని రుద్రమ చేస్తున్న ఈ ప్రయాణం భావితరాలకు గొప్ప స్ఫూర్తినిస్తోంది.



# దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హనుమకొండ, మార్చి 02 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డిఆర్డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట ,మార్చి 02 (వుదయం ప్రతినిధి) :**

లింగాలపల్లి ప్రభుత్వ పాఠశాలను గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు ఆకస్మికంగా సందర్శించారు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలో నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు ఏ తరగతి చదువుతున్నారు భవిష్యత్తులో ఏమవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారో తెలుసుకున్నారు కొంతమందిని పాఠాలు చదివిస్తూ మరికొంతమందిని ప్రశ్నలు అడిగి వారి శక్తిని పరిశీలించారు పిల్లలు ధైర్యంగా సమాధానాలు చెప్పడం పట్ల ఎమ్మెల్యే గారు సంతోషం వ్యక్తం చేశారుఈ పాఠశాలలో ఎమ్మెల్యే గారి శ్రీమతి వరలక్ష్మి గారు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో కూడా ప్రత్యేకత ఏమాత్రం చూపకుండా సాధారణంగానే పాఠశాల పనితీరును పరిశీలించారు అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధన విధానం విద్యార్థుల హాజరు శాతం పాఠశాలలో వసతులు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు

# అంగన్వాడి కేంద్ర భవనానికి స్థలం కేటాయించాలి కలెక్టర్‌కు వినతి



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 02 (వుదయం జిల్లా ప్రతినిధి):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో మంజూరైన అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి తక్షణమే స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచ్ ఏల్పుల సరిత జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకుసోమవారం వినతిపత్రం అందజేశారు.గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి స్వంత భవనం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి మంజూరు చేసినప్పటికీ స్థలం కేటాయింపు లేక పనులు ప్రారంభం కాలేదని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ రాహుల్ శర్మ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# కుటుంబ సభ్యులతో గడపండి

**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ క్రైం, మార్చి 02 (వుదయం ప్రతినిధి) :**

పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో సబ్ ఇన్స్పెక్టర్లు సిద్దయ్య, సాంబారెడ్డి కనకచంద్రం, సయ్యద్ చాంద్ పాషా,లింగారెడ్డి ,రాజు ఆర్.ఎస్.ఐ మహమూద్, ఏ. ఆర్. ఏ. ఎస్. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్ళు రమేష్, రాములు వున్నారు. ఈ సందర్భంగా అదనపు సీపీ మాట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవాలందించిన పదవీవిరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని. పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని. పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు భద్రపర్చుకోవాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్,ఆర్. ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, ఆర్. ఎస్. ఐ శ్రవణ్ కుమార్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

**శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం : వరంగల్ సీపీ**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు 91వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాద రావు చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీపీలు, అదనపు డీసీపీ, ఏసీపీ, ఇతర పోలీస్ అధికారులు పూలతో నివాళులర్పించారు. ప్రజాసేవకు అంకితమైన మహా నాయకుడు శ్రీపాదరావుని వరంగల్ సీపీ పేర్కొన్నారు.

## అంగన్ వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సర్పంచ్ రమేష్ నాయక్



**ఊర్కొండ, వుదయం:**

మండలంలోని గుండ్ల గుంటపల్లి గ్రామాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జర్పులావత్ రమేష్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో నాణ్యత గల గుడ్లను అందించాలని, పౌష్టికాహారం లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని అంగన్వాడి టీచర్ రజినీకి తెలిపారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందించే గుడ్లు చిన్నవిగా ఉన్నాయని వాటిని ఉన్నత అధికారులు పరిశీలించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఉప సర్పంచ్ కొండల్ తదితరులు ఉన్నారు.

## ఉరుకొండ పేట పశువైద్యశాలకు మండల అధికారి డాక్టర్ రాజేష్ అకస్మాత్తుగా తనిఖీ

**ఊర్కొండ, వుదయం**



ఊర్కొండ పేట లోని పశు వైద్యశాల తనిఖీ చేసిన మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ 10 గంటలైన అయినా డాక్టర్ కంపౌండర్.అటెండర్. రాక పోవడంతో పాటు తాళం తీయకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఉర్కొండ పేట వెటర్నరీ హాస్పిటల్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలు సుమారుగా ఐదు గ్రామ పంచాయతీలు కలిపి ఊరుకొండ పేట వెటర్నరీ హాస్పిటల్ మాత్రమే ఉంది అయితే సిబ్బంది అందుబాటు లేకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయని మండల పశు వైద్య అధికారి Dr రాజేష్ తెలిపారు . జిల్లా అధికారులను దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది పైన తగు చర్యలు తీసుకుంటానని మండల పశు వైద్య అధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు

## హోలీ పండుగను సంప్రదాయ పద్ధతిలో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి..

### నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట, వుదయం**




హోలీ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, సాంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని సూచించారు. హోలీ పండుగతో పాటు రంజాన్ మాసం కూడా కొనసాగుతున్నందున మతసామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగలు నిర్వహించుకోవాలని తెలిపారు. మత పెద్దలతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతి వేగం, రష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రధాన చౌరస్తాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు, రంగు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు. బైకులు, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు.హోలీ అనంతరం చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో యువత తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే అక్కడ కూడా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా ప్రజలంతా శాంతియుతంగా, భద్రంగా హోలీ పండుగను జరుపుకుని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## ఏజెన్సీల విధానం రద్దు చేయాలి..

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి సురేష్




**నారాయణపేట, వుదయం**

కాంట్రాక్ట్ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసే కాంట్రాక్ట్ ఏజెన్సీల విధానం రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందించే విధంగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ విభాగాల కార్మికుల విస్తృత సమావేశం నారాయణపేట మెడికల్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా ఆరోగ్య రంగంలో దశాబ్దల తరబడి పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు కనీస వేతనాలకు నోచుకోక ఉద్యోగ భద్రత లేక కాంట్రాక్ట్ ఏజెన్సీల దోపిడీలో తీవ్రమైన శ్రమ దోపిడీకి ఆర్థిక నష్టానికి గురవుతూ నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 60 ప్రకారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లిస్తామని అధికారులు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం వేతనాలు చెల్లింపుల్లో పారదర్శకత లోపించిందని దుయ్యపడ్డారు. ఏజెన్సీల ఎంపిక విధానమే లోపభూయిష్టంగా ఉన్నదని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీ విధానానికి స్వస్తి చెప్పి తక్షణమే కార్పోరేషన్ వ్యవస్థను తీసుకువచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 7 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, కాలం చెల్లిన పాత ఏజెన్సీని రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని, జాతీయ,పండగ,ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నారాయణ పేట జిల్లా నేత ఎస్ సంతోష్, ఆసుపత్రి కార్మికులు లక్ష్మయ్య, దయానంద్, కరుణాకర్, శ్రీను, ప్రకాష్, యాదేశ్, వెంకటేష్, రాజు, వెంకట్ రాములు, వెంకటేష్, అంబిక, అశ్వినీ, దేవిక, గాయత్రి, పల్లవి, కవిత, సత్యమ్మ, లక్ష్మి, అనురాధ, భూదేవి, అరుణ,అనాంద, లక్ష్మి,నర్మద తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ద్వారా 12 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన ఎస్పీ టి. శ్రీనివాస రావు

**గద్వాల, వుదయం**



జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి మరొక సమర్థ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన మొత్తం 12 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో తక్షణం సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, “ప్రజల నమ్మకం పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యమైనది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చు.ఎక్కడైనా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో మమ్మల్ని సంప్రదించాలి” అని పేర్కొన్నారు. భూ వివాదాలు, ఆస్తి సమస్యలు, కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టపరమైన పరిష్కారమే తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈరోజు అందిన ఫిర్యాదుల వివరాలు: కొడుకు, కూతురు అన్నం పెట్టడంలేదని – 01, గుంటూరు ఎ.సి గోదాములో మిర్చి బస్తాల మాయం ఘటనపై – 01, భూ వివాదాలు – 01, ప్లాట్ వివాదాలు – 04, భార్యాభర్తల గొడవలు – 01, ఇతర సమస్యలు – 04, మొత్తం: 12 ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ప్రజావాణికి 21 ఫిర్యాదులు



**నారాయణపేట, వుదయం**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంధర్ రెడ్డి,అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరుకొండ పేట పశువైద్యశాల లో సమయపాలన పాటించని సిబ్బంది- సిబ్బంది ఇష్టారాజ్యం

**ఊర్కొండ, వుదయం**



ఊర్కొండ పేట లోని పశు వైద్యశాల హాస్పిటల్ ఉన్న అధికారులు అటెండర్. కాంపౌండర్ గాని విధులకు నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉర్కొండ పేట వెటర్నరీ హాస్పిటల్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలు సుమారుగా ఐదు గ్రామ పంచాయతీలు కలిపి ఊరుకొండ పేట వెటర్నరీ హాస్పిటల్ మాత్రమే ఉంది ఇందులో సిబ్బంది ఎప్పుడు వస్తారు ఎప్పుడు పోతారు ఎవరికి తెలవదు. ఈ హాస్పిటల్ పరిధిలో సుమారుగా 2000 నుంచి 3000పశువులుంటాయ్ ఈ పశువులకు సక్రమంగా వైద్యం అందక అనారోగ్య పాలై పశువులు బర్లు, మరణాల బరిన పడుతున్నాయి పాల రైతులకు సమయానికి పాల బిల్లులు పడక ప్రైవేటు డాక్టర్లని సంప్రదించడం వల్ల ప్రైవేట్ డాక్టర్లు విపరీతమైన అమౌంట్ తీసుకోవడం వల్ల రైతు దగ్గర పైసలు లేక ఆవులకు సరైన ట్రీట్మెంట్ అందించలేక ఆర్థికంగా నష్టపోతూ ఆవులు అనారోగ్యం పాలై చనిపోవడం జరుగుతుంది ఇక్కడ ఉన్న డాక్టర్లకు ట్రీట్మెంట్ కోసం ఫోన్ చేస్తే సమయానికి రారు వచ్చిన ఎప్పుడొస్తారో ఎక్కడ పోతారో ఏవ్వని కంటికి కనపడరు ఊరుకొండ పేట రైతు బోల్గం మల్లేష్ గౌడ్ ఆవు అది లేవలేని స్థితిలో ఉన్నది దానికి ట్రీట్మెంట్ చేద్దాం అంటే అందుబాటులో డాక్టర్లు లేరు ఆ ట్రీట్మెంట్ కోసం ప్రైవేటు డాక్టర్ని సంప్రదించి సుమారుగా ఆవుకు అమౌంటు 15 వేల వరకు ఖర్చయింది.
గవర్నమెంట్ వెటర్నరీ హాస్పిటల్లో గవర్నమెంట్ జీతాలు తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని. ఊర్కొండ పేట గ్రామ సర్పంచ్ దీని మీద చర్య తీసుకోగలరు పాల రైతులు తెలిపారు. ఈ హాస్పిటల్ లో పశువులకు సంబంధించిన మందులు ఇంజెక్షన్లు ఎప్పుడు వస్తాయో ఎక్కడ పోతాయో తెలవదు అసలు చిన్న ఇంజక్షన్ కూడా ఉండదు మరి ఈ వచ్చిన మందులన్నీ ఎక్కడ పోతున్నాయి ఉరుకొండ పేట రైతులు అడుగుతున్నారు.

## పోలీస్‌స్టేషన్లకు టెన్త్ ప్రశ్నపత్రాలు



**నాగర్ కర్నూల్, వుదయం**

జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానుండగా, వాటికి సంబంధించిన ప్రశ్నపత్రాలు జిల్లాకేంద్రానికి చేరుకున్నాయి. ఆదివారం పేపర్ -1 రాగా , సోమవారం కలెక్టరేట్ నుండి పేపర్-1 ప్రశ్న పత్రాలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు వాటిని పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. జిల్లాలో 20 మండలాలు,4 మున్సిపాల్టీలో పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. కాగా 4 రూట్ల ద్వారా ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లకు పరీక్షా పేపర్లను పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. నాగర్ కర్నూల్ డీఈవో ఏ. రమేష్ కుమార్ పర్యవేక్షణలో ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్, రూట్ అధికారుల ద్వారా పరీక్షా పత్రాలను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపించారు. జిల్లాలో 60 పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 10,658 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, నాగర్ కర్నూల్ ఎంఈఓ కురుమయ్య, ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య ఎ కృష్ణారెడ్డి, మండల విద్యాధికారులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్



**వెల్దండ, వుదయం**

వెల్దండ మండలం బర్కత్పల్లి గ్రామ సర్పంచి మల్లేడి నవ్య రాజు తోపాటు వార్డ్ మెంబర్లు మొగిలి జంగయ్య, కోడెల సంతోష, గొడుగు అలివేలు శ్రీను, గొడుగు నర్సింహా, గొడుగు కొండల్ లు హైదరాబాద్లోని నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ మేరకు వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు మరియు గ్రామస్తులు. నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, కృష్ణ, ఎనుముల శేఖర్ రెడ్డి, లచ్చిరాం, మార్కెట్ డైరెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**వట్ పల్లి, వుదయం**



మండలంలోని పోతులబొగుడ గ్రామంలో గ్రామ సర్పంచ్ ముద్దపురం రాజు ఆధ్వర్యంలో మహేందర్ ఐ విజన్ కంటి దవఖన అధ్యక్షతన ఉచిత వైద్య కంటి పరీక్ష శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముద్దపురం రాజు మాట్లాడుతూ దేహానికి అవయవాలలో కెల్లా ప్రధానమైన అవయవము కండ్లు అని అన్నారు దేహానికి ఇతర అవయవాలు వేరు దేహానికి వెలుగునిచ్చే కండ్లు వేరు అన్నారు కండ్లు ఒకటి మబ్బులు అయితే దేహానికి మొత్తము అంధాకారము చుట్టుకుంటున్నది అన్నారు. ఆరునెలలకు ఒకసారి ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం అన్నారు. కంటి పరీక్షలను అదేవిధంగా నిత్యము వైద్య నిపుణులు మహేందర్ జోగిపేటలో వందలాదిమందికి కంటి పరీక్షలను నిర్వహిస్తూ అనేకమంది జీవితాలలో వెలుగులను ప్రకాశింపజేయడం ఆయనకున్న నైపుణ్యతతో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అనేకుల మన్నలను పొందుతూ పేరు తెచ్చుకోవడం మండలానికి కాకుండా నియోజకవర్గంలో గుర్తింపు తెచ్చుకోవడం ఆయన చేస్తున్న సేవలేనన్నారు 100 మందికి పైగా కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కండ్లజోళ్లను పంపిణీ చేశారు కంటి వైద్య పరీక్ష ఉచిత వైద్య కంటి పరీక్ష శిబిరం తరపున ధన్యవాదాలు తెలిపారు. కంటిజబ్బులతో బాధపడేవారు కళ్ళు మబ్బు మబ్బులుగా ఉన్నవారు కండ్లకు దగ్గర చూపుదూరం చూపు కనిపించకపోవడం తో బాధపడేవారు కండ్లు ఎర్రగా కావడం తలనొప్పి మైగ్రేన్ కళ్ళు లాగడం కళ్ళకు అన్ని రకాలైన కంటి సమస్యలకు వైద్యము మా వద్ద అన్ని రకాలైన బ్రాండెడ్ ఫ్రేములు బ్రాండెడ్ లెన్స్ లు సరసమైన ధరలకు మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి సంగారెడ్డి లోని పోతిరెడ్డి పల్లె చౌరస్తా రోడ్డు బజాజ్ ఎలక్ట్రానిక్ క్లియర్ విజన్ కంటి దవఖానలో ఆపరేషన్లు కూడా చేయబడును వివరల కు జోగి పేట రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్డు ఆక్స్ఫర్డ్ స్కూల్ ప్రక్కన మనో గ్రోమోర్ ఎదురుగా మహేందర్ ఐ విజన్ కంటి దవఖన యందు సంప్రదించగలరు ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సేల్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి సహకరించాలి..

### మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

**కల్వకుర్తి, వుదయం**



పట్టణ అభివృద్ధికి సహాయ సహాకారాలు అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధవత్ సంతోష్ ను కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ గారు కోరారు. సోమవారం కౌన్సిలర్ లతో కలిసి పూల బొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కల్వకుర్తిలో నెలకొన్న సమస్యలపై విన్నవించారు. అదే విధంగా SC షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ సముదాయలను పెంచాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ లు మబ్బు రామరాజు, కుడుముల చంద్రకాంత్ రెడ్డి, గణేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, చిన్న, నాయకులు మబ్బు సాయిలు, రావుల కేశవులు, పంబళ్ల కుమార్, బంగారి, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, ఏనుగొండ నరేందర్, కృష్ణ, శ్రీను, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరించిన డిఎస్పి

**జహీరాబాద్, వుదయం**



ఝరాసంగం మండలం పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల పోస్టర్‌ను జహీరాబాద్ డిఎస్పి సైద్ నాయక్ ఆవిష్కరించారు. మార్చి 04, 06, 08 తేదీలలో జరిగే ఈ జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిఎస్పిని ఉత్సవ కమిటీ సభ్యులు మాణిక్ పాటిల్, వెంకటేశం ఘనంగా సన్మానించి, జాతరకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, ఆధునిక కాలంలో కూడా నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత ఫోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమలోని కళా ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. జాతర కార్యక్రమ వివరాలు ఇలా ఉన్నాయి: మార్చి 04 (బుధవారం): అమ్మవారికి అభిషేకం, సాయంత్రం బోనాలు, ఎల్లమ్మ నాటకం – భాగం 1, మార్చి 06 (శుక్రవారం): నిత్య పూజలు, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎల్లమ్మ నాటకం – భాగం 2, మార్చి 08 (ఆదివారం): ప్రత్యేక పూజలు, ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటకం – భాగం3 (ముగింపు)గత 32 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ జాతర ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామపెద్దలు, గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## కబ్జాదారుల పై చర్యలు తీసుకోవాలి..



**సంగారెడ్డి, వుదయం**

లేని భూమి పై అక్రమంగా పాస్ బుక్ పొంది,అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని భూ కబ్జా కి పాల్పడుతున్న వారి పై చర్యలు తీసుకోని అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ప్రజా వాణి లో బాధితురాలు ఫిర్యాదు.. సదశివాపేట మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి తమ భూమి సర్వే నెంబర్ 474 / ఈ 2 లో 4 గుంటల భూమి లో అక్రమంగా లేని భూమి లో బై నెంబర్ తో అక్రమంగా పాస్ బుక్ పొంది అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని దౌర్జన్యంగా అక్రమంగా భూమి స్థలం లోకి ప్రవేశం చేసి భూ కబ్జా కు పాల్పడుతూ సిమెంట్ స్తంబాలు తొలగించి భౌతిక దాడులు చేసిన వారి పై చర్యలు తీసుకోని అక్రమంగా జారీ చేసిన పాస్ బుక్ అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్ రద్దు చెసీ. భూమి కి రక్షణ కల్పించాలని అక్రమ దారుల నుండి ప్రాణ రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి లో మరియు జిల్లా ఎస్ పి కార్యాలయంలో ఎస్ పి కి వేరు వేరుగా వినతిపత్రం ఇచ్చిన పెద్ద పూర్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి.ఇట్టి కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర పెద్ద పూర్ గ్రామస్తులు వడ్ల లక్ష్మణ్, మన్నే బాబన్న తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ సెంటర్ బ్యాంక్ సమీపంలో బైక్‌లో మంటలుత్పటిలో తప్పిన ప్రమాదం!



**అలంపూర్ వుదయం**

శాంతినగర్: కర్నూల్ నుండి శాంతినగర్ వైపు వస్తున్న ఒక బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడం కలకలం రేపింది. శాంతినగర్ సెంటర్ బ్యాంక్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది స్థానికుల కథనం ప్రకారం, బైక్ ఇంజిన్ సమీపంలో ప్లాస్టిక్ ఖాళీ బాటిల్ ఉండటంతో, ప్రయాణంలో ఇంజిన్ వేడి ఎక్కువై ఆ బాటిల్ కరిగి మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన ప్రయాణికుడు వెంటనే అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేశారు. సమీపంలోనే నీళ్లు అందుబాటులో ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పి అందరూ ఊపిరి పీల్చుకున్నారు వాహనదారులు తమ బైక్ ఇంజిన్ల వద్ద ప్లాస్టిక్ వస్తువులు లేదా ఇతర సామాగ్రి లేకుండా జాగ్రత్త వహించాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

## బీసీ వసతి గృహాల వంట పాత్రల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

**నాగర్ కర్నూల్, వుదయం**



జిల్లాలో నిర్వహించబడుతున్న 28 ప్రభుత్వ బి.సి ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్-మెట్రిక్ వసతి గృహాలకు అవసరమైన 28 రకాల వంటపాత్రలు (Utensils) మరియు ఇతర సామాగ్రి సరఫరా చేయుటకు, ప్రభుత్వ గుర్తింపు పొందిన మరియు చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్ కలిగిన ఆసక్తి గల వ్యాపారస్తుల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు నాగర్ కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదగిరి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహ్వానించబడుతున్నవి.టెండర్ దరఖాస్తుదారులు రూ. 20,000/- (ఇరవై వేల రూపాయలు) మొత్తాన్ని District B.C Development Officer, Nagarkurnool వారి పేరుమీద డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జమ చేయవలెను.టెండర్ షెడ్యూల్ ఫారములు 04-03-2026 నుండి 09-03-2026 వరకు ప్రతి రోజు ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు జిల్లా బి.సి అభివృద్ధి అధికారి కార్యాలయం, నాగర్ కర్నూల్ వద్ద పొందవచ్చును.పూర్తి చేసిన టెండర్ దరఖాస్తులను 10-03-2026 న సాయంత్రం 4.00 గంటలలోగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీల్డ్ బాక్స్‌లో వేయవలెను. గడువు తర్వాత వచ్చిన టెండర్లు పరిగణించబడవు.సమర్పించిన టెండర్లు 13-03-2026 న మధ్యాహ్నం 3.00 గంటలకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, నాగర్ కర్నూల్ గారి సమక్షంలో తెరవబడునని ఆయన తెలిపారు.ఈ టెండర్ ప్రక్రియను వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నాగర్ కర్నూల్ గారికి పూర్తి అధికారము కలదు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీనాగర్ కర్నూల్ జిల్లా ఆదేశాల మేరకు టెండర్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలు తెలిపారు.

## రాహుల్ గాంధీతో గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి కుటుంబ సభ్యులు

**గద్వాల, వుదయం**




జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి కుటుంబంతో కలిసి రాహుల్ గాంధీ ఫోటోలు దిగారు. అనంతరం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతు రాజీవ్ రెడ్డి చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల సమయంలో తొలిసారి పరిచయం అయినప్పటి నుంచి రాజీవ్ రెడ్డి పార్టీకి నిబద్ధతతో పనిచేస్తూ అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తున్నా రని గుర్తు చేశారు సంవత్సరాలుగా కలిసి పనిచేసిన అనుబంధాన్ని స్మరించుకుంటూ ఆయన కష్టపడి పనిచేసే నాయకుడని అభినందించారు పార్టీకి రాజీవ్ రెడ్డి వంటి అంకితభావం కలిగిన నాయకులు అవసరమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవడంలో ఇలాంటి నాయకుల పాత్ర కీలకమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి మరింత ఊతం లభించనుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చక్కని ఆరోగ్యం

# క్యాన్సర్ వస్తే కనిపించే లక్షణాలు



క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ప్రాణాలను రక్షిస్తుంది. చాలా మంది నిర్లక్ష్యం చేసే 10 ముఖ్యమైన క్యాన్సర్ లక్షణాలను అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వెల్లడించింది.

బరువు తగ్గడం, జ్వరం, అలసట, చర్మ మార్పులు వంటివి ఈ సంకేతాలలో కొన్ని. ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా విజయవంతమైన చికిత్సకు అవకాశాలు పెరుగుతాయి. చాలా మంది సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేసే కొన్ని లక్షణాలు వాస్తవానికి క్యాన్సర్ తొలి సంకేతాలు కావచ్చు. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వెల్లడించిన ప్రకారం, ప్రజలు తరచుగా పట్టించుకోని 10 రకాల క్యాన్సర్ లక్షణాలను వివరంగా తెలుసుకుందాం. ఈ సంకేతాలపై అవగాహన కలిగి ఉండటం, సకాలంలో వైద్య సలహా తీసుకోవడం ప్రాణాలను కాపాడుతుంది. 1. అకస్మాత్తుగా బరువు తగ్గడం: క్యాన్సర్ సోకిన వారిలో చాలా మంది ఐదు కిలోలు లేదా అంతకంటే ఎక్కువ బరువు అకస్మాత్తుగా తగ్గిపోతుంటారు. ప్యాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తులు మరియు అన్నవాహిక క్యాన్సర్లలో ఇది సాధారణంగా కనిపిస్తుంది.2. తరచుగా జ్వరం: క్యాన్సర్ పుట్టిన తర్వాత లేదా ఇతర అవయవాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం సాధారణంగా వస్తుంది. క్యాన్సర్ చికిత్సలు రోగనిరోధక వ్యవస్థను ప్రభావితం చేయడం వల్ల కూడా జ్వరం వస్తుంటుంది.3. అలసట: విశ్రాంతి తీసుకున్నప్పటికీ తగ్గని అలసట క్యాన్సర్ లక్షణాలలో ఒకటి. లుకేమియా వంటి కొన్ని క్యాన్సర్లలో అలసటే తొలి లక్షణంగా ఉంటుంది. పెద్దపేగు లేదా కడుపు క్యాన్సర్లు రక్తహీనతకు కారణమై అలసటను కలిగిస్తాయి.4. చర్మ మార్పులు:చర్మం రంగులో మార్పులు, ముఖ్యంగా నల్లగా మారడం (హైపర్‌పిగ్మెంటేషన్), పసుపు పచ్చగా మారడం (జాండిస్), ఎర్రబడటం, దురద రావడం వంటివి చర్మ క్యాన్సర్లు లేదా ఇతర క్యాన్సర్లకు సంకేతాలు కావచ్చు. 5. మల, మూత్ర విసర్జనలో మార్పులు: ఎక్కువ కాలం పాటు మలబద్ధకం, డయేరియా లేదా మలంలో మార్పులు పెద్దపేగు క్యాన్సర్‌కు సంకేతాలు కావచ్చు. మూత్రానికి వెళ్లేటప్పుడు నొప్పి, మూత్రంలో రక్తం, తరచుగా మూత్రవిసర్జన చేయాలనిపించడం లేదా తక్కువగా మూత్రం రావడం బ్లాడర్ లేదా ప్రోస్టేట్ క్యాన్సర్‌ను సూచిస్తాయి. 6. తగ్గని పుండ్లు లేదా గాయాలు: పుట్టుమచ్చలు పెరిగి రక్తం కారడం చర్మ క్యాన్సర్‌కు సంకేతం. నాలుగు వారాల కంటే ఎక్కువ కాలం చిన్న గాయాలు మానకపోతే వాటిపై దృష్టి పెట్టాలి. నోటి క్యాన్సర్ వల్ల నోటిలో పుండు త్వరగా మానదు. జననాంగాలపై పుండ్లు కూడా క్యాన్సర్ తొలిదశకు సంకేతం కావచ్చు.7. అసాధారణ రక్తస్రావం: మలంలో రక్తం పడితే అది పెద్దపేగు క్యాన్సర్ లేదా మలద్వార క్యాన్సర్‌కు సంకేతం. గర్భాశయ క్యాన్సర్ వల్ల విపరీతమైన రక్తస్రావం కావచ్చు. మూత్రంలో రక్తం కనిపించడం బ్లాడర్ లేదా కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం. రొమ్ము క్యాన్సర్ లక్షణాలలో చనుమొనల నుంచి రక్తం కారడం ఒకటి.8.శరీరంలో గడ్డలు లేదా గట్టిపడటం: చర్మంలో, రొమ్ముల్లో, వృషణాల్లో, గ్రంధుల్లో లేదా కణజాలాల్లో అసాధారణంగా గట్టిపడటం లేదా గడ్డలు ఏర్పడటం క్యాన్సర్ సంకేతం కావచ్చు.9. మింగడంలో ఇబ్బంది: ఆహారాన్ని లేదా నీటిని మింగడంలో ఇబ్బందులు అన్నవాహిక క్యాన్సర్, కడుపు క్యాన్సర్ లేదా గొంతు క్యాన్సర్‌కు సంకేతాలు కావచ్చు. 10.దీర్ఘకాలిక దగ్గు లేదా గొంతు బొంగురుపోవడం: మూడు వారాలు దాటినా దగ్గు తగ్గకపోతే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. స్వరపేటిక లేదా థైరాయిడ్ గ్రంథిలో క్యాన్సర్‌కు గొంతు బొంగురుపోవడం ఒక లక్షణంగా ఉంటుంది.

# ఈ చేప తింటే ఆ సమస్యలన్నీ మాయం

అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు సమస్యలతో సతమతమవుతున్నారా? అయితే చేపల ప్రియుల కోసం ఒక శుభవార్త.. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. పండుగప్ప చేపను తినడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తేలింది. నాన్‌వెజ్ ప్రియుల బాగా ఇష్టంగా తినేది చేపలు. చేపల పులుసు, చేపల ఫ్రై అంటే చాలా మందికి పిచ్చి. అయితే రు మార్కెట్‌కు వెళ్లే ముందు ఈ విషయం తెలుసుకోండి. రు బరువు తగ్గాలని చూస్తున్నారా? లేదా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే పండుగప్ప చేప ఆహారంలో ఉండాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు.



ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. కొడువా చేప కేవలం రుచిలోనే కాదు ఆరోగ్య ప్రయోజనాల్లోనూ మేటి అని తేలింది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 2017-18లో పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నిర్వహించిన పరిశోధన ఫలితాలు గతేడాది విడుదలయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. పండుగప్ప చేప రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టమైంది. పండుగప్ప చేపలో ఉండే ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బులు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అంతే కాకుండా ఇందులోని ఒమేగా-3 ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఇది పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేస్తుంది. ఈ చేపలో విటమిన్-ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడమే కాకుండా వృద్ధులలో వచ్చే కంటిశుక్లం సమస్యను ఆలస్యం చేస్తాయి. అలాగే ఇతర చేపలతో పోలిస్తే ఇందులో విటమిన్-డి అత్యధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి తోడ్పడుతుంది. బరువు తగ్గాలని కఠినమైన డైట్ ఫాలో అయ్యేవారికి ఈవా చేప ఒక గొప్ప వరం. 100 గ్రాముల పండుగప్ప చేపలో సుమారు 22 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల బలానికి అవసరం. సాల్మన్ చేపతో పోలిస్తే ఇందులో కేలరీలు సగం మాత్రమే ఉంటాయి. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలు ఉండటం వల్ల ఇది శరీరంలో అదనపు కొవ్వును కరిగించి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది.

# వేసవిలో మజ్జిగ ఎక్కువగా తాగుతున్నారా?

వేసవికాలంలో చాలా మంది మజ్జిగ ఎక్కువగా తాగుతుంటారు. కొందరు సాధారణ మజ్జిగ తాగుతారు. మరికొందరు జీలకర్ర, ఇతర మసాలాలు, సుగంధ ద్రవ్యాలు కలిపి మసాలా మజ్జిగ తాగుతారు. కొందరు భోజనం తర్వాత, మరికొందరు రాత్రి భోజనం తర్వాత మజ్జిగ తాగుతారు. కానీ అందరూ మజ్జిగ తాగడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరి శరీరంలో తలెత్తే సమస్యలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి, సాధారణంగా మజ్జిగ తాగడానికి బదులుగా, మజ్జిగ తాగేటప్పుడు కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆయుర్వేదంలో, మజ్జిగ తీసుకోవడం ప్రతి వ్యక్తి శరీర స్వభావాన్ని బట్టి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, వాత స్వభావం ఉన్నవారు మజ్జిగ తాగే ముందు కొన్ని మార్పులు చేసుకోవాలి. వాత స్వభావం ఉన్నవారు నేరుగా చల్లని మజ్జిగ తాగే బదులు 1 చిటికెడు ఉప్పు కలిపి మజ్జిగ తాగాలి. ఇలా చేయడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. తరచుగా మజ్జిగ తాగిన వెంటనే టాయిలెట్‌కు వెళతారు. ఉప్పు లేదా నల్ల ఉప్పుతో మజ్జిగ తాగడం వల్ల తరచూ మూత్రానికి వెళ్లే వారికి సమస్య తగ్గుతుంది. ఇలా చేస్తే జీర్ణక్రియ బలంగా ఉంటుంది. సరిగ్గా తీసుకుంటే, వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలను సమతుల్యం చేయడంలో మజ్జిగ ప్రయోజనకరంగా ఉంటుంది. పిత్త స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: పిత్త స్వభావం ఉన్నవారు చిటికెడు గ్రాన్యులేటెడ్ చక్కెరతో కలిపి మజ్జిగ తాగాలి. పిత్తాశయ రాళ్ళు శరీరంలో వేడిని సృష్టిస్తాయి. వాపు, ఆమ్లత్వాన్ని కలిగిస్తాయి. మజ్జిగ, గ్రాన్యులేటెడ్ చక్కెర మిశ్రమం శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది మంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగలో చిటికెడు సుంతను కలిపి తాగాలి. ఇది మజ్జిగ తాగిన వెంటనే కఫం బయటకు రాకుండా చేస్తుంది. గొంతు నొప్పి, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తవు, జీర్ణక్రియ మందగించదు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా పానీయం లేదా ఆహార పదార్థం, ప్రభావం ఏ వ్యక్తిపైనా ఒకేలా ఉండదు. సరిగ్గా తీసుకుంటే, ఏదైనా ఆహార పదార్థం ఔషధంలా పనిచేస్తుంది. అందువల్ల, శరీర లోపాలు, ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా ఇది జీర్ణక్రియను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.



# ఆరోగ్యానికి ఏది మంచిది..?

ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో డైట్ చార్ట్‌లో సూపర్ ఫుడ్స్ హవా కొనసాగుతోంది. ముఖ్యంగా చియా సీడ్స్, గుమ్మడి గింజలు పోషకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అయితే బరువు తగ్గాలనుకునే వారు దేనిని ఎంచుకోవాలి? కండరాల పుష్టి కోసం ఏది మేలు చేస్తుంది? ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చనే అవగాహన అందరిలోనూ వస్తోంది. ఈ క్రమంలోనే సూపర్ సీడ్స్‌గా పిలిచే చియా గింజలు, గుమ్మడి గింజలు నేడు ప్రతి ఒక్కరి కిచెన్ డైట్‌లో భాగమవుతున్నాయి. అయితే ఈ రెండింటిలో ఏది శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. వాస్తవానికి ఈ రెండు గింజలు పోషకాల గనులే అయినప్పటికీ, వాటి పనితీరు, ప్రయోజనాలు వేర్వేరుగా ఉంటాయి. రు బరువు తగ్గాలని లేదా జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే చియా సీడ్స్ అద్భుతమైన ఎంపిక. వీటిలో గుమ్మడి గింజల కంటే సుమారు ఐదు రెట్లు ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఈ పీచు పదార్థం వల్ల ఆహారం తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. తద్వారా అనవసరమైన ఆకలి తగ్గుతుంది. అంతేకాకుండా చియా గింజలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియానికి ప్రధాన వనరులు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఎముకల దృఢత్వానికి కూడా తోడ్పడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి. మరోవైపు కండరాల బలం, మానసిక ప్రశాంతత కోరుకునే వారికి గుమ్మడి గింజలు సరైన తోడుగా నిలుస్తాయి. చియా గింజలతో పోలిస్తే వీటిలో ప్రోటీన్ శాతం చాలా ఎక్కువ. శరీర కణాల మరమ్మత్తుకు, కండరాల నిర్మాణానికి ఈ ప్రోటీన్ అత్యవసరం. అన్నింటికంటే ముఖ్యంగా గుమ్మడి గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడమే కాకుండా నరాలు, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. రాత్రిపూట నిద్ర లేమితో బాధపడేవారు ఈ గింజలను తీసుకోవడం వల్ల వీటిలోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ వల్ల ప్రశాంతమైన నిద్ర పడుతుంది. వీటిలో ఉండే జింక్ మరియు విటమిన్-ఇ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా మారుతాయి.



చివరగా ఈ రెండింటిలో ఏదో ఒకదానికే పరిమితం కాకుండా రెండింటినీ దైనందిన ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల కు ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, ఒమేగా-3 వంటి అన్ని రకాల పోషకాలు సమతుల్యంగా అందుతాయి. అయితే తీసుకునే విధానంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. చియా గింజలను ఎప్పుడూ నేరుగా పొడిగా తినకూడదు వాటిని నీటిలో లేదా స్మూతీస్ వంటి ద్రవ పదార్థాల్లో కనీసం 20 నిమిషాలు నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. గుమ్మడి గింజలను పచ్చిగా లేదా దోరగా వేయించి స్నాక్స్‌లా తీసుకోవచ్చు. శరీర అవసరాలను బట్టి ఈ సూపర్ సీడ్స్‌ను డైట్‌లో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండి.

# అందానికి ఆముదం!

అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ రకాల సౌందర్యోత్పత్తుల్ని ప్రయత్నిస్తుంటారు అమ్మాయిలు. అయితే ఇంట్లో అందుబాటులో ఉండే ఆముదం కూడా సౌందర్య సంరక్షణకు తోడ్పడుతుందని చెబుతున్నారు నిపుణులు. మరి, దాన్నెలా వాడాలో తెలుసుకుందాం రండి.. ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు ఒక చుక్క ఆముదాన్ని పెదవులకు రాసుకుంటే కొద్ది రోజుల్లోనే అధరాలు అందంగా మారతాయట. ఇలా ఆముదం సహజసిద్ధమైన లిప్‌బామ్‌గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. కొంతమంది గోళ్లు కాస్త పెరగ్గానే విరిగిపోతుంటాయి. ఈ సమస్య ఉన్న వారు రోజూ పడుకునే ముందు ఆముదంతో గోళ్లను పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఇలా కొద్ది రోజుల పాటు చేయడం వల్ల గోళ్లు దృఢంగా మారి విరిగిపోకుండా జాగ్రత్తపడచ్చు. అంతేకాదు.. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల గరుకుగా ఉన్న చర్మం కూడా మృదువుగా మారుతుందట. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల చర్మానికి తగినంత తేమ అందుతుంది. ఫలితంగా చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మం ముడతలు పడకుండా చేసే గుణాలూ ఆముదంలో బోలెడున్నాయి. అందుకే దీన్ని 'యాంటీ ఏజింగ్' చికిత్సల్లో కూడా ఉపయోగిస్తారంటున్నారు నిపుణులు. కొంతమంది అమ్మాయిలకు కనుబొమ్మలు, రెప్పలు చాలా పలుచగా ఉంటాయి. ఇలాంటివారు రోజూ రాత్రి పడుకునే ముందు ఆముదాన్ని రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే ఆముదం అందాన్ని ద్విగుణీకృతం చేసేదే అయినా.. మితంగా వాడడం, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం తప్పనిసరి! అలాగే గర్భిణులు, పాలిచ్చే తల్లులు దీనికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.



# మంచిదని ఫుల్లుగా తాగుతున్నారా..?

అతిగా నీరు తాగడం మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. తరచుగా మూత్రవిసర్జన, వాపు, తలనొప్పి వంటి లక్షణాలు అధిక హైడ్రేషన్‌ను సూచిస్తాయి. వయస్సు, బరువు, శారీరక శ్రమను బట్టి రోజుకు 2-3 లీటర్లు తాగడం సరిపోతుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాల కోసం సమతుల్య జీవనశైలి అవసరం. రు ఎంత ఎక్కువ నీరు తాగితే అది శరీరానికి, పిండాలకు అంత మంచిదని చాలా మంది నమ్ముతారు.. ఇలానే రోజు మొత్తంలో ఎక్కువ నీరు తాగుతారు.. అయితే.. మూత్రపిండాల పని రక్తాన్ని శుభ్రపరచడం, శరీరం నుండి అవసరమైన, విషపూరిత పదార్థాలను వేరు చేయడం.. మూత్రం ద్వారా వాటిని విసర్జించడం. మనం తాగే నీరు ఈ ప్రక్రియలో సహాయపడుతుంది. కానీ నీటిని అధికంగా వినియోగించినప్పుడు, అది మూత్రపిండాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది.. శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల తరచుగా మూత్ర విసర్జన, వాపు, తలనొప్పి , అలసట, వికారం, కొన్నిసార్లు తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందికి చేతులు, కాళ్ళు బరువుగా ఉండటం, నిద్ర పట్టడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ సంకేతాలు శరీరం అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని తీసుకుంటున్నట్లు సూచిస్తాయి. ఢిల్లీ ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీని గురించి సవివరంగా వివరించారు. ఒక వ్యక్తి నిరంతరం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, మూత్రపిండాలు దానిని పదే పదే ఫిల్టర్ చేయాల్సి వస్తుంది. ఇది మూత్రపిండాల సామర్థ్యంపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక నీరు శరీరంలోని ఉప్పు, ఇతర ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను దెబ్బతీస్తుంది.. దీని వలన సోడియం స్థాయిలు తగ్గుతాయి. ఈ స్థితిలో, కణాలలో నీరు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది, ఇది మెదడు, కండరాలకు హానికరం కావచ్చు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, మూత్రం చాలా పాలిపోయినట్లు కనిపించడం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం కూడా ఒక సంకేతం కావచ్చు. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, ఇప్పటికే బలహీనమైన మూత్రపిండాలు ఉన్నవారిలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, ఎక్కువ నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది.. అని వివరించారు. నీటి అవసరాలు ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండవు. అవి వయస్సు, బరువు, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా, రోజుకు 2 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. వేడి వాతావరణంలో లేదా మీరు అధికంగా చెమట పట్టినట్లయితే ఈ మొత్తాన్ని కొద్దిగా పెంచవచ్చు. దాహం వేసినప్పుడు నీరు త్రాగడం, మూత్రం రంగును గమనించడం సులభమయిన మార్గం.. లేత పసుపు రంగు సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మూత్రం స్పష్టంగా, తరచుగా వస్తూ ఉంటే, అది అధిక హైడ్రేషన్‌కు సంకేతం కావచ్చు. వైద్యుడిని సంప్రదించకుండా రు ఎక్కువ నీరు తాగే అలవాటును పెంచుకోకూడదు. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీరు మాత్రమే కాదు, సమతుల్య జీవనశైలి కూడా అవసరం. ఉప్పు తీసుకోవడం పరిమితం చేయండి.. వేయించిన ఆహారాలను నివారించండి. క్రమం తప్పకుండా భోజనం చేయండి.. తగినంత నిద్ర పొందండి.



# కోమలమైన చర్మానికి..!

వాతావరణం ఎలా ఉన్నా సరే.. కొందరి చేతులు, కాళ్లు పొడిబారి పగులుతుంటాయి. ఇలాంటప్పుడు ఈ సింపుల్ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు.

కాళ్లు, చేతులపై మృతకణాలు పేరుకున్నప్పుడు కూడా చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే వాటిని తొలగించుకునేందుకు ఇంట్లో తయారుచేసుకునే కొన్ని ప్యాక్స్, స్క్రబ్స్ అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుంది. చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. రాత్రి పడుకునే ముందు కొబ్బరినూనెను చేతులు, కాళ్లు, పాదాలకు రాసుకొని మర్దన చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం తిరిగి మృదువుగా మారుతుందట. గోరువెచ్చని నీటిలో కొద్దిగా వంటసోడా, ఏదైనా కొన్ని చుక్కల అత్యవసర నూనెను వేయాలి. కొన్ని గులాబీ రేకలూ వేసుకోవచ్చు. ఇందులో చేతులు, కాళ్లను ఓ పది నిమిషాల పాటు ఉంచి తీసేయాలి. ఇలా చేయడం వల్ల కాళ్లు, చేతుల చర్మం మృదువుగా మారుతుందంటున్నారు నిపుణులు. గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో చేతులు, కాళ్లను కాసేపు ఉంచాలి. పదినిమిషాల తర్వాత బయటికి తీసి కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆయా భాగాలకు తేమ అందుతుందట.



# కాళ్ల నొప్పులు తగ్గాలంటే...

ముప్పైలు దాటిన మహిళలు ఎదుర్కొనే సమస్యల్లో కాల్షియం లోపం ఒకటి. ఇది కాళ్లు, మోకాళ్ల నొప్పులు, ఎముకల అరుగుదల వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది. మెనోపాజ్ తర్వాత ఆస్టియో పోరోసిస్ ముప్పు అధికమవుతుంది. మరి వీటి ప్రభావాన్ని తగ్గించుకోవడానికి కాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా పాలు, పాల ఉత్పత్తులను ఆహారంలో భాగం చేసుకోవాలి. శాకాహారులు చీజ్, పనీర్, బాదం వంటివి తీసుకోవడం వల్ల కావలసినంతగా ఈ విటమిన్‌ని భర్తీ చేసుకోవచ్చు. ఒకవేళ పాల పదార్థాలు పడకపోతే... ఓ కప్పు ఉడికించిన పాలకూరని ఎంచుకుంటే సరి. మీ రోజువారీ అవసరంలో కనీసం 25శాతం భర్తీ చేస్తుంది ఇది. రోజూ గుడ్డు తింటే... కాల్షియం, విటమిన్-డి కొంత మేర లభిస్తుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. మిగిలిన దానికోసం ఎండ తగిలేలా ఓ గంటపాటు తోటలో గడపండి. అయితే, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకున్నాక ఓ గ్లాసు బత్తాయి రసం తాగండి. ఇందులోని విటమిన్ సి ఆ పోషకాన్ని శోషించగలిగే శక్తిని శరీరానికి ఇస్తుంది.



## భారత్ నుంచి 180కి పైగా విమానాలు రద్దు



ఇజ్రాయిల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై యుద్ధం ప్రకటించడంతో పశ్చిమ ఆసియా గగనతలం అల్లకల్లోలంగా మారింది. ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరగడంతో శనివారం ఒక్కరోజే భారత్ నుంచి పశ్చిమ ఆసియా దేశాలకు వెళ్లాల్సిన సుమారు 180కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. గగనతలం మూసివేత, భద్రతా కారణాల దృష్ట్యా భారతీయ విమానయాన సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. దేశీయ విమానయాన దిగ్గజాలు తమ సర్వీసులను పెద్ద ఎత్తున నిలిపివేశాయని తెలుస్తోంది.




## ఎస్‌బిఐ యోనో యాప్ బ్లాక్ అవుతుందంటూ నకిలీ ప్రచారం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోనో యాప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఓ నకిలీ సందేశం సోషల్ డియాలో వైరల్ అవుతోంది. ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయకపోతే యోనో యాప్ బ్లాక్ అవుతుందని ఈ మెసేజ్‌లో హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇదొక మోసపూరిత సందేశమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి ఓ ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి, ఇన్‌స్టాల్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు ఈ సందేశంలో కోరుతున్నారు. దీని ద్వారా వినియోగదారుల వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది ఒకరకమైన ఫిషింగ్ స్కామ్ అని అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారులను భయపెట్టి, వారి నుంచి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడమే ఈ మోసం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. తాము ఎప్పుడూ కూడా ఈ-మెయిల్స్ లేదా ఎస్ఎంఎస్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు అడగమని, అలాగే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేసుకోమని కోరమని ఎస్బీఐ పలుమార్లు స్పష్టం చేసింది. వినియోగదారులు ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. యోనో యాప్‌ను కేవలం గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ వంటి అధికారిక మాధ్యమాల నుంచే డౌన్‌లోడ్ లేదా అప్‌డేట్ చేసుకోవాలని తెలిపింది. ఇలాంటి అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## జీఎస్‌టి వసూళ్ళలో తెలంగాణ దూకుడు




జీఎస్టీ వసూళ్ళలో తెలంగాణ దూకుడు ప్రదర్శించింది. 2026 ఫిబ్రవరి నెలలో ఏకంగా రూ. 4,125 కోట్ల వసూళ్లను సాధించింది. గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే 14% వృద్ధిని నమోదు చేయడం విశేషం.దేశంలోని ఇతర అగ్రగామి రాష్ట్రాలతో పోటీ పడుతూ రాష్ట్రం రెండంకెల వృద్ధిని సాధించడం వెనుక ఉన్న ప్రధాన కారణం హైదరాబాద్ వంటి అంతర్జాతీయ స్థాయి నగరం.. అలాగే దాని చుట్టూ విస్తరించిన ఐటీ,ఫార్మా, సేవా రంగాలు అని నిపుణులు చెబుతున్నారు. ఈరంగాల నుండి వస్తున్న పన్ను ఆదాయం రాష్ట్ర ఖజానాకు వెన్నెముకగా నిలుస్తోంది. ఐటీ ఎగుమతులు పెరగడం, కొత్తగా మరిన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ కార్యాలయాలను ఇక్కడ ప్రారంభించడం వల్ల ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం సమకూరుతోంది. మరోవైపు ప్రజల కొనుగోలుశక్తి పెరగడం వల్ల రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్‌రంగాలు ఊపందుకున్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల విలువ పెరగడం, కొత్త వెంచర్లు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు పెరిగాయి.

# ఒక్కరోజే రూ.25000 పెరిగిన వెండి.. బంగారం ధరలకు రెక్కలు



పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో బంగారం ముడిపడి ఉంది. అంతే కాదు పెట్టుబడి పెట్టే వారు సైతం బంగారం సురక్షితమైన మార్గంగా చూస్తున్నారు. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండడం చాలా ముఖ్యం. గత కొద్ది నెలల నుంచి బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్లు కనిపించినా అమెరికా- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పసిడి ధరలను అమాంతం పెంచేశాయి. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకపడడం, ఊహించని విధంగా ఇరాన్ ప్రతిదాడులు చేయడం ఇప్పుడు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దీంతో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. తులం బంగారం రేటు ఏకంగా రూ.7 వేల పైన పెరిగింది. అలాగే కిలో వెండి రేటు ఒక్కరోజే రూ.25000 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 100 డాలర్ల పైన పెరిగింది. దీంతో ఔన్స్ గోల్డ్ రేటు 5278 డాలర్ల పైకి చేరి ట్రేడవుతోంది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 7.59 శాతం పెరిగింది. దీంతో ఔన్స్ వెండి రేటు 93.72 డాలర్ల పైకి చేరుకుంది. అమెరికా-ఇరాన్ యుద్ధం, ఇజ్రాయెల్ ఎంట్రీ వంటి కారణాలు బంగారం ధరలు పెరిగేందుకు కారణమయ్యాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్ పై ప్రభావం చూపించాయి. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు ఏకంగా రూ.7140 మేర పెరిగింది. దీంతో తులం బంగారంధర రూ.1,68,710 వద్దకు చేరుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ. 6,550 మేర పెరిగింది. దీంతో తులం రేటు రూ.1,54,650 వద్దకు చేరుకుంది. బంగారంతో పాటు వెండి రేటు సైతం భారీగా పెరిగింది. గత రెండు రోజులు స్థిరంగా కొనసాగుతూ వచ్చిన వెండిపై ఇరాన్-అమెరికా దాడులు ప్రభావం చూపించాయి. దీంతో ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.25000 మేర పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ. 3,20,000 వద్దకు చేరుకుంది.

# దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ కల్లోలమే..!




అమెరికా యుద్ధోన్మాదం దలాల్ స్ట్రీట్‌ను గడగడలాడించే అవకాశాలు మెండుగా కనబడుతోన్నాయి. యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్యలతో పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళన మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ ముందస్తు దాడులు చేయడంతో సోమవారం దలాల్ స్ట్రీట్ భారీ నష్టాలతో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అణు ఒప్పందంపై నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా అండతో ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడటంతో వచ్చే వారం భారత మార్కెట్లు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కోనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మధ్యప్రాచ్యంలో దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా తన నౌకాదళాన్ని మోహరించింది. శనివారం ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగడంతో ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల మార్కెట్లను వణికిస్తున్నాయి. గత శుక్రవారం సెన్సెక్స్ 961 పాయింట్లు, నిఫ్టీ 317 పాయింట్లు నష్టపోయాయి. ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో సెన్సెక్స్ దాదాపు 2300 పాయింట్లు, నిఫ్టీ 750 పాయింట్ల వరకు లేదా 2.5-3 శాతం మేర పతనమయ్యాయి. సోమవారం నుంచి ఈ పతనం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వెల్త్‌మిల్స్ సెక్యూరిటీస్ డైరెక్టర్ క్రాంతి బత్తిని హెచ్చరించారు. ముఖ్యంగా ముడి చమురు ధరలు బ్యారెల్ 80 డాలర్లు దాటితే భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని ఆయన విశ్లేషించారు. ఐటి మినహా ఆటో, చమురు, ఫైనాన్షియల్, ఎఫ్ఎంసిజి రంగాలు ఇప్పటికే అమ్మకాల ఒత్తిడిలో ఉన్నాయి. ప్రస్తుతానికి పాత స్టాక్స్‌ను తగ్గించుకుని, యుద్ధ తీవ్రత తగ్గే వరకు వేచి చూడటం ఉత్తమమని మార్కెట్ నిపుణుడు అనుజ్ గుప్తా పేర్కొన్నారు. కొత్తగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేటప్పుడు ఆచి తూచి వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రాసెసింగ్ ఫీజూ తక్కువే.. 8.75 శాతం వడ్డీకే లోన్




వివిధ ఆర్థిక అవసరాలకు చాలా మంది బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంకులు సైతం మెరుగైన క్రెడిట్ స్కోరు (750 పైన) ఉన్న వారికి తక్కువ వడ్డీ రేట్లకే ఈ రుణాలను ఇస్తున్నాయి. ఆన్‌లైన్లో కూడా వీటి కోసం అప్లై చేయవచ్చు. బ్యాంకులు కొన్ని సందర్భాల్లో పరిమిత కాలానికి స్పెషల్ వడ్డీ రేట్లను అందిస్తుంటాయి. అటువంటి ఆఫర్ సమయాల్లో లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తక్కువ వడ్డీ రేటుతో రుణాన్ని పొందవచ్చు. పేరున్న ప్రముఖ కంపెనీల్లో పని చేసే వారికి పర్సనల్ లోన్లపై వివిధ బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లు వసూలు చేస్తుంటాయి. అందుకే లోన్ కోసం దరఖాస్తు చేసే ముందు వివిధ బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లను, ప్రాసెసింగ్ ఫీజులను సరిపోల్చి చూసుకోవాలి. వ్యక్తిగత రుణాలపై వివిధ బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లు తెలుసుకుంటే తక్కువ వడ్డీ వసూలు చేసే బ్యాంకులో లోన్ తీసుకోవచ్చు. ప్రస్తుతంఅన్ని బ్యాంకుల్లోకెళ్ల బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూనియన్ బ్యాంక్ అత్యల్ప వడ్డీ రేటు ఆఫర్ చేస్తున్నాయి. ఈ రెండు బ్యాంకుల్లో పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు 8.75 శాతం నుంచే మొదలవుతున్నాయి. అలాగే ఇందులో ప్రాసెసింగ్ ఫీజు సైతం 1 శాతం వరకే ఉంది. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వారు కనిష్ఠ వడ్డీ రేటుకే లోన్ పొందవచ్చు. యాక్సిస్ బ్యాంకులో పర్సనల్లోన్ వడ్డీ రేట్లు 9.50 శాతం నుంచి మొదలవుతున్నాయి.ఇందులో ప్రాసెసింగ్ ఫీజు 2శాతం వరకు ఉంటుంది.పంజాబ్ అండ్‌సింధ్ బ్యాంకులో వడ్డీ రేటు 9.60 శాతం నుంచి ప్రారంభమవుతుండాగ ప్రాసెసింగ్ ఫీజు 1 శాతం వరకు ఉంది.




## చాలా భయపడ్డా: సింధు



దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సపంలో పేలుడు తమను ఎంతో భయాందోళనకు గురి చేసిందని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు చెప్పింది. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఇంగ్లాండ్ వెళ్లే క్రమంలో ఆమె దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్.. యూఏఈ సహా గల్ఫ్‌లో వివిధ ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ నేపథ్యంలో గగనతలాన్ని మూసివేయడంతో అనేక విమానసర్వీసులు రద్దయ్యాయి. ''దుబాయ్‌లో మావిమానం దిగగానే మా నియంత్రణలో లేని పరిణామాలు మొదలయ్యాయి. మా పైన మిసైల్‌లను అడ్డుకుంటున్న శబ్దాలు వినిపించాయి. కొన్ని గంటల తర్వాత విమానాశ్రయంలో మేం ఉంటున్న ప్రాంతానికి దగ్గర్లో పేలుడు సంభవించింది. అప్పుడు నా కోచ్ ఆప్రాంతానికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్నాడు. మేం వెంటనే ఆప్రాంతాన్ని వీడాం. అంత సపం నుంచి ఇలాంటి అనుభవం ఎదుర్కోవడం భయాన్ని కలిగించిందని సింధు చెప్పింది.

# టీ20 ప్రపంచకప్ 2026లో సెస్ చేరిన భారత్



టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెఫైనల్ చేరింది. సూపర్-8లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్చువల్ నాకౌట్ లాంటి మ్యాచ్‌లో సత్తాచాటి..గ్రూప్-1 నుంచి సెస్ చేరిన రెండో జట్టుగా నిలిచింది. 196 పరుగులను డిఫెండ్ చేసుకోలేకపోయిన వెస్టిండీస్.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. భారత జట్టు.. సెఫైనల్‌లో మార్చి 5న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాను.. ఓపెనర్ సంజూ శాంసన్ ఒంటి చేత్తో గెలిపించాడు. ఈ టోర్నీ ఆరంభంలో తుది జట్టులో చోటు కోల్పోయిన అతడు.. కీలకమైన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మ విఫలమైనా.. సంజూ మాత్రం దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. లక్ష్యం భారీగా ఉండటంతో సిక్స్‌లు, ఫోర్లతో అదరగొట్టాడు. ఈ క్రమంలోనే టీ20 ప్రపంచకప్‌లో తొలి హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు 50 బంతుల్లో 97 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో భారత్.. మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. భారత బ్యాటర్లలో అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10), సూర్యకుమార్ యాదవ్ (18) విఫలమయ్యారు. తిలక్ వర్మ (15 బంతుల్లో 27 రన్స్) క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా బ్యాటింగ్ చేశాడు. ఈ ఫలితంతో టీ20 ప్రపంచకప్ 2026 లో సెఫైనల్ బెర్తులు, మ్యాచ్‌లు ఖరారు అయిపోయాయి. గ్రూప్-1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్ సెఫైనల్ చేరాయి. గ్రూప్-2 నుంచి ఇంగ్లాండ్, న్యూజిలాండ్.. టాప్-2లో నిలిచాయి. ఇక మార్చి 4న తొలి సెఫైనల్ మ్యాచ్ సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరగనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. రెండో సె ఫైనల్ మ్యాచ్ మార్చి 5న ముంబైలోని వాంఖడే క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. ఇందులో ఇంగ్లాండ్‌తో టీమిండియా అతు తేల్చుకోనుంది. మార్చి 8న టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్.. గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది.

## అభిమానులకి క్షమాపణలు



టీ20 ప్రపంచకప్ 2026 నుంచి శ్రీలంక జట్టు నిష్క్రమించింది. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో హోరాహోరీగా పోరాడి ఓటమి పాలవడంతో టోర్నీ నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, తమ వైఫల్యానికి కీలక ఆటగాళ్ల గాయాలే ప్రధాన కారణమని శ్రీలంక కెప్టెన్ దాసున్ షనక ఆవేదన వ్యక్తం చేశాడు. అభిమానులను నిరాశపరిచినందుకు క్షమాపణలు కోరాడు. క్యాండీలోని పల్లెకెలె స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ నిర్దేశించిన 212 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక చివరి వరకు పోరాడింది. కెప్టెన్ షనక 76 పరుగులతో అజేయంగా నిలిచి వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. చివరికి శ్రీలంక 207 పరుగులకే పరిమితమై 5 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది.

# మళ్లీ విఫలమైన అభిషేక్ శర్మ




టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా.. పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత యువ ఆటగాళ్లకు ఎక్కువగా అవకాశాలు లభించాయి. అందివచ్చిన అవకాశాలను కుర్రాళ్లు రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. దీంతో టీ20 క్రికెట్‌లో భారత జట్టుకు తిరుగులేకుండా పోయింది. జట్టు ఏదైనా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగింది. ముఖ్యంగా టీమిండియా విజయాల్లో ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ .. కీలక పాత్ర పోషించాడు. తన మెరుపు బ్యాటింగ్‌తో జట్టుకు శుభారంభాలు అందించాడు. టీ20 ప్రపంచకప్ 2026లోనూ అతడు సత్తాచాటుతాడని అంతా భావించారు. కానీ ప్రస్తుతం.. సీన్ రివర్స్ అయింది. ఎన్నో అంచనాలతో తొలిసారి టీ20 ప్రపంచకప్ బరిలోకి దిగిన అభిషేక్.. దారుణ ప్రదర్శన చేస్తున్నాడు. తొలి మూడు మ్యాచ్‌లలో వరుసగా మూడు డకౌట్లు నమోదు చేశాడు. ఆ తర్వాత 15 పరుగులు చేశాడు. గత మ్యాచ్‌లో 55 రన్స్‌తో ఫామ్‌లోకి వచ్చినట్లే కనిపించిన అభిషేక్.. తాజాగా వెస్టిండీస్‌తో కీలకమైన మ్యాచ్‌లో మరోసారి విఫలమయ్యాడు. 11 బంతుల్లో 10 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. మొత్తంగా ఈ టోర్నీలో ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లలో అతడు.. 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో మూడు డకౌట్స్ ఉన్నాయి. అభిషేక్.. 13.33 సగటుతో.. 131 స్ట్రైక్ రేట్‌తో ఈ రన్స్ స్కోరు చేశాడు. ఈ టోర్నీకి ముందు వరకు 200లకు పైగా స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేసిన అభిషేక్.. ఇప్పుడు మాత్రం ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నాడు. జట్టుగా బలంగా మారుతాడనకుంటే.. బలహీనతగా మారిపోయాడు. వెస్టిండీస్‌తో మ్యాచులోనూ నిరాశపరిచాడు. సెస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో రెండు క్యాచ్‌లు మిస్ చేసిన అతడు.. 196 పరుగుల లక్ష్య ఛేదనలో 11 బంతుల్లో 10 రన్స్ చేసి ఔట్ అయిపోయాడు. మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. దీంతో ప్రస్తుతం ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న అభిషేక్‌పై సోషల్ డియాలో అతడిపై విమర్శల వర్షం కురుస్తోంది.


## టీమ్‌ఇండియా విజయంలో సంజు శాంసన్ కీలక పాత్ర పోషించాడు




టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ బ్యాట్‌తో రాణించాడు. టీమ్‌ఇండియా ఈ మ్యాచ్‌లో విజయం సాధించి, సెస్ బెర్త్ ఖాయం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. 'మేం ఆడిన విధానంతో మాకు చాలా ఆనందంగా ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన క్వార్టర్ ఫైనల్ లాంటి మ్యాచ్‌లో టీమ్ ఇండియా క్రికెటర్లు అద్భుతంగా ఆడారు. ఓపికగా ఎదురు చూసిన మంచి మనుషులకు మంచే జరుగుతుంది. ఇదంతా అతడి హార్డ్ వర్క్ వల్లే సాధ్యమైంది. అతడు ఆడిన విధానం జట్టుకు విజయాన్ని అందించింది' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. అలాగే బౌలర్ల గురించి కూడా అతడు మాట్లాడాడు. 'మా బౌలర్లు ప్రణాళిక ప్రకారమే బంతులు సంధించారు. అలాగే బ్యాటర్లు కూడా బాగా ఆడారు. భాగస్వామ్యాలే కీలకమయ్యాయి. క్రికెట్‌లో ఒత్తిడి సాధారణం. కానీ అలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యంగా బ్యాటర్లు పరుగులు తీయాలి. ఒత్తిడి లేకుండా ఆనందం లేదు' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో సంజుశాంసన్ విఫలమైన విషయం తెలిసిందే. దీంతో టీ20 వరల్డ్‌కప్ 2026లో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. కేవలం ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే ఆడే అవకాశం వచ్చింది. అయితే వాటిలోనూ పెద్దగా స్కోర్లు చేయలేదు. కానీ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం సత్తాచాటాడు. 'సంజు శాంసన్ ఓవరల్ క్లాస్‌ప్లేయర్. అతడు ఎంతమంచి క్రికెటరో మనందరికీ తెలుసు. అందుకే మేం అతడికి మద్దతుగా నిలిచాం. జట్టుకు అవసరమైన సమయంలో తన సత్తా చాటాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో తన సామర్థ్యాన్ని చూపించాడు.

# లియోనెల్ మెస్సీ మ్యాజిక్..

మేజర్ లీగ్ సాకర్ మ్యాచ్‌లో ఇంటర్ మయామి, ఆర్లాండో సిటీపై 4-2 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించింది. 0-2తో వెనుకబడినప్పటికీ, సెకండాఫ్‌లో మయామి పుంజుకున్న తీరు ఈ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ ప్రారంభమైన వెంటనే ఫస్ట్ హాఫ్‌లో ఆర్లాండో సిటీ ఆధిపత్యం ప్రదర్శించింది. 18వ నిమిషంలో మార్కో పాసాలిక్, 24వ నిమిషంలో మార్టిన్ ఓజెడా గోల్స్ చేయడంతో ఆర్లాండో 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, ద్వితీయార్ధంలో ఇంటర్ మయామి అనూహ్యంగా పుంజుకుని వరుసగా నాలుగు గోల్స్ చేసి విజేతగా నిలిచింది. ఫస్ట్ హాఫ్‌లో మయామి డిఫెన్స్ చాలా బలహీనంగా కనిపించింది. అయితే, విరామం సమయంలో కోచ్ జేవియర్ మాస్చెరానో చేసిన వ్యూహాత్మక మార్పులు ఏకంగా మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాయి. లెఫ్ట్ బ్యాక్ నోహ్ అలెన్ స్థానంలో యువ స్ట్రైకర్ మేటియో సిల్వెట్టిని రంగంలోకి దింపడంతో అటాకింగ్ అద్భుతంగా బలపడింది. ఇక ఆ జట్టు కీలక ఆటగాడు లియోనెల్ మెస్సీ మరోసారి తన క్లాస్ ఆటను ప్రేక్షకులకు చూపించాడు. 57వ నిమిషంలో స్కోరును సమం చేసిన మెస్సీ, మ్యాచ్ చివరి నిమిషంలో అద్భుతమైన ఫ్రీ-కిక్‌తో రెండో గోల్ కొట్టాడు. దీంతో 22 ఏళ్లుగా నిరంతరాయంగా గోల్స్, అసిస్ట్‌లు అందించిన అరుదైన రికార్డును మెస్సీ నెలకొల్పాడు. ఇక ఈ విజయంలో వెనిజులా మిడ్‌ఫీల్డర్ టెలాస్కో సెగోవియా కీలక పాత్ర పోషించాడు. అతను ఒక గోల్ చేయడమే కాకుండా, సహచర ఆటగాళ్లు రెండు గోల్స్‌కు చేసేందుకు సహకారం అందించాడు.



# ఉదయం సినిమా

## విష్ణు విన్యాసం
### రూ.14.7 కోట్ల గ్రాస్ కలెక్షన్స్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు లేటెస్ట్ బ్లాక్ బస్టర్ విష్ణు విన్యాసం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లు సాధిస్తోంది. ఓపెనింగ్ వీకెండ్ స్థిరంగా పెరుగుతూ వచ్చిన ఈ సినిమా మంచి పబ్లిక్ టాక్‌తో స్ట్రాంగ్ కమర్షియల్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. మొదటి రెండు రోజుల్లోనే మంచి గ్రోత్ నమోదు చేసిన ఈ చిత్రం, మూడో రోజునే రూ.5.6 కోట్ల గ్రాస్ సాధించింది. వరల్డ్‌వైడ్ తొలి వీకెండ్ కలెక్షన్స్ రూ.14.7 కోట్లకు చేరాయి. విడుదల అనంతరం వచ్చిన పాజిటివ్ పబ్లిక్ టాక్ ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది.






## 109 సెంటర్లు 50 రోజులు

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తాను మాస్‌ఫ్యామిలీ ఎంటర్టైనర్లలో తిరుగులేని రాజు అని నిరూపించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల నిర్మించిన ఆయన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మన శంకరవరప్రసాద్ గారు బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడమే కాకుండా, ఈ రోజుల్లో చాలా అరుదుగా కనిపించే 50 రోజుల థియేట్రికల్ రన్ సాధించింది. ప్రస్తుతం ఓటీటీ ప్రభావంతో థియేటర్ రన్స్ తగ్గిపోతున్న పరిస్థితుల్లో కూడా, జీ5లో విడుదలైన తర్వాత కూడా ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను అలరించింది. ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 లో కూడా ఎంఎస్ జీ ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి, పలు భాషల్లో నెంబర్ 1 ట్రెండింగ్‌గా కొనసాగడం ప్రజాదరణకు నిదర్శనం. ఈ చిత్రం రీజినల్ స్థాయిలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. చిరంజీవి, అనిల్ రావిపూడి కెరీర్‌లో తొలి 400 కోట్ల బ్లాక్‌బస్టర్‌గా రికార్డు సృష్టించింది. ఉత్తర అమెరికాలో దాదాపు 3.5 మిలియన్ డాలర్ల వసూళ్లు సాధించి గ్లోబల్ మార్కెట్‌లో కూడా తన పవర్‌ని చాటింది. అలాగే బుక్‌మైషోలో 3.8 మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడవడం రీజినల్ సినిమాల్లో హయ్యెస్ట్ రికార్డ్. ఈ విజయానికి ప్రధాన కారణం చిరంజీవి రిఫ్రెషింగ్, ఎనర్జిటిక్ అవతార్. ఆయన లైవ్లీ ఎక్స్ ప్రెషన్స్, యూత్‌ఫుల్ ఎనర్జీ, అద్భుతమైన కామిక్ టైమింగ్ ప్రేక్షకులను మళ్లీ గోల్డెన్ ఎరా గుర్తు చేస్తూ అలరించారు. కీలక పాత్రలో విక్టరీ వెంకటేష్ నటించడం, అలాగే కమాండింగ్ పాత్రలో నయనతార కనిపించడం సినిమాకు మరింత వాల్యుని జోడించింది. ఎక్స్ ట్రార్డినరీ 50 రోజుల ఫీట్ ఈ చిత్రానికి వివిధ ప్రాంతాలలోని ప్రేక్షకులతో ఉన్న బలమైన అనుబంధానికి ప్రతీకగా నిలిచింది.

## సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని
### ఎక్స్ పీరియన్స్ చేసే సినిమా



'మిస్సమ్మ', 'అదిరిందయ్యా చంద్రం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' లాంటి క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ తర్వాత శివాజీ, లయ జంటగా నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' లాంటి విజయాల తర్వాత ఈటీవీ విన్‌తో కలిసి ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పిస్తున్న సినిమా ఇది. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేసింది. క్రైమ్‌కామెడీ ఫ్యామిలీ థ్రిల్లర్‌గా వస్తున్న 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సినిమాను శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హీరో శివాజీ స్వయంగా నిర్మిస్తుండగా.. సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. ఈ నెల 6న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుధీర్ శ్రీరామ్ సోమవారం విలేకరులతో మాట్లాడారు.

**మీ నేపథ్యం ఏమిటి?**

మా నేపథ్యం కడప. నాన్న పోస్ట్ మాస్టర్. నాకు చిన్నప్పటి నుండి సినిమాలంటే ఇష్టం. సినిమా సెలబ్రిటిలా నాకు ఓ గుర్తింపు రావాలని కోరిక ఉండేది. హ్యాపీడేస్ సినిమా చూసి ఇంజనీరింగ్ పూర్తి చేశాను. 2015 నుంచి సినీ పరిశ్రమలోకి ఉన్నాను.

**శివాజీ గారిని హీరో ఎంచుకోవడానికి రీజన్?**

90స్ సినిమాలో శివాజీ గారిని చూడగానే మా నాన్న గుర్తొచ్చారు. సినిమా కథలు చెప్పే సమయంలో ఆయనకు ఎందుకు కథ చెప్పకూడదు? అనిపించి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' కథతో శివాజీ గారిని అప్రోచ్ అయ్యాను. కథ వినగానే ఆయన ఈ కథను నేనే ప్రొడ్యూస్ చేస్తాను అన్నారు.

**ఈ సినిమా ఎలాంటి కథాంశంతో ఉంటుంది?**

కథ క్రైమ్ కామెడీ. దర్శకుడు నెల్సన్ తెరకెక్కించే సినిమా తరహాలో ఉంటుంది. కో..కో.కోకిల, డాక్టర్ సినిమాలా డార్క్ కామెడీ ఉంటూ థ్రిల్లింగ్ నేపథ్యం ఉంటుంది. ఈ రోజు విడుదల చేసిన ట్రయిలర్ చూస్తే అందరికి అర్థమవుతుంది.

**ఈ సినిమాలో పాత్రలు ఎలా ఉంటాయి?**

ఈ కథలో అన్ని పాత్రలకు ఫర్‌ఫెక్ట్ ఆర్టిస్టులు కుదిరారు. ప్రతి క్యారెక్టర్‌లో కొత్త కోణం ఉంటుంది.

**శివాజీ గారి పాత్ర 90స్ కిడ్స్ లోని పాత్రకు పోలిక ఉంటుందా?**

90స్ పాత్రకు, ఈ సినిమాలో పాత్రకు ఏం సంబంధం ఉండదు. ఈ సినిమాలో ఎంతో ఎనర్జిటిక్‌గా ఉండే పాత్ర.

**పర్సనల్‌గా మీకు ఎలాంటి సినిమాలకు దర్శకత్వం చేయాలని ఉంది?**

పర్సనల్‌గా ఓ జోనర్ అని కాదు. నా నుంచి తదుపరి నాలుగు కథలు నాలుగు డిఫరంట్‌గా ఉంటాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైనర్ కథలు ఉన్నాయి. మైథలాజికల్ కథ కూడా ఉంది. ఒకే జోనర్‌కు పరిమితం కావడం నాకు ఇష్టం లేదు.

## పోలీస్ కంప్లైంట్ ప్రేమ ఓ ప్రేమ



సౌత్ ఇండియన్ టాలెంటెడ్ నటి వరలక్ష్మి శరత్ కుమార్, వెర్సటైల్ యాక్టర్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై, బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ సినిమాలో వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర జంటపై చిత్రీకరించిన బ్యూటిఫుల్ మెలోడియస్ సాంగ్ "ప్రేమ ఓ ప్రేమ" అనే పల్లవితో మొదలైన ప్రేమ గీతాన్ని సీనియర్ జర్నలిస్టు ప్రభు లాంచ్ చేశారు. ఈ పాట అన్విక ఆడియోస్ ద్వారా రిలీజ్ అయింది. "ప్రేమ ఓ ప్రేమ" పాటకు సంగీతం సుధాకర్ మారియో సమకూర్చారు. ఈ పాట యూత్‌కు బాగా నచ్చుతుందని, ట్రెండింగ్‌గా నిలిచిపోతుందని, సూపర్ హిట్ లవ్ సాంగ్స్‌ల్లో ఈ పాట కూడా చోటు దక్కించుకుంటుందని దర్శకుడు సంజీవ్ మేగోటి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. హారర్ థ్రిల్లర్, అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కించినట్టు తెలిపారు.

## విశ్వనాథ్ & సన్స్ టైటిల్ ఖరారు



సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న 'సూర్య46' చిత్రానికి 'విశ్వనాథ్ & సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పేరు విన్న తక్షణమే ఒక క్లాసీ, స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రాన్ని చూడబోతున్నామని స్పష్టమవుతోంది. సూర్య ఒక చిన్నారితో కలిసి కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు.. మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, సూర్యలోని పాతకాలపు మాధుర్యాన్ని మళ్లీ తెరపై చూపిస్తూ ప్రేక్షకులకు అందమైన అనుభూతిని కలిగిస్తున్నాయి.

భారీ స్థాయి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మమిత బైజు, రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సార్/వాతి', 'లక్కీ భాస్కర్' వంటి వరుస విజయాలతో దూసుకుపోతున్న బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గొప్ప కథకుడిగా, భావోద్వేగాలతో కూడిన రచనకు పేరుగాంచిన ఆయన, ఈ సినిమాతో మరో చిరస్మరణీయ అనుభూతిని అందించనున్నారు. విజయవంతంగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'విశ్వనాథ్ & సన్స్', జూలైలో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు, ఉత్సాహం నెలకొనగా.. వాటిని రెట్టింపు చేసేలా త్వరలోనే టీజర్ విడుదల కానుంది.



## సువర్ణ టెక్స్టైల్స్ టీజర్ విడుదల

శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్ర దారులుగా ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న "సువర్ణ టెక్స్టైల్స్ " ఈ చిత్రం టీజర్ ను ఇటీవలే విడుదల చేశారు. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎ.వై.వి.ప్రొడక్షన్స్, సనాతన క్రియేషన్స్ బ్యానర్స్ పై నిర్మాత అనిల్ ఈరుగుదిండ్ల నిర్మిస్తున్నారు. ఆదివారం ప్రసాద్ ల్యాబ్ లో దర్శకుడు వేణు ఉడుగుల ఈ చిత్రం టీజర్ ను రిలీజ్ చేశారు.

## ఏప్రిల్‌లో ఆర్ కే దీక్ష సినిమా



ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శక నిర్మాతగా డి ఎస్ రెడ్డి సమర్పణలో ఢీ, జోడి ఫేమ్ అక్సఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం "ఆర్ కే దీక్ష". ఈ చిత్రంలో తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆర్ కే దీక్ష" సినిమాను ఏప్రిల్ మొదటి వారంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు.

## ధర్మస్థల నియోజకవర్గం ఈ వారంలోనే ఫస్ట్ సింగిల్

మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా..' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ వారంలోనే ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు లేని విధంగా.. డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఈ చిత్రంలో ఓ ఐటెం సాంగ్ తో ఎంట్రీ ఇస్తున్నారు. ఆమె ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానున్నారు. 'న్యాయం చేయరా దేవుడా..' లిరికల్ సాంగ్‌తో మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మొదలు పెట్టబోతున్నాం. ఈ సాంగ్‌లో శ్రష్టి వర్మ స్టెప్స్ అందరినీ కనువిందు చేయనున్నాయి. ఈ వారంలోనే సాంగ్‌ని రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేలా ఉత్కంఠ భరితమైన సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం జరిగింది. ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అందించిన లిరిక్స్, స్టార్ సింగర్ సునీత ఆలపించిన పాటలు ఈ చిత్రానికి మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నాయి. అన్ని హంగులతో ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేయనున్నాం. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని తెలిపారు.



## సొంత ఊళ్లో పెళ్లి వేడుకలు
### 9, 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందిస్తామని ప్రకటించిన విజయ్





ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన హీరో విజయ్ దేవరకొండ తన సతీమణి రశ్మిక మందన్న, కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరు తుమ్మపేటకు వెళ్లారు. నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూరు మండలంలో ఉన్న తుమ్మన్ పేట విజయ్ సొంతూరు. పెళ్లైన తర్వాత తొలిసారి అక్కడికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు విజయ్ దేవరకొండ. విజయ్ కుటుంబానికి తుమ్మన్ పేట గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ గ్రామంలో ఉన్న తమ స్వగృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం జరుపుకున్నారు విజయ్. స్థానిక ప్రజలందరికీ విజయ్ కుటుంబ సభ్యులు పెళ్లి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ సొంత గ్రామంలో పెళ్లి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంది. మా జంటకు ఆశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మన గ్రామానికి చాలా మంచి పనులు చేయాలని ఉంది. ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళ్దాం. ఇక్కడ మాకు సొంత ఇళ్లు, పొలమూ ఉన్నాయి. ఇక నుంచి తరుచుగా మన గ్రామానికి వస్తాను. అచ్చంపేట డివిజన్ లో ఉన్న 44 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 9, 10వ తరగతి విద్యార్థులకు విజయ్ దేవరకొండ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున స్కాలర్ షిప్స్ అందిస్తాం. అన్నారు.

## జబ్ ఖులి కితాబ్ ట్రైలర్ రిలీజ్
### 6 నుంచి హిందీ జీ5లో స్ట్రీమింగ్

హిందీ జీ5 తాజాగా 'జబ్ ఖులి కితాబ్' ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. ప్రేక్షకులకు ఓ అందమైన, పరిణతి చెందిన ప్రేమను చూపించే ప్రయత్నం చేసింది. సౌరభ్ శుక్లా రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పంకజ్ కపూర్, డింపుల్ కపాడియా ప్రధాన పాత్రల్ని పోషించారు. ఐదు దశాబ్దాల పాటు కొనసాగిన వివాహబంధం, భావోద్వేగ సంక్లిష్టతలు, వృద్ధాప్యంలో విడాకులు ఎందుకు కోరుకుంటున్నారు? అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్‌లో ఎంతగా నవ్వించారో.. అంతే స్థాయిలో ఆలోచనల్ని రేకెత్తించారు.

ఈ ట్రైలర్‌ను చూస్తే.. గోపాల్ (పంకజ్ కపూర్), అనసూయ (డింపుల్ కపాడియా) ప్రపంచం ఏంటో అర్థం అవుతుంది. ఈ జంట 50 సంవత్సరాల తమ వివాహ బంధానికి ఫుల్ స్టాప్ పెట్టాలని, విడాకులు తీసుకోవాలని అనుకుంటారు. గోపాల్ విడాకులు కావాలని కోరితే.. అనసూయ మాత్రం విడాకులకు అంగీకరించదు. ఇక వారి పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లతో కుటుంబం ఎంతో నిండుగా ఉంటుంది. చావు బతుకుల్లో బెడ్డు మీద ఉండే తన భార్య కోసం గోపాల్ ఎంతో ఆరాట పడుతుంటాడు. కానీ విడాకులు ఎందుకు అడుగుతున్నాడు? దీని వెనుకున్న కథ ఏంటి? అనే ఉత్సుకతను కలిగించేలా ట్రైలర్‌ను కట్ చేశారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.